ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 23.10.2025 | సంపుటి :12 సంచిక : 92 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



### డీప్‌ఫేక్ వీడియోకు
# లేబులింగ్ తప్పనిసరి

**ఏఐ సాంకేతిక దుర్వినియోగాన్ని అరికట్టడానికి కేంద్రం కీలక సవరణలు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):జనరేటివ్ ఏఐ, డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 22నల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్, 2021కి పలు సవరణలు ప్రతిపాదిస్తూ, ఓ ముసాయిదాను విడుదల చేసింది. దీని ప్రకారం, సోషల్ మీడియా వేదికల్లో కృత్రిమంగా రూపొందిన కంటెంట్‌ను స్పష్టంగా లేబులింగ్ చేయాల్సి ఉంటుంది. సింపుల్?గా చెప్పాలంటే, కృత్రిమమేధ (ఏఐ) ద్వారా తయారు చేసిన కంటెంట్, డీప్‌ఫేక్ కంటెంట్ అని సదరు వీడియో లేదా ఆడియో మిగతా 2లో..

# ఉస్మానియా ఆస్పత్రిని రెండేళ్లలో పూర్తిచేయాలి

**ఆధునాతన వైద్య సదుపాయాలు కల్పించాలి**

**పనుల వేగవంతానికి వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ**

- రానున్న వందేళ్ల అవసరాలకు తగినట్లు వసతుల కల్పన
- పనుల తీరుపై తరచూ క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయాలి
- ఆధునిక పద్ధతుల్లో అవసరాల మేరకు నిర్మాణాలు
- ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలు సిద్ధం చేయాలి
- ఇబ్బందులు లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు





హైదరాబాద్(జనంసాక్షి): గోషామహల్ వద్ద చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్షించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సీఎం సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పది రోజులకోసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ పనులు మిగతా 2లో..



**గ్రామీణ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా**

# ముందుకెళ్తున్నాం

- ప్రతిభ ఉన్నా సరైన అవగాహన లేకే కొలువులకు దూరం
- అందుకే వారి కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నాం
- పాల్గొననున్న 250 ప్రముఖ కంపెనీలు: మంత్రి ఉత్తమ్

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి): గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు పెద్ద మొత్తంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గాను ఈ నెల 25న హుజూర్‌నగర్‌లో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఇంజనీరింగ్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలు ఎక్కువ మంది నిరుద్యోగ యువత జాబ్ మేళాకు హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. బుధవారం కలెక్టరేట్ లో ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంజనీరింగ్,డిగ్రీ , పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లతో జాబ్ మేళాపై ఏర్పాటు చేసిన ముందస్తు సమావేశంలో మంత్రి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ఆర్థికంగా వెనుకబడిన వారు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారని, అయితే ఉద్యోగ అవకాశాలు లేకపోవడం,అవగాహన రాహిత్యం వల్ల వారు ఉద్యోగ అవకాశాలను అందుకోలేకపోతున్నారని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి నల్గొండ నిరుద్యోగ యువతకు మంచి అవకాశాలు మిగతా 2లో..

# నేడు మంత్రివర్గ సమావేశం



**స్థానిక ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లపై కీలక నిర్ణయం వెలువడే అవకాశం**

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ మంత్రి వర్గంసీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాయలంలో సమావేశం కానుంది. మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీం మిగతా 2లో..

# రవాణా చెక్‌పోస్టులు రద్దు

- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎత్తివేత
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో తక్షణ చర్యలు
- ఇకపై నంబర్ ప్లేట్ రికగ్నేషన్ అమలు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రహదారులపై ఉన్న రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆదేశాలిచ్చారు. దీంతో తక్షణమే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సాయంత్రం 5 గంటల్లోగా మూసివేతపై పూర్తి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. మిగతా 2లో..






**జూబ్లీహిల్ ఉపఎన్నికలో**

## వామపక్షాలు, కోదండరాం
# కాంగ్రెస్‌కు మద్దతు

**ఇప్పటికే మద్దతు ప్రకటించిన ఎంఐఎం**

హైదరాబాద్(జనంసాక్షి):జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక నేపథ్యంలో రాజకీయ చర్చలు వేడెక్కాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బుధవారం తెలంగాణ జన సమితి (టీజేఎస్) కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండ రామ్‌ను కలిశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలన్న అంశంపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. కోదండరామ్‌తో జరిగిన సమావేశం అనంతరం టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావంలో కోదండరామ్ పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఆయన నిస్వార్థంగా, నిజాయితీతో రాష్ట్ర సాధన కోసం కృషి చేశారని గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఎలా నిరంకుశంగా మారిందో అందరికీ తెలుసని మహేష్ గౌడ్ మిగతా 2లో..

# టపాసులు కాల్చి..
## 60 మందికి కంటి గాయాలు

- సరోజిని ఆస్పత్రిలో అత్యవసర చికిత్స
- ఆస్పత్రికి క్యూ కట్టిన క్షతగాత్రులు




హైదరాబాద్(జనంసాక్షి):దీపావళి వేడుకల సందర్భంగా పటాకులు పేల్చే సమయంలో పిల్లలతో సహా అనేక మందికి కంటి గాయాలు అయ్యాయి. మెహదీపట్నంలోని సరోజినీ దేవి కంటి ఆసుపత్రికి చికిత్స కోసం 60 మంది వరకు వచ్చారుగాయపడిన వారందరికీ తక్షణ వైద్య సహాయం అందించబడిందని, వారి పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇబ్రహీం తెలిపారు. 18 మంది వరకు తీవ్ర గాయాలతో ఆసుపత్రికి చేరుకోగా , మరి కొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిలో ఎక్కువ మందిని ప్రథమ చికిత్స తర్వాత ఇంటికి పంపించగా, మిగతా 2లో..



# ఇకపై షోరూముల్లోనే వాహన రిజిస్ట్రేషన్లు

**ఈ అంశంపై ఆలోచిస్తున్నాం : మంత్రి పొన్నం**

- రవాణాశాఖలో ఏఐ సాంకేతికత అమలు
- ఢిల్లీ కాలుష్యం దృష్ట్యా హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):ఢిల్లీలో కాలుష్యం ఎలా ఉందో అందరం చూస్తూనే ఉన్నామని.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ప్రణాళికలు చేపట్టినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రవాణాశాఖ కార్యాలయాల్లో మధ్యవర్తులు లేకుండా చేస్తాం. ఈ శాఖలో ఏఐ వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రూ.577 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చాం. దీంతో ఆ వాహనాల విక్రయాలు 0.03 శాతం నుంచి 1.30 శాతానికి పెరిగాయి. వాహన సారథి పోర్టల్‌ను పూర్తిగా అందుబాటులోకి తెచ్చాం. రాష్ట్రంలో వాహనాల సంఖ్య 1.70 కోట్లకు చేరింది. షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్ చేసే అంశంపై ఆలోచన చేస్తున్నాం. ప్రజలు సహకరిస్తేనే.. ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యం తగ్గుతుందని మంత్రి పొన్నం అన్నారు. ఇకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ట్రాన్స్‌పోర్ట్ చెక్‌పోస్టులను తక్షణమే మూసివేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆర్టీఏ చెక్ పోస్టుల రద్దు చాలా పెద్ద నిర్ణయమని పేర్కొన్నారు. చెక్ పోస్టుల మిగతా 2లో..



# ప్రతిష్టాత్మక గ్లోబల్ సదస్సుకు కేటీఆర్‌కు ఆహ్వానం

**గ్లోబల్ ఎకనామిక్ అండ్ టెక్నాలజీ సమ్మిట్'లో కీలకోపన్యాసం చేయాల్సిందిగా వినతి**

హైదరాబాద్(జనంసాక్షి):మాజీ ఐటీశాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుకు మరో అరుదైన గౌరవం దక్కింది. శ్రీలంక కొలంబోలో జరగబోయే ప్రతిష్ఠాత్మక 'గ్లోబల్ ఎకనామిక్ అండ్ టెక్నాలజీ సమ్మిట్ 2025' సదస్సులో ఆయనకు కీలకోపన్యాసం చేసేందుకు ఆహ్వానం అందింది. ఈ సదస్సు నవంబర్ 10 నుంచి 12 వరకు కొలంబోలో జరగనుంది. మిగతా 12లో..



# పసిడి ధరలు పతనం

- ఒక్క రోజులోనే రూ.9వేలు తగ్గుదల
- అదే బాటలో వెండి

హైదరాబాద్(జనంసాక్షి): రికార్డు ధరలతో ఇటీవల ఆకాశాన్నంటిన బంగారం, వెండి ధరలు తాజాగా దిగొస్తున్నాయి. హైదరాబాద్‌లో బుధవారం పసిడి ధర భారీగా పడిపోయింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.9వేలకు పైగా తగ్గడం గమనార్హం. అటు వెండి ధర కూడా దిగొచ్చింది. మిగతా 9లో..

# పెట్టుబడులకు పెద్దపీట




- సైన్స్, సాంకేతిక, అంతరిక్ష రంగాలకు కేంద్రంగా హైదరాబాద్
- శాస్త్ర సాంకేతిక రంగాలకు దన్నుగా నిలుస్తున్న ఐఐటి, ట్రిపుల్ ఐటీ, హెచ్‌సీయూ, ఉస్మానియా యూనివర్సిటీ వంటి విద్యా సంస్థలు : డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్(జనంసాక్షి):సైన్స్,సాంకేతిక, అంతరిక్ష రంగాలకు హైదరాబాద్ నగరం కేంద్రంగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాయదుర్గం జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో గ్లోబల్ ఈవెంట్స్ ఆఫ్ పయనీరింగ్ అండ్ అడ్వాన్సింగ్ క్వెస్ట్ (జియో ప్యాక్) ఆధ్వర్యంలో బయో ఇన్‌స్పైర్డ్ ఫ్రాంటియర్స్-2025 సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ శాస్త్ర, సాంకేతిక రంగాలకు చెందిన పరిశోధన సంస్థలు, పరిశ్రమలు హైదరాబాద్‌లో స్థాపించి బీజం వేశారని అన్నారు. నాటి నుంచి బీడీఎల్, డీఆర్‌డీవో, రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ తదితర ప్రఖ్యాత సంస్థలు అభివృద్ధి చేస్తూ వస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో నగరంలో ఐఐటి, ట్రిపుల్ ఐటీ, హెచ్‌సీయూ, ఉస్మానియా యూనివర్సిటీ వంటి విద్యా సంస్థలు శాస్త్ర సాంకేతిక రంగాలకు దన్నుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఫార్మా, ఐటీ, రక్షణ వంటి అనేక రకాల క్లస్టర్స్‌లో పరిశ్రమలు ఏర్పాటయ్యా యన్నారు. అంతరిక్ష రంగంలోనూ క్లస్టర్ ఏర్పాటు మిగతా 2లో..

# రూపాయికి రిపేర్లు

న్యూఢిల్లీ(జనంసాక్షి):అమెరికా కఠిన నిర్ణయాలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న భారత రూపాయికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాఅండగా నిలిచింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత దిగజారకుండా నిరోధించేందుకు భారీ ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆగస్టు నెలలో ఏకంగా 7.69 బిలియన్ అమెరికన్ డాలర్లను (సుమారుగా రూ.67 వేల కోట్లు) మార్కెట్లో విక్రయించినట్లు ఆర్బీఐ తన తాజా బులెటిన్‌లో వెల్లడించింది. ఇటీవల డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 88కి పడిపోయింది. మిగతా 2లో..




## భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై
# అమెరికా ఆసక్తి

**త్వరలో సుంకాలు తగ్గించే యోచన**

**50శాతం నుండి 15% లేదా 16%కు తగ్గింపు!**



వాషింగ్టన్(జనంసాక్షి):సుంకాలను తగ్గించేందుకు భారత్ అమెరికాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరనుంది. దీర్ఘకాలంగా నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందానికి భారత్-అమెరికాలు చాలా దగ్గరగా ఉన్నాయని, దీంతో భారత దిగుమతులపై అమెరికా సుంకాలు 50శాతం నుండి 15 నుండి 16శాతానికి తగ్గనున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇంధనం, వ్యవసాయంపై ఆధారపడిన ఈ ఒప్పందంతో, క్రమంగా భారత్ రష్యా నుండి ముడి చమురు దిగుమతులు తగ్గించుకునే అవకాశం ఉందని తెలిపాయి. సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ ఈ అంశంపై బుధవారం జాతీయ మీడియాలో ఒక కథనం ప్రచురితమైంది. అమెరికాతో చర్చల్లో భాగంగా, జన్యుపరంగా మార్పులు చేయని మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులను పెంచడానికి భారత్ అనుమతించే అవకాశం ఉందని ఆ కథనం పేర్కొంది. ఈ ఒప్పందంలో సుంకాలు మార్కెట్ యాక్సెస్‌ను క్రమానుగతంగా సమీక్షించే యంత్రాంగం కూడా ఉండవచ్చని తెలిపింది. ఈ నెలలో జరగనున్న ఏసియన్ శిఖరాగ్ర సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని నివేదించింది. భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వైట్‌హౌస్ స్పందించాల్సి వుంది. మిగతా 9లో..

# టపాసులు కాల్చి.. 60 మందికి కంటికి గాయాలు

తీవ్ర గాయాలైన వారిని చేర్చారు. ఏడుగురు వైద్యుల బృందం గాయపడిన వారికి చికిత్స అందించింది. కొంతమంది పటాకులు పేల్చేటప్పుడు గాయపడగా, మరికొందరు వాటికి దగ్గరగా వెలిగించిన క్రాకర్ల వల్ల గాయపడ్డారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో మరియు శివార్లలో గాయపడిన వారిలో కొందరు చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రులను సంప్రదించారు. ఎక్కువ మంది క్షతగాత్రులు వస్తే అదనపు కేసులను నిర్వహించడానికి ఆసుపత్రి పూర్తిగా సన్నద్ధమై ఉందని ఆయన అన్నారు .

# ఇకపై షోరూముల్లోనే వాహన రిజిస్ట్రేషన్లు

విషయంలో మరింత పారదర్శకత తీసుకొస్తామని.. ఇందులో భాగంగానే ప్రస్తుతమున్న ఆర్టీఏ చెక్ పోస్టులను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రతి ఆర్టీఏ కార్యాలయంలో సిమ్యులేటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రవాణా వ్యవస్థలో ఏఐ సేవలు మరింత వినియోగిస్తామని స్పష్టం చేశారు. బుధవారం రవాణా శాఖపై సంబంధిత అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం ఏ విధంగా ఉందో అందరం చూస్తున్నామని.. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దని అన్నారు. ప్రజలు సహకరిస్తేనే ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యం తగ్గుతుందన్నారు. రోడ్డు భద్రతపై విద్యార్థులు, ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని.. రూల్స్ అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించాలనే లక్ష్యంలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలకు రాయితీలు ఇస్తున్నామని.. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వాహనాల స్క్రాపింగ్ విషయంలో కొత్త పాలసీ తీసుకొస్తున్నామని చెప్పారు. వాహనాల స్క్రాపింగ్‌ను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు యోచిస్తున్నామన్నారు.

# రూపాయికి రిపేర్లు

ఆగస్టు నెలలో రూపాయి విలువ 1.6 శాతం వరకు క్షీణించడంతో కేంద్ర బ్యాంక్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. సాధారణంగా మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరిగినప్పుడు రూపాయి బలహీనపడుతుంది. అలాంటప్పుడు ఆర్బీఐ తన విదేశీమారక నిల్వల నుంచి డాలర్లను అమ్ముతుంది. దాంతో మార్కెట్లో డాలర్ల సరఫరా పెరిగి, రూపాయి విలువ స్థిరపడుతుంది. జూలై నెలతో పోలిస్తే ఆగస్టులో ఆర్బీఐ విక్రయించిన డాలర్లు ఏకంగా మూడు రెట్లు అధికం కావడం గమనార్హం. మార్కెట్లో తీవ్రమైన అనిశ్చితి ఉన్నప్పుడు మాత్రమే తాము జోక్యం చేసుకుంటామని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఒకవైపు డాలర్లను విక్రయిస్తూనే మరోవైపు ఆర్బీఐ వ్యూహాత్మకంగా బంగారం నిల్వలను పెంచుకుంటోంది. రెండు నెలల విరామం తర్వాత సెప్టెంబర్‌లో కొత్తగా 200 కిలోల పసిడిని కొనుగోలు చేసింది.దాంతో ఆర్బీఐ దగ్గరున్న మొత్తం బంగారం నిల్వలు 880.18 టన్నులకు చేరాయి. వాటి విలువ సుమారు రూ. 8.36 లక్షల కోట్లుగా ఉంది. ఏ దేశ కేంద్ర బ్యాంకు వద్దనైనా బంగారం నిల్వలు ఎక్కువగా ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ, కరెన్సీపై అంతర్జాతీయంగా నమ్మకం పెరుగుతుంది. సంక్షోభ సమయాల్లో బంగారం సురక్షితమైన ఆస్తిగా పనిచేస్తుంది. విదేశీ మారక నిల్వల్లో డాలర్ల వంటి కరెన్సీలు ఉన్నప్పటికీ, బంగారం నిల్వలు ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని ఇస్తాయి. అధిక బంగారం నిల్వలు దేశ రేటింగ్ మెరుగుపడటానికి కూడా దోహదపడతాయి. తద్వారా తక్కువ వడ్డీకే అంతర్జాతీయ రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ చేపడుతున్న ద్వంద్వ వ్యూహం రూపాయిని బలోపేతం చేయడానికేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మెహుల్ ఛోక్సీ అప్పగింతకు ఓకే బెల్జియం కోర్టు

న్యూఢిల్లీ: భారత్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు వేల కోట్ల రూపాయలు ఎగవేసి, దేశం విడిచి పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరస్తుడు మెహుల్ ఛోక్సీని దేశానికి రప్పించడంలో భారత్ విజయం సాధించింది.మెహుల్ ఛోక్సీని భారత్‌కు అప్పగించే విషయంలో తమకు ఎటువంటి అభ్యంతరాలు లేవని బెల్జియం కోర్టు స్పష్టం చేసింది.భారత్‌కు మెహుల్ ఛోక్సీని అప్పగించేందుకు ఈ మధ్యనే బెల్జియం న్యాయస్థానం ఆమోదం తెలిపింది. అయితే ఈ క్రమంలో తన అప్పగింత ఆమోదం అనేది రాజకీయ ప్రేరేపితమని, ఇది తన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని మెహుల్ ఛోక్సీ ఆరోపించారు. ఈ నేపథ్యంలో తాజాగా బెల్జియం యాంట్వెర్ప్ కోర్టు.. ఛోక్సీ ఆరోపణలపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఛోక్సీ బెల్జియం పౌరుడు కాదని గుర్తుచేస్తూ, అతని అప్పగింతను సమర్థించేలా, తీవ్రమైన అభియోగాలను మెహుల్ ఛోక్సీ ఎదుర్కొంటున్నాడని పేర్కొంది. ఛోక్సీపై భారత్ మోపిన అభియోగాలను బెల్జియంలోని చట్టాల ప్రకారం కూడా నేరాలుగానే పరిగణిస్తామని కోర్టు తెలిపింది. భారతదేశ ఆదేశాల దరిమిలా, తనను ఆంటిగ్వా నుంచి కిడ్నాప్ చేశారంటూ ఛోక్సీ కొంతకాలంగా చేస్తున్న వాదనలను కోర్టు తోసిపుచ్చింది. ఈ ఆరోపణలకు సంబంధించి తగిన ఆధారాలు లేవని స్పష్టం చేసింది.బెల్జియం కోర్టు తన తీర్పులో ఛోక్సీ అప్పగింత అనంతరం అతనిని ఉంచే జైలుకు సంబంధించి భారత్ అందించిన వివరాలను కూడా తెలిపింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి దాదాపు రూ.13 వేల కోట్ల రుణాలను మెహుల్ ఛోక్సీ ఎగవేశాడు. ఇదే కేసులో ప్రమేయం ఉన్న అతని మేనల్లుడు నీరవ్ మోదీ భారత్ విడిచి పారిపోయాడు. ఛోక్సీ.. ఆంటిగ్వా-బార్బుడాకు వెళ్లగా, నీరవ్‌మోదీ లండన్‌లో తలదాచుకున్నాడు. అంట్వెర్ప్‌లోని న్యాయస్థానం ఈ మధ్యనే ఛోక్సీ అప్పగింతకు ఆమోదం తెలిపింది. అయితే చోక్సీ రాబోయే 15 రోజుల్లో బెల్జియం సుప్రీంకోర్టులో ఈ ఉత్తర్వుకు వ్యతిరేకంగా అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)అభ్యర్థన మేరకు ఈ ఏడాది ఏప్రిల్ 11న ఆంట్వెర్ప్‌లో చోక్సీని అరెస్టు చేశారు. అప్పటి నుండి అతను బెల్జియంలోని ఆంట్వెర్ప్ జైలులో ఉన్నాడు. నీరవ్ మోదీ ప్రస్తుతం లండన్ జైలులో ఉన్నాడు.

# ఉస్మానియా ఆస్పత్రి రెండేళ్లలో పూర్తిచేయాలి

వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.పనుల వేగవంతానికి సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రానున్న వందేళ్ల అవసరాలకు తగిన సదుపాయాలతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి ఉండాలని.. ఆధునిక వైద్య పరికరాలతో అత్యాధునిక సదుపాయాలు కల్పించాలని వెల్లడించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్మాణ సమీక్ష చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు చేశారు. స్థానికులకు ఇబ్బంది లేకుండా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ ఆసుపత్రుల పనుల పర్యవేక్షణకు అధికారుల నియామకం జరిగిందన్నారు. వచ్చే జూన్ నాటికి అన్ని మెడికల్ కళాశాలలు, ఆసుపత్రుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్, భద్రతా ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని పోలీసులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాసరాజు, శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఎంఏ అండ్ యూడీ సెక్రటరీ ఇలంబర్తి, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# రవాణా చెక్‌పోస్టులు రద్దు

సీఎం రేవంత్ ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్టుల కార్యకలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఆకస్మిక, తక్షణ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే వేరే బాధ్యతల్లో వినియోగించు కోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, చెక్ పోస్టుల వద్ద బోర్డులు, బ్యారికేడ్లు, తొలగించాలని డీటీవోలకు సూచించారు. అలాగే చెక్ పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, పరికరాలు, ఫర్నిచర్‌ను డీటీవో కార్యాలయాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని హుకుం జారీ చేశారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో అవినీతి రవాణా అవుతోంది. కొందరు అధికారులు ప్రైవేటు సిబ్బందిని పెట్టుకుని యథేచ్ఛగా అక్రమ వసూళ్లు కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని రవాణాశాఖ చెక్‌పోస్టులను రద్దు చేస్తూ జులై ఆఖరి వారంలోనే రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. నెలరోజులు ఆలస్యంగా జీఓ జారీ అయ్యింది. ఉత్తర్వులు వచ్చి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా చెక్‌పోస్టులను ఇంకా తొలగించలేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక చెక్‌పోస్టుల అవసరం దాదాపుగా తగ్గింది. కేంద్రం సూచనల మేరకు దేశంలోని అనేక రాష్ట్రాలుసంవత్సరాల క్రితమే చెక్‌పోస్టులను రద్దు చేశాయి. కానీ తెలంగాణలో కొనసాగుతున్నాయి. ఏడాదిన్నర క్రితమే తెలంగాణలో చెక్‌పోస్టుల రద్దుకు రవాణాశాఖ నిర్ణయం తీసుకున్నా.. కొందరు అధికారుల బలమైన ఒత్తిళ్ల కారణంగా ఇన్నాళ్లు ఆ నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు రెండు నెలల క్రితం జీఓ జారీ అయినా అవినీతి అధికారుల తీరు మారలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టులు రద్దు చేయాలని రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టులను ఎత్తివేసిన ప్రభుత్వం వాటి స్థానంలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ (ఏఎన్‌పీఆర్) అనే అడ్వాన్స్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురానుంది. ఈ అడ్వాన్స్?డ్ కెమెరా సిస్టమ్ హైదరాబాద్ లోని ఖైరతాబాద్ లో ఉన్న ప్రధాన రవాణా శాఖ ఆఫీస్‌కు అనుసంధానమై ఉంటుంది. దీంతో రవాణా శాఖలో పారదర్శకత స్పష్టంగా కనిపించనున్నది. అయితే, ప్రస్తుతం డ్యూటీ చేస్తున్న సిబ్బందికి కొత్త బాధ్యతలు అప్పగించనున్నారు. ఏ వెహికల్ అయినా కెమెరా కండ్లుగప్పి ఇతర మార్గాల ద్వారా రాష్ట్రంలోకి వస్తే.. వాటిని జాతీయ రహదారులపై అడ్డుకొని చర్యలు తీసుకునేందుకు వీలుగా మొబైల్ స్క్వాడ్ లను కూడా రంగంలోకి దింపనున్నారు. ఈ వ్యవస్థపై ముందుగా గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ చేసే వాహన యజమానుల అసోషియేషన్ కు ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పించ నున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్యాసింజర్ వెహికల్స్‌తో పాటు సరకు రవాణా వాహనాల పర్మిట్లు, మిగిలిన అనుమతులన్నీ ముందే ఆన్ లైన్ లో పొందేలా రాష్ట్ర రవాణా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

# నేడు మంత్రివర్గ సమావేశం

కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై కేబినెట్ చర్చించనుంది. దీంతో ఇటీవల భేటీలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధన ఆర్డినెన్సుకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. అలాగే, ఎస్ఎల్‌బిసి పునరుద్ధరణ పనులు, ఎస్ఆర్ఎస్‌పి రెండో దశకు రాంరెడ్డి దామోదర రెడ్డి పేరు, కాళేశ్వరం పునరుద్ధరణ సహా పలు ప్రాజెక్ట్ పనుల పై మంత్రి వర్గం చర్చించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలపై గురువారం జరిగే సమావేశంలో మంత్రి వర్గం తుది నిర్ణయం తీసుకోనుంది. పాత పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలా? లేదా 42 శాతం రిజర్వేషన్లతో వెళ్లాలా? అనేది దానిపై కేబినెట్ చర్చించనుంది. కాగా ఇప్పటికే ఈ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయనిపుణ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని న్యాయ స్థానాల్లో కొట్లాడేందుకు రేవంత్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించేందుకు.. ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంతకు ఏ పథకం అమలు చేస్తారన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే రాష్ట్ర మంత్రి వర్గం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుదనేది ఆసక్తిగా మారింది.

# పెట్టుబడులకు పెద్దపీట

చేసి ఆ ఇండస్ట్రీని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పేస్ టెక్నాలజీలో ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జియో ప్యాక్ సీఈఓ, వ్యవస్థాపకుడు ముర్తజ కురసాని తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధం ఆపి చర్చలకు సిద్ధం

**కానీ అందుకు పుతిన్ అంగీకరిస్తారో లేదో: జెలెన్‌స్కీ**

**కీవ్(జనంసాక్షి):**రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొంత కాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే యుద్ధం ఆపేందుకు ఇటీవల ఆయన కొన్ని ప్రతిపాదనలు చేశారు. వారు ఎక్కడున్నారో అక్కడే యుద్ధాన్ని ఆపి చర్చలు జరపాలని ఇరుదేశాలకు సూచించారు. ఈ విషయంపై తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందించారు. ట్రంప్ చేసిన ప్రతిపాదనలు సరైనవేనని..రాజీ చేయడానికి ఇది మంచి ప్రయత్నమని సమర్థించారు. అయితే దీనికి రష్యా అధ్యక్షుడు పుతిన్ అంగీకరిస్తారో లేదో అని అనుమానం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని తాను అమెరికా అధ్యక్షుడికి కూడా తెలియజేసినట్లు వెల్లడించారు.ఇటీవల ట్రంప్, పుతిన్ ఫోన్ కాల్‌లో మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌లోని అత్యంత కీలకమైన దొనెట్స్క్ ప్రాంతాన్ని తమకు అప్పగించాల్సిందేనని రష్యా అధ్యక్షుడు పట్టిబట్టినట్లు పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటి తమ సేనల ఆధీనంలో ఉన్న జపోరిజియా, ఖేర్సాన్‌లను ఉక్రెయిన్‌కు అప్పజెప్పేందుకు పుతిన్ సానుకూలతను వ్యక్తం చేశారని.. దీనికి ప్రతిగా ఉక్రెయిన్ దొనెట్స్క్ ప్రాంతాన్ని సంపూర్ణంగా తమకు అప్పగించాలని కోరినట్లు వాషింగ్టన్ పోస్టు కథనంలో వెల్లడించింది. ఈ నేపథ్యంలో ట్రంప్ ఇరుదేశాల నేతలకు పలు ప్రతిపాదనలు చేశారు. కాగా ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై మంగళవారం అర్ధరాత్రి రష్యా డ్రోన్..క్షిపణి దాడుల కు పాల్పడింది. ఈ దాడుల్లో ఓ చిన్నారి సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లోని పలు ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని..బుధవారం కూడా రష్యా దాడులకు పాల్పడినట్లు తెలిపారు.

# డీప్‌ఫేక్ వీడియోకు లెబులింగ్ తప్పనిసరి

గురించి స్పష్టంగా చెప్పాల్సి ఉంటుంది. ఇందుకోసం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్ ఇంటర్‌మీడియరీస్ తప్పనిసరిగా లేబులింగ్ మెటాడేటా ట్యాగింగ్, విజిబిలిటీ ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. వీడియో అయితే కనిపించే విధంగా, ఆడియో అయితే వినిపించే విధంగా ఏఐ, డీప్‌ఫేక్ కంటెంట్ అని స్పష్టంగా లేబుల్ చేయవలసి ఉంటుంది.భారత్‌లో 5 మిలియన్లకు పైగా నమోదిత వినియోగదారులు కలిగిన ఎస్ఎస్ఎంఐలు ఉన్నాయి. వీటిలో ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్ మొదలైన ప్లాట్ ఫారమ్స్‌లు 2021 ఐటీ నిబంధనల ప్రకారం అదనపు సమ్మతికి బాధ్యత వహించాల్సి ఉంటుంది.ఐటీ నియమం ప్రకారం, కృత్రిమంగా తయారు చేసిన కంటెంట్‌ను సృష్టించడానికి వీలు కల్పించే సోషల్ మీడి యా ప్లాట్‌ఫారమ్‌లు కొన్ని నిబంధనలను కచ్చితంగా పాటించాలి. అవి ఏమిటంటే, ఏఐ, డీప్‌ఫేక్ కంటెంట్‌కు కచ్చితంగా 'శాశ్వతమైన ప్రత్యేక మెటాడేటా లేదా ఐడెం టిఫైయర్'తో లేబులింగ్ పొందుపరిచేలా చూసుకోవాలి. పైగా ఆ ఐడెంటిఫైయర్ స్పష్టంగా కనిపించేలా లేదా వినగలిగేలా ఉండాలి. ముఖ్యంగా 'విజువల్ డిస్‌ప్లే అయితే దాని ఉపరితల వైశాల్యంలో కనీసం 10 శాతం ఐడెం టిఫై యర్ కనిపించాలి. ఒకవేళ అది ఆడియో అయితే దాని మొత్తం వ్యవధిలో కనీసం 10 శాతాన్ని కవర్ చేసేలా ఉండాలి. అంతేకాదు మెటా డేటా లేదా ఐడెంటిఫైయర్‌ను మార్చకూడదు. సప్రెస్ చేయడం (అణచివేయడం), తీసివే యడం లాంటివి చేయకూడదు" అని ముసాయిదా నియ మాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు సింథటిక్ కంటెంట్ సృష్టించడానికి లేదా సవరించడానికి వీలు కల్పించే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు- అప్‌లోడ్ చేసిన కంటెంట్ ఏఐ ద్వారా సృష్టించబడిందని ధ్రువీకరిం చడానికి, ప్రకటిం చడానికి తగి సాంకేతిక మార్పులు, చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది

# గోండు బెబ్బులి కుమ్రం : కేటీఆర్

**హైదరాబాద్,అక్టోబర్22(జనంసాక్షి):**

ఆదివాసీ యోధుడు.. తిరుగుబాటు వీరుడు.. గోండు బెబ్బులి కుమ్రం (కొమురం) భీమ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘన నివాళులర్పించారు. బీఆర్ఎస్ హయాంలో, కేసీఆర్ నేతృత్వంలో కుమ్రం భీమ్ ఇచ్చిన జల్, జంగల్, జమీన్ నినాదమే స్ఫూర్తిగా పాలన అందించామని గుర్తుచేశారు. వారి ఆశయాల సాధన దిశగా పయనించామని తెలిపారు. ఎస్టీ గురుకులాలు, కాలేజీల సంఖ్య పెంచడం, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందించడం, సీఎంఎస్టీఈఐ స్కీం ద్వారా గిరిజన బిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం.. కుమ్రం భీమ్ స్ఫూర్తిగా ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో ఆసిఫాబాద్ జిల్లాకు కుమ్రం భీమ్ పేరు పెట్టుకున్నందుకు, జోడేఘాట్‌లో సుందరమైన స్మృతి వనాన్ని ఏర్పాటు చేసినందుకు, హైదరాబాద్ మహానగరంలో కుమ్రం భీమ్ పేరిట ఆదివాసీ భవనాన్ని నిర్మించినందుకు గర్విస్తున్నామన్నారు. అస్తిత్వ పోరాటాలకు ప్రతీకగా నిలిచిన కుమ్రం భీమ్‌కు జోహార్లు తెలిపారు.

# మేడ్చల్ జిల్లాలో కాల్పుల కలకలం

మేడ్చల్: మేడ్చల్ జిల్లా పోచారం పరిధిలో కాల్పులు కలకలం సృష్టించాయి. ఓ వర్గంపై కాల్పులు జరిపి దుండగుడు పరారయ్యాడు. ఈ ఘటనలో గాయపడ్డ సోనుసింగ్ అనే వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. పోచారం ఐటీ కారిడార్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

# గ్రామీణ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం




కల్పించాలన్న ఉద్దేశంతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తమ ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఎక్కువ మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న దృఢ సంకల్పంతో ఉందని తెలిపారు.గడచిన 20 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 70 నుండి 75 వేల మందికి కొత్త ఉద్యోగాలు కల్పించామని, పరిశ్రమల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు .హుజూర్ నగర్ లో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాకు సుమారు 250 ప్రముఖ పారిశ్రామిక కంపెనీలు హాజరు కానున్నయని, క్యూఆర్ కోడ్ ద్వారా ఇప్పటి వరకు 12500 మంది ఉద్యోగాల కోసం రిజిస్టర్ చేసుకున్నారని, రిజిస్టర్ చేసుకొనని వారు కూడా ఈ జాబ్ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు.5 కాపీల రెజ్యూమ్ ,రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో జాబ్ మేళాకు రావాలని, వచ్చే వారి కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. సింగరేణి కాలరీస్ ,పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పనిచేసే డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్ ఆఫ్ తెలంగాణ సహకారంతో ఈ జాబ్ మేళా నిర్వహించనుండగా జాబ్ మేళాకు వచ్చే వారి కోసం స్వర్ణ వేదిక ఫంక్షన్ హాల్ లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని, అందువల్ల ఆయా కళాశాలల యాజమాన్యాలు ఎక్కువ మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలు పొందేలా అవగాహన కల్పించడమే కాకుండా, రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ హుజూర్ నగర్ లో నిర్వహిస్తున్న జాబ్ మేళా సూర్యాపేట జిల్లా నిరుద్యోగ యువతకే కాకుండా, ఉమ్మడి నల్గొండ జిల్లా నిరుద్యోగ యువతకు ఒక చక్కని అవకాశం అని, అందువల్ల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ రాజేశ్వర్ రెడ్డి,పౌరసరఫరాల శాఖ మంత్రి ఓఎస్డి ప్రవీణ్ మాట్లాడారు.పలువురు ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ ప్రతినిధులు మాట్లాడుతూ హుజూర్ నగర్ లో నిర్వహించనున్న మెగాజాబ్ మేళాకు స్పందన బాగుందని, తమవంతుగా ఎక్కువమంది నిరుద్యోగ యువతను జాబ్ మేళాకు పంపించేలా సోషల్ మీడియా, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారాన్ని అందించడమే కాకుండా అన్ని రకాలుగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.జిల్లా ఎస్పీ నరసింహ,అడిషనల్ కలెక్టర్ కె. సీతారామారావు, సింగరేణి కాలరీస్ కంపెనీ ప్రతినిధులు శ్రీధర్, చందర్,డీట్ ప్రతినిధి వంశీ, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,నాయకులు పోతు భాస్కర్, లక్ష్మినారాయణ రెడ్డి, చకిలం రాజేశ్వరరావు, జీఎం ఇండస్ట్రీస్ సీతారాం నాయక్, డిగ్రీ, ఇంజనీరింగ్ , పాలిటెక్నిక్ ,ఐటిఐ కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలి

గ్రామ పాలనాధికారులు,గ్రామ పోలీస్ అధికారులు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత ఈ నెల 25న హుజూర్ నగర్ లో నిర్వహించే మెగా జాబ్ మేళాకు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు.సమాజంలో అతిపెద్ద సమస్యగా మారిన నిరుద్యోగ సమస్యను తమ వంతుగా కొంతవరకైనా తీర్చాలన్న ఉద్దేశంతో ఉమ్మడి నల్గొండ జిల్లా నిరుద్యోగ యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించే నిమిత్తం హుజూర్ నగర్ లో ఈ నెల 25న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఆర్డీవోలు, తహసిల్దార్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఎంపిడిఓలు, గ్రామ పాలనాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పోలీసు అధికారులతో జాబ్ మేళాపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు ఈ కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ మాట్లాడారు.ఈ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ రాజేశ్వర్ రెడ్డి, మినిస్టర్ ఓఎస్డి ప్రవీణ్,అదనపు కలెక్టర్ కె.సీతారా మారావు, నాయకులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్,లక్ష్మి నారాయణ రెడ్డి, చకిలం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టండి

**దిగ్గజ సంస్థ 'ఒరికా'కు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం**

**ఆస్ట్రేలియాలో సీఈఓ సంజీవ్ గాంధీతో ప్రత్యేకంగా భేటీ**

**హైదరాబాద్(జనంసాక్షి):**దేశంలోనేపారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న దిగ్గజ సంస్థ 'ఒరికా' ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు.ఆ దేశ పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లో పారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో అంతర్జాతీయ అగ్రగామిగా ఉన్న ఆ సంస్థ సీఈఓ, ఎండీ సంజీవ్ గాంధీ, ఇతర ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో 'ఒరికా' ప్రస్తుత కార్యకలాపాలు, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. 'ఇన్నోవేషన్, టెక్నాలజీ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. జీసీసీలు, పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అత్యంత అనుకూలం. పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎకో సిస్టమ్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం అందుబాటులో ఉంది' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు కంపెనీ ప్రతినిధులకు వివరించారు.ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్, సస్టెయినబిలిటీ, మాన్యుఫాక్చరింగ్, మైనింగ్ రంగాల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. 'పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ, అమలు చేస్తున్న ప్రోత్సాహకర, ప్రగతిశీల విధానాలు అభినందనీయం. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న జీసీసీలో డిజిటల్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ తదితర రంగాల్లో 600 మంది హై స్కిల్డ్ నిపుణులకు ఉద్యోగాలు కల్పించాం. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తెలంగాణలో కార్యకలాపాల విస్తరణ, వివిధ రంగాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ఒరికా సంస్థ సీఈఓ, ఎండీ సంజీవ్ గాంధీ తెలిపారు. 'ఆస్ బయోటెక్ 2025 ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్'లో కీలకోపన్యాసం చేసేందుకు ఆస్ట్రేలియాకు విచ్చేసిన మంత్రి శ్రీధర్ బాబును కంపెనీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.




# జూబ్లీహిల్ ఉప ఎన్నికల్లో వామపక్షాలు, కోదండరాం కాంగ్రెస్‌కు మద్దతు



వ్యాఖ్యానించారు. ఆ పాలన నుంచి విముక్తి కోసం కాంగ్రెస్, టీజేఎస్ సహా ప్రజాసంఘాలన్నీ కలిసి 2023 ఎన్నికల్లో పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో టీజేఎస్ సహకారం ఎంతో విలువైనది. దాన్ని మేము ఎప్పటికీ మరవం,' అని తెలిపారు. ఉద్యోగ నియామక రూపకల్పనలో కోదండరామ్ సలహాలు, సూచనలు ఎంతో విలువైనవని మహేష్ గౌడ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా పాలన కొనసాగుతుందని హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో యువ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని టీజేఎస్‌ను కోరారు. సీపీఐ, సీపీఎం, ఏఐఎంఐఎం మాదిరిగా టీజేఏసీ మద్దతు కూడా కోరినట్లు తెలిపారు. ఇక బీజేపీ నేతలపై తీవ్రంగా విరుచుకుపడ్డ ఆయన? 'కేంద్రమంత్రి స్థాయిలో ఉన్న బండి సంజయ్ ఏమి మాట్లాడుతున్నారో తనకే అర్థమవుతున్నదా? మత విద్వేషాలు రెచ్చగొట్టి, సెంటిమెంట్లు రాజేసి లబ్ధి పొందాలన్నదే బీజేపీ పన్నాగం,' అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మతవాద శక్తులకు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. మిత్రపక్షాలతో ఇచ్చిన మాటను కాంగ్రెస్ నిలబెట్టుకుంటుందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన కొనసాగుతుందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.కాగా తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. దానం నాగేందర్ బహిరంగంగానే కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో కొండా సురేఖ, కొండా సుస్మిత వివాదం ముగిసిపోయిందని క్లారిటీ ఇచ్చారు. టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ తాజాగా మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో మా స్టార్ క్యాంపెయినర్ లిస్టులో దానం నాగేందర్ పేరు ఉంటే తప్పేంటి?. ముసుగులో గుద్దులాటలు అవసరం లేదు.. దానం నాగేందర్ సపోర్ట్ డైరెక్ట్ చేస్తున్నాడు. మా పార్టీకి మద్దతు ఇస్తే తప్పేంటి?. ఫిరాయింపుల అంశాన్ని స్పీకర్ చూసుకుంటారు. జీవన్ రెడ్డి చాలా రోజుల నుంచి అసంతృప్తితో ఉన్నారు. జీవన్ రెడ్డితో త్వరలోనే మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కొండా సుస్మిత వ్యాఖ్యలపై కొండా దంపతులు విచారం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మళ్ళీ ఇలాంటివి జరగవని కొండా దంపతులు ముఖ్యమంత్రితో చెప్పారు.

# సాంస్కృతిక మూలాలే తెలంగాణ ప్రాణాలు

- **కేఎల్ 101వ జయంతి సభలో జూలూరు**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సాహిత్య, సాంస్కృతిక కళారూపాల మూలాలే ఈ నేలకు ప్రాణాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ అన్నారు. తిరునాళ్లు,జాతరలు, ఉత్సవాల వేదికలపై ప్రదర్శించే కళారూపాలు, నాటికలు, నాటకాలు సామాజిక వికాసానికి సాంస్కృతిక స్తంభాలుగా నిలబడ్డాయని పేర్కొన్నారు. బుధవారం రవీంద్రభారతిలో జరిగిన ప్రఖ్యాత నాటక రచయిత కెఎల్ నరసింహారావు 101వ జయంతి సభలో జూలూరు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెఎల్ రాసిన 100కు పైగా నాటికలు, నాటకాలను యానిమేషన్ల ద్వారా డాక్యుమెంటరీ చిత్రాలుగా రూపొందించి ఈ తరానికి అందించాలన్నారు. సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలు అవినీతి బంధుప్రీతి,చీకటి బజారు, అసాంఘిక కార్యకలాపాలను కే.ఎల్ తన రచనల ద్వారా తెలియజేశారని అన్నారు. నేటి సమాజానికి కూడా కే.ఎల్ రచనలు ఎంతో అవసరమైనవని చెప్పారు. మునగాల పరగణ ఆనాటి గ్రంథాలయ ఉద్యమానికి, నాటక రంగ విస్తృతికి ఎంతో దోహదం చేసిన ప్రాంతమని వివరించారు. రేపాల గ్రామంలో నాటక ప్రదర్శనలను చూసేందుకు పీ.వీ. నరసింహారావుతో సహా ఎందరెందరో ప్రముఖులు,చిత్ర దర్శకులు,నటులు విచ్చేసారని తెలిపారు. రేపాల "గ్రామ వెలుగు" నాట్యమండలి ద్వారా 70 ఏళ్లుగా నిరంతరంగా నాటక ప్రదర్శనలు చేయటం నాటక రంగ చరిత్రలోనే రికార్డుగా నిలుస్తుందని జూలూరు సింహావలోకనం చేశారు. రిటైర్డ్ ఐ.ఏ.ఎస్. డాక్టర్ ఎం. వి .రెడ్డి మాట్లాడుతూ కే. ఎల్ రాసిన నాటికలు నేటి సమాజానికి ఏ విధంగా ఉపయుక్తమో సవివరంగా పేర్కొన్నారు. ఆయన రాసిన నాటికలను, పుస్తకాలను చిత్రాలుగా చిత్రీకరించి, ప్రదర్శనలు ఏర్పాటు చేసి ఈ తరానికి తెలియజేయాలని కోరారు. ఈ సభకు "తెర" సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షులు వేముల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా కె .ఎల్ జీవితం,రచనలపై డాక్యుమెంటరీ చిత్రం తీసిన దర్శకులు శశిధర్,మరో దర్శకులు నామాల సూరి, రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి సత్యనారాయణ, కె.ఎల్ ట్రస్ట్ కార్యదర్శి పందిరి పుల్లారెడ్డి, కే.ఎల్ తనయుడు కోదాటి వెంకటరమణ, అక్కిరాజు బాబు, వెంపటి పిచ్చేశ్వరరావు, గెల్లి రంగారావు తదితరులు మాట్లాడారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ మద్దతు

- **బెస్ట్ అవైలబుల్ నిధులు విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు ధన్యవాదాలు**
- **తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (టీఆర్ఎస్ఎం) రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి తెలంగాణ రికగ్నైసేడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నాయని, కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి వెల్లడించారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో బెస్ట్ అవైలబుల్ స్కీం స్కూల్స్ యజమానులు రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ పక్షాన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ ను కలిసి తమ మద్దతు ప్రకటించారు. రాష్ట్రంలో 237 బెస్ట్ అవైలబుల్ స్కీం పాఠశాలలు ఉండగా సుమారు 20వేల పైగా విద్యార్థులు ఈ పాఠశాలల్లో చదువుతున్నారని వెల్లడించారు. బెస్ట్ అవైలబుల్ స్కీం స్కూల్స్ యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు బకాయిల్లో 25% వెంటనే విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సహకరించిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ కు సంఘం పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు శివరాత్రి యాదగిరి తెలిపారు. మిగిలిన 75 శాతం నిధులను దశలవారీగా విడుదల చేసేందుకు డిప్యూటీ సీఎం అంగీకరించినందుకు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ స్కూల్స్ యాజమాన్యాల తరఫున ధన్యవాదాలు తెలియ జేస్తున్నామన్నారు. కార్పొరేట్, ప్రభుత్వ పాఠశాలలకు మిన్నగా బెస్ట్ అవైలబుల్ స్కీం పాఠశాలల్లో ఫలితాలు సాధిస్తామని ఈ సందర్భంగా వారు ప్రకటించారు. మొదటి తరం పేద విద్యార్థులు ఈ స్కీం కింద ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారని వారిని ఉన్నతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. మా యాజమాన్యాలు, సిబ్బంది ప్రభుత్వం వెన్నంటి ఉంటామని, ప్రభుత్వానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఆయనతోపాటు సంఘం గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రెండు పంటలకు పాకాల లిఫ్ట్ నీరు అందిస్తాం

- **మంత్రి సీతక్క**



**కొత్తగూడ అక్టోబర్ 22 (జనంసాక్షి) :** రెండు పంటలకు పాకాల లిఫ్ట్ నీరు అందిస్తామని మంత్రి సీతక్క అన్నారు. మహబూబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిని 13.50కోట్లతో నిర్మించేందుకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఆదివాసి దైవమైన కొమరం భీం నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేస్తామని అన్నారు. కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం కొత్తగూడ మండల కేంద్రం లో 12 కోట్ల రూ వ్యయంతో సెంట్రల్ లైటింగ్ కు శంకుస్థాపన చేసిన తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క వీరి వెంట జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ ప్రాంతానికి ఎంతో మంది ఎమ్మెల్యేలుగా గెలిచినప్పటికీ ఎవరు పట్టించుకోలేదని ఈ ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఈ సీతక్కతోనే సాధ్యం అని అన్నారు.రైతులకు ఈ ప్రాంత ప్రజలకు మాట ఇచ్చానని ఈ ప్రాంతానికి పాకాల లిఫ్ట్ ద్వారా రైతులకు రెండు పంటలు పండించుకునేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమం లోతెలంగాణ రాష్ట్ర రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య,గంగారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు, కొత్తగూడ బ్లాక్ అద్యక్షులు సుంకరబోయిన మొగిలి, బ్లాక్ ఉపాధ్యక్షుడు జనార్దన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ విజయ రూప్సింగ్, మాజీ జడ్పీటీసీ పులుసం పుష్పలత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వీరనేని వెంకటేశ్వరరావు, మండల అధికార ప్రతినిధి ఇరుప రాజేశ్వర్, మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్,పొగళ్ళపల్లి సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,డైరెక్టర్లు,రైతులు అధికారులు పాల్గొన్నారు.

# సదర్ సమ్మేళనంలో పాల్గొన్న ఉప్పల





**హైదరాబాద్ (జనంసాక్షి) :** నాగోల్ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో కార్పొరేటర్ అరుణ-సురేందర్ యాదవ్ ఆహ్వానం మేరకు నిర్వహించిన సదర్ సమ్మేళనంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ యాదవ్ సమాజం సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే ఈ సదర్ ఉత్సవం, తెలంగాణ సాంస్కృతిక సంపదకు ప్రతీకగా నిలుస్తుంది అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం యాదవుల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నాడు అని ఆయన అన్నారు. సదర్ నీ అంగర వైభవంగా నిర్వహిస్తున్న యాదవులు అందరికీ అభినందనలు తెలిపారు. సమాజంలోని ప్రముఖులతో ఆత్మీయంగా సంభాషించి, ఇలాంటి సాంప్రదాయ ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, సమగ్రతను పెంపొందిస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఈశ్వరమ్మ యాదవ్, సీఐఆర్ సీఐఈ ఇన్స్పెక్టర్ జానీ, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కలుపు యాజమాన్యం పుస్తకావిష్కరణ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైద్రాబాద్‌లో పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కలుపు యాజమాన్యం పుస్తకం ఆవిష్కరించారు. సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్ర వేత్త, కలుపు నియంత్రణ నిపుణులుగా దేశంలో పేరొందిన డాక్టర్ అట్లూరి సుబ్రహ్మణ్యేశ్వర రావు రచించిన ఈ పుస్తకాన్ని డాక్టర్ ఐవీ సుబ్బారావు స్మారక కమిటీ ప్రచురించింది. వ్యవసాయంలో కలుపు నివారణ రసాయనాలు వాడకం చివరి మెట్టుగానే జరగాలి. అయితే సాగులో ఎదురవుతున్న అనేక సమస్యల వల్ల అనివార్యమైన పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో వాటి వాడకం లో తీసుకోవలసిన జాగ్రత్తలు, మందుల ఎంపిక, వాడాల్సిన మోతాదు , పిచికారీ పద్ధతి, డ్రోన్స్ , రోబోట్స్ తో వాడే విధానం తో పాటు సేంద్రియ విధానం లో కలుపు నియంత్రణ వివరాలన్నీ రైతులకు సులువుగా అర్థమయ్యే విధంగా డాక్టనర్ రావు పుస్తకం లో తెలియచేసినందుకు వెంకయ్య నాయుడు గారు అభినందనలు తెలియ జేశారు. శాస్త్రవేత్త డాక్టర్ రావు తో ముచ్చటిస్తూ కలుపు మొక్కలు, మందులు గురించి అనేక వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ శాస్త్ర పరిజ్ఞానం గురించి రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని అభిప్రాయపడ్డారు. అదే విధంగా సంబధిత విస్తరణ అధికారులు, శాస్త్ర వేత్త లు కూడా చొరవ తీసుకో గలిగితే మంచి ఫలితాలు సాధించి చూపే సత్తా మన రైతులకుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

## తాగిన మైకంలో
# తండ్రిని కడతేర్చిన కొడుకు

**హైదరాబాద్, అక్టోబర్22 (జనంసాక్షి) :** తాగిన మైకంలో కన్నతండ్రిని అతిదారుణంగా హత్య చేసిన ఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం అచయిపల్లి గ్రామానికి చెందిన నిజాముద్దీన్.. తన కుమారుడు షేక్ సాతక్‌తోపాటు అతడి స్నేహితుడితో కలిసి మంగళవారం రాత్రి మద్యం సేవించారు. అనంతరం ఆ మద్యం మత్తులో తండ్రి కొడుకుల మధ్య మాటమాట పెరిగింది. దీంతో వారిద్దరు ఘర్షణకు దిగారు. పక్కనే ఉన్న బండరాయి తీసుకుని.. కన్నతండ్రిపై దాడి చేశాడు. ఈ ఘటనలో తండ్రి నిజాముద్దీన్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని నిందితుడు షేక్ సాతక్‌తోపాటు అతడి స్నేహితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక నిజాముద్దీన్ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నిజాముద్దీన్ కుటుంబ సభ్యులు.. ఆసుపత్రికి చేరుకున్నారు.

# రౌడీషీటర్ వేధింపులతో యువతి ఆత్మహత్య

**ఖమ్మం, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** తన కోరిక తీర్చాలని కొంతకాలంగా వెంటపడటమే కాకుండా.. రెచ్చిపోయి బలవంతం చేయబోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం పంచాయతీ జగ్యాతండాకు చెందని బోడ సుశీల(28)పై ఆమె ఇంటి ఎదురుగా ఉండే రౌడీ షీటర్ ధరావత్ వినయ్ కొంతకాలంగా కన్నేశాడు. ఆమెను తరచూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో పత్తి తీసేందుకు సుశీల మరో మహిళతో కలిసి సోమవారం నాడు కొణిజర్ల మండలం అమ్మపాలెం వెళ్లింది. అక్కడ సుశీలను గమనించిన రౌడీషీటర్ ధరావత్ వినయ్ ఆమె దగ్గరకు వెళ్లాడు. తన కోరిక తీర్చాలని వేధింపులకు దిగాడు. సుశీల ప్రతిఘటించడంతో ఆమెపై దాడికి పాల్పడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన సుశీల ఇంటికి వచ్చిన తర్వాత ఉరేసుకుంది. వినయ్ వేధింపుల వల్లే తన భార్య ఆత్మహత్య చేసుకుందని సుశీల భర్త శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే సుశీల మృతిపై ఆమె బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుశీల ఒంటిపై గాయాలు ఉన్నాయని, శవపరీక్షలో వాటిని పరిగణనలోకి తీసుకోలేదని, ఉరేసుకుని మరణించిందని మాత్రమే వైద్యులు చెబుతున్నారని ఆరోపించారు. ఈ కేసును పక్కదారి పట్టిస్తున్నారని ఆందోళనకు దిగారు.

# మేడారం మహాజాతర ఏర్పాట్లపై సమీక్ష

- **స్పెషల్ ఫోకస్ పెట్టిన అధికారులు**



**ములుగు బ్యూరో,అక్టోబర్ 22 (జనంసాక్షి):** మేడారం మహాజాతర ఏర్పాట్లపై బుధవారం రోజు సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ సమీక్షా సమావేశం నిర్వహించారు.మేడారం జాతరకి గిరిజన సంక్షేమ శాఖ రూ.150 కోట్లు మంజూరు చేయగా అందులో రూ. 90 కోట్లు సివిల్ వర్క్స్ కు, రూ. 60.00 నాన్ సివిల్ వర్క్స్ కు ఉద్దేశించారు.ఈ సమావేశంలో సివిల్ వర్క్స్ స్టేటస్, నాన్ సివిల్ వర్క్స్ యాక్షన్ ప్లాన్ మీద సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సబ్యసాచి ఘోష్ ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి మాట్లాడుతూ మేడారం జాతర ఏర్పాట్లను మొత్తం 8 జోన్లు,31 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. జోన్-3 జంపన్న వాగు ప్రాంతంగా నిర్ణయించబడింది.జాతర సమయంలో 10 నుండి 12 వేలమంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. ప్రతి జోన్‌కు ఒక జోనల్ ఆఫీసర్ను నియమించనున్నారు.24 శాశ్వత టవర్స్, 20 సెల్-ఆన్-వీల్స్, 350 వై-ఫై పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కోర్ రూట్లు మరియు పార్కింగ్ ప్రదేశాలను గుర్తించారు.మొత్తం 49 పార్కింగ్ ప్రదేశాలు (1050 ఎకరాలు) గుర్తించబడి,దాదాపు 4.5 నుండి 6 లక్షల వాహనాలు నిలిపే సదుపాయం కల్పించబడుతుంది. ఈ ఏర్పాట్లు నవంబర్ 30 నాటికి పూర్తవుతాయని తెలిపారు.అటవీ శాఖ ఆధ్వర్యంలో 2409 ఫారెస్ట్ రోడ్లు (కచ్చా నుండి డబుల్ లేన్) రూపంలో అభివృద్ధి చేస్తున్నారు.వీటిలో భాగంగా వైల్డ్ లైఫ్ శాంక్చువరీలోని రహదారులు కూడా చేర్చబడ్డాయి. ఆర్ అండ్ బీ శాఖ ద్వారా 42 కోట్లతో ఆలయం చుట్టూ రహదారులు, మరియు 92 కోట్లతో ప్రధాన రహదారులు నిర్మించబడుతున్నాయి.జాతర సమయానికి ముందు, మధ్య మరియు తరువాత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక జాతర సందర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు.జంపన్న వాగు వద్ద తాత్కాలిక రహదారి కూలిపోయిన కారణంగా మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయి. 517 బోరుపాయింట్లు మరియు నీటి వనరులు,250 కిలోమీటర్ల రహదారులపై లైటింగ్ పనులు జరుగుతున్నాయి.స్థానికుల సహకారంతో 6 స్లాటర్ సెంటర్లు ఏర్పాటు చేయబడ్డాయి. జంపన్న వాగు పునరుద్ధరణ పనులు సాగిస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు.9111 విద్యుత్ స్తంభాలు, 259 ట్రాన్స్ఫార్మర్లు అమర్చే పనులు విద్యుత్ శాఖ చేపట్టింది. జాతర ప్రాంతమంతా ఎండోమెంట్స్ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశ ఏర్పాట్లు (ఇల్యూమినేషన్) చేయనున్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర విజయవంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని సబ్యసాచి ఘోష్ ఆదేశించారు.ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగత్,ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు,ములుగు ఎస్పీ డాక్టర్ శబరిష్ పి.,ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా,డిఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, ఎలక్ట్రిసిటీ సిఎండి వరుణ్ రెడ్డి,సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక,ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొని తమ తమ ఇన్పుట్ అందించారు.

# సోయా కొనుగోలు చేయాలని ధర్నా



**బోథ్, అక్టోబర్ 22(జనంసాక్షి) :** సోయా కొనుగోళ్లను ప్రారంభించక పోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం మద్దతు ధరకు సోయా పంట కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం బోథ్ మండల రైతులు స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద ధర్నాకు దిగారు. ప్రభుత్వం సోయా కొనుగోళ్ళు ప్రారంభించాలని ఒ పక్క రబీ పంట సాగుకు పనులు చేయాలో లేదా సోయా పంట కోసం రాత్రులు వేచి చూసే ధోరణి ఉందన్నారు.అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రతి రైతుకు పది వేలు ఆర్థిక సహాయం అందించాలని అలాగే పంటలకు బోనస్ అందించాలని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు.కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక అధ్యక్షుడు సంగేపు భోరన్న, సురేందర్, నారాయణ, మోహన్ శ్రీనివాస్, రమేష్ రెడ్డి, శంకర్, శ్రీధర్ రెడ్డి,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం నిధులు విడుదల చేయాలి

- **మంత్రి వడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు టీజీఎస్, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ వినతి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బెస్ట్ అవైలబుల్ స్కీము సంబంధించిన నిధులను గత రెండు సంవత్సరాలుగా 180 కోట్ల రూపాయలను విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ప్రభుత్వం బకాయిలు చెల్లించేంతవరకు పాఠశాలల్లోకి పిల్లలను రానివ్వమని అక్టోబర్ 6 నుండి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగాయి. దీనితో గత వారం రోజులుగా పాఠశాలలకు వెళ్లలేక 30 వేల మంది దళిత, గిరిజన పిల్లలు రోడ్డున పడ్డారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి 180 కోట్ల రూపాయలను విడుదల చేయాలని, తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్), కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్), భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీలు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ విద్యను అందించేందుకు గత 25 రోజుల క్రితం బెస్ట్ అవైలబుట్ స్కీంను ప్రవేశపెట్టారు. ఇప్పుడు ఈ నిధులు పెండింగ్ పెట్టడం వల్లే ఏదైతే అణగారిన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యం నేరవేరకపోగా ఈ స్కీం ఎత్తివేసేందుకు అవకాశం ఏర్పడుతుందని, ఈ స్కీం నిబంధనల ప్రకారం ఆరు నెలలకు ఒక్కసారి బకాయిలు చెల్లింపు చేస్తే ఈ సమస్యలు ఉత్పన్నం కావు కావున 20శాతం బకాయిలు కాకుండా పూర్తి స్థాయిలో విడుదల చేయాలని కోరారు, పేద విద్యార్థులు, ప్రధానంగా సామాజికంగా వెనుకబడిన దళిత, గిరిజన విద్యార్థుల చదువులు మధ్యలో నష్టపోకుండా నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సిపిఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి గారు, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్ నాయక్ కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రజనీకాంత్ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సచిన్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మానాయక్ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి మధు తదితరులు పాల్గొన్నారు

"నువ్వు నాయకుడివైతే అలాగే ఉండు"

# మార్గదర్శకుడు మహబూబ్ ఆలం



బీహార్‌లోని బల్రామ్‌పూర్ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు శాసనసభ్యుడిగా గెలుపొందిన కామ్రేడ్ మహబూబ్ ఆలం, సామాన్యుడిగా జననాయకుడిగా అసాధారణ గుర్తింపు సాధించారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ శాసనసభ పక్ష నాయకుడు, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఆయన అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గర్జిస్తూ, వీధుల్లో సమరశీల పోరాటాలతో ప్రజల మనిషిగా నిలిచారు. 2020 ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన ఆయన, బీహార్ శాసనసభ్యుల్లో అత్యల్ప ఆస్తులు కలిగిన నిరుపేద ఎమ్మెల్యేగా పేరు తెచ్చుకున్నారు. పేదరికంలో జన్మించి, చదువుకుంటూ కూలీ పనులు చేస్తూ, రైతులు, కార్మికుల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడుతూ రాజకీయ జీవితంలోకి అడుగుపెట్టారు. నాలుగు దఫాలుగా ఎమ్మెల్యేగా ఎన్నికైనా, ఆయన జీవనశైలి రాజకీయాలకు ముందు ఎలా ఉందో ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. బల్రామ్‌పూర్‌లో మట్టితో నిర్మించిన సాధారణ ఇంటిలో నివసిస్తూ, ఎలాంటి రాజకీయ విలాసాలకు, ప్రలోభాలకు లొంగకుండా విప్లవాత్మక ఆదర్శాలతో ప్రజా సేవకునిగా జీవిస్తున్నారు.



మహబూబ్ ఆలం జీవనశైలి సామాన్యతను ప్రతిబింబిస్తుంది. ప్రభుత్వం అందించే బంగ్లా, కారు కాన్వాయ్‌లను తిరస్కరించి, సైకిల్ లేదా మోటార్ సైకిల్‌పై నియోజకవర్గంలో తిరుగుతూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటారు. పాట్నాలోనూ సామాన్య వ్యక్తిగా ప్రయాణిస్తూ, ప్రజలతో నేరుగా మమేకమవుతారు. అసెంబ్లీలో రైతులు, కార్మికుల, నిరుపేదల సమస్యలను గట్టిగా వినిపిస్తూ, ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ ప్రజల గొంతుకగా మారతారు. వీధుల్లో జరిగే ఆందోళనల్లో, ప్రజా పోరాటాల్లో ముందుంటూ సమరశీలతను చాటుతారు. రాజకీయ నాయకులు రాజభవనాలు కట్టుకొని, ఖరీదైన వాహనాల్లో తిరుగుతూ ఆస్తులు సమకూర్చుకుంటుంటే, మహబూబ్ ఆలం తనను తాను ప్రజా సేవకునిగా చెప్పుకోవడానికి ఇష్టపడతారు. 'నీవు నాయకుడివైతే అలాగే ఉండు' అనే సూక్తిని ఆయన తన జీవనశైలితో, నిజాయితీతో, అంకితభావంతో నిరూపిస్తున్నారు.

మహబూబ్ ఆలం జీవితం పేదరికంలో మొదలైంది. బల్రామ్‌పూర్‌లో సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన, చిన్నతనంలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. చదువుకునే రోజుల్లో కూలీ పనులు చేస్తూ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ అనుభవాలు ఆయనలో సామాజిక అసమానతలపై, అన్యాయాలపై పోరాడాలనే ఆలోచనను రగిల్చాయి. యువకుడిగా రైతులు, కార్మికుల హక్కుల కోసం ఉద్యమాల్లో పాల్గొని, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్‌లో చేరారు. నియోజకవర్గంలో ప్రజల కష్టాలను అర్థం చేసుకుని, వారి కోసం పోరాడే నాయకుడిగా ఎదిగారు. ఆయన రాజకీయ జీవితం ప్రజలతో మమేకమైన జీవనశైలితో ముడిపడి ఉంది. బల్రామ్‌పూర్‌లోని ప్రజలు ఆయనను నాయకుడిగా కాక, తమలో ఒకరిగా భావిస్తారు. సాధారణ ఇంటిలో నివసిస్తూ, సైకిల్‌పై తిరుగుతూ, ప్రజల సమస్యలను వినడం, పరిష్కరించడం ఆయన రోజువారీ జీవితంలో భాగం.

2020 ఎన్నికల్లో సాధించిన భారీ మెజారిటీ ఆయన పట్ల ప్రజల నమ్మకాన్ని సూచిస్తుంది. బీహార్ శాసనసభ్యుల్లో చాలా మంది విలాసవంతమైన జీవనశైలి, భారీ ఆస్తులు కలిగి ఉంటే, మహబూబ్ ఆలం అత్యల్ప ఆస్తులతో సాధారణ జీవనశైలిని కొనసాగిస్తున్నారు. ఆయన ఆస్తుల వివరాలు బహిర్గతమైనప్పుడు, ఇతర శాసనసభ్యులతో పోలిస్తే అత్యల్పంగా ఉన్నాయని తేలింది. ఇది ఆయన నిజాయితీని, ప్రజా సేవకు అంకితభావాన్ని స్పష్టం చేస్తుంది. రాజకీయాలను సంపద సముపార్జనకు సాధనంగా చూసే నాయకుల మధ్య, ఆయన తన సాధారణ జీవనశైలితో ఆదర్శంగా నిలుస్తారు. అసెంబ్లీలో రైతుల సమస్యలు, కార్మికుల హక్కులు, నిరుపేదల ఆర్థిక ఇబ్బందులు, సామాజిక అసమానతలపై నిరంతరం పోరాడుతూ, ప్రజలకు అండగా నిలుస్తారు. వీధుల్లో జరిగే ఆందోళనల్లో ముందుండి, ప్రజా ఉద్యమాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తారు.

మహబూబ్ ఆలం రాజకీయ జీవితం కేవలం అధికారం కోసం కాదు, ప్రజల కోసం, సామాజిక న్యాయం కోసం అంకితమైన జీవితం. ఆయన సాధారణ జీవనశైలి, నిజాయితీ, సమరశీలత రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తాయి. బీహార్‌లో రాజకీయ నాయకులు విలాసవంతమైన జీవనశైలిని అవలంబిస్తుంటే, ఆయన సైకిల్‌పై తిరుగుతూ, ప్రజల సమస్యలను వినడం, పరిష్కరించడం ద్వారా ఒక విభిన్న ఉదాహరణగా నిలుస్తారు. ఆయన జీవితం రాజకీయాల్లో నిజాయితీ, సామాన్యత ఎలా ఉండాలో చూపిస్తుంది.

**- మామిండ్ల రమేష్ రాజా, 7893230218**


## చచ్చాక!

బతికుండగాపట్టించుకోరు
చచ్చాక ఏడుస్తారు!
ఈబుద్ధి తెలుగోడికేనా?
మనుషులంతా ఇంతేనా?
అందుకే కవీంద్రరవీంద్రుడు
చచ్చాక నాగురించి చెప్పే
నాలుగు మంచిమాటలు
బ్రతికుండగాచెప్పమన్నాడు
ప్రభుత్వాలు కూడా అంతే
చచ్చాకఎందుకుఅవార్డులు
బ్రతికుండగానే ఇవ్వండి!
తృప్తిగాచచ్చిపోతాడు!!
చచ్చినోడి కళ్ళు చారడేసి!
ఊరకనే పుడతాయా ఇవి!
బ్రతికుండగా చెప్పటమే!
ప్రాణం కొట్టుకు పోదూ!
చచ్చేదాక చంపుతారు
చచ్చాక గొప్పోడంటారు!
ఆమాట బతికుండగాచెప్పు
అదీ సంస్కారమంటే!
ఎందరో మహానుభావులు
వాళ్ళత్యాగాలకు విలువేది
బ్రతికున్నంత కాలం
కష్టాలు నిష్టూరాలే!
ఎందరో విప్లవకారులు
మార్క్స్ అల్లూరి భగత్
కష్టాలు కన్నీళ్ళతో నే
లక్ష్యసాధనలోపోయారు!
విశ్వ వెలుగులు వీళ్ళు
సైన్స్ ఆవిష్కర్తలు!
మతం బ్రతకనిచ్చిందా?
అన్యాయంగా చంపేసింది!
మతం దేవుడు వ్యక్తిగతం
అవి 'లోపలే' ఉండాలి!
సైన్స్ విశ్వవ్యాప్తం కావాలి!
అదీ అభివృద్ధి అంటే!
మనదేశం అంతారివర్స్!
మతము రాజ్యము దోస్తీ!
సైన్స్ వెలుగులు నాస్తి!
మారనివ్వరు ఈదుస్థితి!
గుళ్ళు చుట్టూ తిరిగితే
అదే మోక్ష సాధనం!
మూరపాలిత రాజ్యం!
మతంగాళ్ళదే భోజ్యం!
రహస్యం వర్ణవిభజనం!
త్రైవర్ణికులవ్యూహచతురం
శూద్రపోడిని పొగడటమా!
ఇంకేమన్నాఉందా!హతోస్మి
ఎన్నాళ్ళైనా ఈదేశంలో
ఇదే చావు! అంబేద్కర్
పూలేపేర్లుప్రచారంకాకుండ
ఎన్ని వ్యూహాలు అల్లారు?
ఇక్కడ విజ్ఞానానికి చావు
వేదంలో నే గండికొట్టారు!!
శూద్రులకుచదువులెందుకు
చావండి! చూద్దాం చచ్చాక!

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

## బీహార్ ఎన్నికలను మతమే నిర్ణయిస్తుందా!?

బిహార్ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ ఎన్నికలు నవంబర్ 6 మరియు 11 తేదీల్లో జరగనున్నాయి. 243 సీట్లకు పోటీ ఉంటుంది. ఎన్‌డీఏ - ఇండియా కూటముల మధ్య తీవ్ర పోరు ఉండనుంది. ఎన్‌డీఏలో బీజేపీ, జేడీ(యూ) ప్రధాన పార్టీలు కాగా. ఇండియా కూటమిలో ఆర్‌జేడీ, కాంగ్రెస్ కీలకం కానున్నాయి. ఈ ఎన్నికల్లో ముస్లిం ఓట్లు నిర్ణయాత్మక శక్తిగా మారే అవకాశాలున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో రోజు రోజుకు మార్పులు అతి వేగంగా మారుతున్నాయి. ఫలితాలు ఇలాగే వస్తాయి అని చెప్పలేం. ఇప్పటికే విపక్షాల నేత రాహుల్ గాంధీ "ఓటు చోరీ " ఆరోపణలు దేశ దృష్టిని, ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. ముస్లిం సమాజం ఓట్లు ఎటు వెళ్తాయో చెప్పలేం. ఈ విషయంలో సలావుద్దీన్ ఓవైసీ శకుని పాత్ర ను కూడా అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.




**బీహార్ ముఖ చిత్రం:**
బిహార్ జనాభా సుమారు 13 కోట్లు. అందులో ముస్లిం జనాభా 17.7 శాతం. ఇది దాదాపు (2.3 కోట్ల మంది.)
ఉత్తర బిహార్‌లో 70 శాతం ముస్లింలు నివసిస్తున్నారు. సీమాంచల్ ప్రాంతం కీలకం. కతిహార్, పుర్నియా, అరారియా జిల్లాల్లో ముస్లిం జనాభా 40 శాతం వరకు పెరిగింది. కిషన్‌గంజ్ జిల్లాలో 68 శాతం ముస్లింలు ఉన్నారు. 87 నియోజకవర్గాల్లో 20 శాతానికి మించి ముస్లింలు ఉన్నారు. ఈ ఓట్లు 80 సీట్లలో ప్రభావం చూపే అవకాశం ఉంది. ముస్లింలు పేదరికం, నిరక్షరాస్యతతో వెనకబడ్డారు. వారిలో 73 శాతం పస్మందా ముస్లింలు. ఇవి వెనకబడిన వర్గాలు. ఈ వర్గం నుంచి రాజకీయ ప్రాతినిధ్యం తక్కువ.
చరిత్రలో ముస్లిం ప్రాతినిధ్యం తక్కువగానే ఉంది. 1952 నుంచి 2020 వరకు 17 ఎన్నికల్లో 390 మంది ముస్లిం శాసనసభ్యులు మాత్రమే ఎన్నికయ్యారు. ఇది మొత్తం 7.8 శాతం మాత్రమే. 1985లో ఉమ్మడి బిహార్‌లో 34 మంది ఎన్నికయ్యారు. అప్పుడు 10 శాతానికి మించింది. అది మొదటి మరియు చివరి సారి. 2020లో 243 సీట్లలో 19 మంది మాత్రమే. పస్మందా ముస్లింల నుంచి 2020లో ఐదుగురు మాత్రమే ఎన్నికయ్యారు. నలుగురు ఏఐఎంఐఎం నుంచి, ఒకరు ఆర్‌జేడీ నుంచి. వారు తర్వాత పార్టీలు మారారు. ముఖ్యమంత్రి పదవి ఒక్కసారి మాత్రమే వచ్చింది. అబ్దుల్ గఫూర్ 1970లో ముఖ్యమంత్రి అయ్యారు. కానీ రెండేళ్లు కూడా కొనసాగలేదు. ఆ తర్వాత ఉపముఖ్యమంత్రి పదవి కూడా రాలేదు. మంత్రి పదవులు నాలుగు లేదా ఐదుగురికి మాత్రమే దక్కాయి. స్పీకర్, చైర్మన్ పదవులు కొందరికి వచ్చాయి. కానీ గత నాలుగు దశాబ్దాలుగా ప్రాధాన్యత తక్కువగా ఉంది.
ప్రస్తుత ఎన్నికల్లో ముస్లిం అభ్యర్థులు తక్కువ. బీజేపీ ఒక్క ముస్లిం అభ్యర్థికి కూడా టికెట్ ఇవ్వలేదు. జేడీ(యూ) నాలుగు సీట్లలో ముస్లిం అభ్యర్థులను నిలబెట్టింది. ఎన్‌డీఏ మొత్తం ఐదుగురు ముస్లిం అభ్యర్థులు. వీరిని ముస్లిం మెజారిటీ సీట్లలోనే నిలబెట్టారు. ఆర్‌జేడీ 143 అభ్యర్థుల లిస్ట్‌లో 18 మంది ముస్లింలు ఉన్నారు. ఏఐఎంఐఎం 25 అభ్యర్థులను ప్రకటించింది. అందులో ఎక్కువ మంది ముస్లింలు. కాంగ్రెస్, జేడీ(యూ), ఎల్‌జేపీ ముస్లిం అభ్యర్థుల సంఖ్యను తగ్గించాయి. మొత్తం ముస్లిం ప్రాతినిధ్యం జనాభాకు సరిపడదు.దాదాపు అన్ని పార్టీలు ఏలాంటి మినహాయింపు లేకుండా ముస్లింలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయి.

ఓటర్ లిస్ట్ డిలీషన్ కూడా ఇక్కడ పెద్ద సమస్య గా ఉంది. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరుతో 65 లక్షల ఓట్లు తొలగించారు. అందులో ముస్లింలు 24.7 శాతం. (ఇది సుమారుగా 16 లక్షలుగా ఉంటుంది.) మహిళలు 16 లక్షల మంది మిస్సింగ్. సీమాంచల్ ప్రాంతంలో ఎక్కువ ప్రభావం కనిపిస్తుంది. ధాకా నియోజకవర్గంలో 80,000 ముస్లిం ఓట్లు తొలగించే ప్రయత్నాలు జరిగాయి. బీజేపీ ప్రమేయం ఉందని ఆరోపణలు అయితే సోషల్ మీడియాలో వస్తున్నాయి. ఇంత వరకు ఎలక్షన్ కమిషన్ నిర్ధారించ లేదు. పైగా ఈ వాదాన్ని తిరస్కరిస్తుంది కూడా. మతం డేటాను మేము ట్రాక్ చేయము అంటుంది. కానీ ముస్లిం సమాజంలో భయాలు మాత్రం పెరిగాయి. ఇది ఎన్నికల ఫలితాలను ఎంత మేరకు ప్రభావితం చేస్తాయో చూడాలి.

ముస్లిం వోటింగ్ ప్యాటర్న్ వేగంగా మారుతున్నాయి. గతంలో మై (ముస్లిం-యాదవ్) కాంబినేషన్ ఆర్‌జేడీకు బలాన్ని ఇచ్చింది. 1990లలో లాలూ ప్రసాద్ యాదవ్‌కు సపోర్ట్ బాగానే దొరికింది. ఇప్పుడు ముస్లింలు మాత్రం బీజేపీకి వ్యతిరేకం అని ప్రి ఎలక్షన్ సర్వే సంస్థలు చెపుతున్నారు. నిజానికి బీజేపీ ముస్లిం జనాభా ఓట్లను ఏమాత్రం ఆశించటం లేదు కూడా. కనుక ఇక్కడ ముస్లింలు ఆర్‌జేడీ, కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. సీమాంచల్‌లో ముస్లింలు కులాలు, భాషలు, ఇస్లామిక్ మూవ్‌మెంట్ల ప్రకారం విభజన ఉంటుంది అంటున్నారు. ఏఐఎంఐఎం, ప్రస్తుతం మీడియాలో వస్తున్న వార్తలను బట్టి ప్రశాంత్ కిషోర్ జన్ సురాజ్ వోట్లు స్ప్లిట్ అయ్యే అవకాశం కూడా బాగా కనపడుతుంది. ముస్లింలు కమ్యూనల్ హార్మోనీ, వెల్ఫేర్, ప్రాతినిధ్యం కోసం ఓటేస్తారు. 40-60 స్వింగ్ సీట్లలో వారి ఓట్లు కీలకం అయ్యే అవకాశం కనపడుతుంది.
లేటెస్ట్ సర్వేలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఒక పోల్‌లో ఎన్‌డీఏ మరియు ఇండియా మధ్య 1.6 శాతం తేడా. ఎన్‌డీఏ ముందంజలో ఉంది అంటుంది. మరో సర్వేలో ఎన్‌డీఏ ఫ్రంట్‌రన్నర్. తేజస్వి యాదవ్ పిడిఏ (పస్మందా, దళిత, అడివాసి) స్ట్రాటజీ అమలు చేస్తున్నారు. ముస్లిం ఓట్లు ఇండియాకు అనుకూలం. కానీ వోటర్ డిలీషన్ ప్రభావం ఉండవచ్చు. ఎన్‌డీఏ తన కోర్ వోటర్లపై దృష్టి పెట్టింది. యాదవ్, ముస్లిం అభ్యర్థులను తగ్గించింది. స్టార్ క్యాంపెయినర్లు 44 మంది. ఇండియా కూడా ఉత్సాహంగా ప్రచారం చేస్తోంది.
మొత్తానికి ముస్లిం సమాజంలో అసంతృప్తి పెరుగుతోంది. సెక్యులర్ పార్టీలు వాటిని ఉపయోగించుకుంటున్నాయి. ప్రాతినిధ్యం తక్కువ. వెల్ఫేర్ స్కీములు ఇబ్బడిముబ్బడిగా ప్రకటించినా ... అవి సరిగ్గా అమలు అవుతున్న రుజువులు లేవు. ఓటు డిలీషన్ భయాలు కూడా బాగానే ఉన్నాయి. ఈ భయం ముస్లిం ఓట్లను ఏకీకృతం చేస్తుంది. ఈ సందర్భంగా ఏఐఎంఐఎం వంటి పార్టీలు కొంత మేరకు ప్రయోజనం పొందవచ్చు. కానీ అదే జరిగితే ఇండియా కూటమికి నష్టం. మొత్తంగా ముస్లిం ఓట్లు ఎన్నికల ఫలితాన్ని మార్చేస్తాయి అనే అభిప్రాయం ఎక్కువగా కనపడుతుంది. బిహార్ రాజకీయాలు మరిన్ని మలుపులు తిరగవచ్చు. అందరూ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# తెలుగు సాహిత్యంలో నానో కవిత్వం- అవలోకనం

తెలుగు సాహిత్యంలో నానో కవితా ప్రక్రియ అనేది ఒక ప్రత్యేకమైన, సూక్ష్మ పరిమాణంలో ఉన్నా, భావసాంద్రతతో కూడిన కవితా రూపం. ఈ ప్రక్రియ ద్వారా కవులు నాలుగు పదాల ద్వారా విశాలమైన భావాలను వ్యక్తపరుస్తారు. ఈ ప్రక్రియను ప్రారంభించినది ఈగ హనుమాన్ , 2005లో ఈ ప్రక్రియను తెలుగు సాహిత్యంలో ప్రవేశపెట్టారు.

నానో అనేది భౌతిక శాస్త్రంలో "సూక్ష్మాతిసూక్ష్మం" (10-9) అని అర్థం. ఈ పేరు ద్వారా ఈ కవితా ప్రక్రియ యొక్క సూక్ష్మతను తెలియచేస్తుంది.

**నానో కవితా లక్షణాలు**

నానో కవితలు కొన్ని ప్రత్యేక లక్షణాలతో కూడి ఉన్నాయి.అవి నాలుగు పదాలు.ప్రతి నానో కవితలో నాలుగు పదాలు మాత్రమే ఉంటాయి. సూక్ష్మత ఉంటుంది. ప్రతి పదం లోతైన భావాన్ని కలిగి ఉంటుంది. భావ సాంద్రత ఉంటుంది. చిన్న పదాలతో పెద్ద భావాలను వ్యక్తపరుస్తాయి. సృజ నాత్మకత ఉంటుంది.ప్రతి పదంలో కొత్తదనం ఉంటుంది.

**నానో కవితా లక్షణాలు - విశ్లేషణ**

నానో కవిత్వం అనేది తెలుగు సాహిత్యంలో అత్యంత సూక్ష్మమైన కవితా ప్రక్రియగా, దీని లక్షణాలు కింది విధంగా ఉన్నాయి. అవి నాలుగు స్వతంత్ర పదాలు,ప్రతి నానో కవితలో పదాల సంఖ్య పరిమితం, సాధారణంగా నాలుగు పదాలు మాత్రమే ఉంటాయి. ఈ నాలుగు పదాలు ఒకదాని తర్వాత ఒక దాన్ని అనుసరించకుండా, స్వతంత్రంగా ఉండాలి.ఈ స్వతంత్రత ద్వారా కవితకు మరింత స్వేచ్ఛ, సృజనాత్మకత వస్తుంది.రెండు కోనసాగింపు లేకపోవడం అనగా ప్రతి పదం తన ప్రత్యేక భావాన్ని వ్యక్తం చేస్తుంది, పదాల మధ్య రీతీ పరిమాణం లేదా వాక్య నిర్మాణ పరిమితి ఉండదు. ఈ లక్షణం కవితకు క్లుప్తతను, గాఢతను ఇస్తుంది.మూడు వ్యాకరణ సంధి పదాలు ఉండవచ్చు.అనగా నానోలో ఒక పదం అనగా రెండు పదాల సంధి కలిగిన పదంగా ఉండవచ్చు. ఉదాహరణకి: "మామిడాకులు" = మామిడి ం ఆకులు. ఇలా పదాల సంధి వాడకం ద్వారా అర్థాన్ని గాఢతతో, సంక్షిప్తంగా వ్యక్తం చేయవచ్చు.ఇంకా క్లుప్తత, గాఢత, ఆర్ద్రత. అనగా నానో కవిత్వం చిన్న పరిమాణంలో గాఢ భావాన్ని వ్యక్తం చేయడం ప్రధాన లక్ష్యం. పదాల సంఖ్యను తగ్గించడం ద్వారా, భావసాంద్రత, ఆర్ద్రత, మరియు హృదయ స్పందన సాధ్యమవుతుంది. మరోకటి ఊహించని చమత్కారం-నానో కవిత్వంలో రీతీ, పదాల క్రమం లేదా భావప్రకటనలో అంచనాకు విరుద్ధంగా వచ్చే ఊహలు ఉంటాయి. ఇది పాఠకుని మదిని, ఊహాశక్తిని తాకే విధంగా ఉంటుంది. ఇంకా ధ్వని ప్రాధాన్యత.నానో కవిత్వంలో పదాల శబ్దాలు, ధ్వనులు ముఖ్యపాత్ర వహిస్తాయి. ధ్వని ప్రధాన్యత వల్ల కవితకు సంగీతాత్మకత, హృదయ హత్తుకునే శ్రవణ అనుభూతి వస్తుంది.ఇంకా హృదయాన్ని తాకెట్టు చెప్పడం (భావాత్మక విద్యుత్) అనగా చిన్నా పరిమాణంలో, నానో కవిత్వం సొగసైన భావాలను, హృదయాన్ని తాకే విద్యుత్‌ప్రవాహంలా వ్యక్తం చేస్తుంది. ఈ లక్షణం నానో కవిత్వాన్ని మరింత ప్రత్యేకం, సులభంగా గుర్తింపయ్యేలా చేస్తుంది.

**నానో కవిత్వ లక్షణాలు, ధోరణులు మరియు పరిశీలన**

నానో కవిత్వంలో నాలుగు పదాలు మాత్రమే ఉపయోగించి, రెండు పాదాలుగా భావాన్ని విభజించడం ఒక ప్రత్యేక లక్షణం. మొదటి రెండు పదాలు ఒక యూనిట్‌గా, మూడో, నాలుగో పదాలు మరో యూనిట్‌గా ఉండి, రెండు యూనిట్లు ఒకదానికొకటి సమానార్థక భావాంశాల ను కలిగి ఉండాలి.ఈ విధానం ద్వారా నానో కవిత్వం చిన్న పరిమాణంలో, కానీ గాఢ భావాన్ని వ్యక్తం చేయగలుగుతుంది.నానోలో అత్యంత ప్రధాన లక్షణం ధ్వని ప్రభావం. ధ్వని లేకపోతే, నానో ఒక "ఆకులు లేని వృక్షం" లాంటిది. ఇటీవల, కొంతమంది కవులు నానోలో అంత్య ప్రాసలకు ప్రాధాన్యం ఇచ్చి, అందం కలిగిన పంచ్‌లను తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, ఈ ప్రయత్నంలో భావ గాఢతను విస్మరిస్తున్నారనే ఆందోళన కలుగుతుంది. పుష్యమి సాగర్ గారు రాసిన వ్యాసాలు నానో కవిత్వం యొక్క గొప్పతనాన్ని మరింత విశ్లేషిస్తూ, పాఠకునికీ నానోలోని సృజనాత్మకతను, భావప్రతిభను గుర్తించగలిగేలా ఉన్నాయి.ఏ సాహిత్య ప్రక్రియ అయినా కాల పరీక్ష,విమర్శలు, సామాజిక స్వీకారం వంటి అంశాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. నానో కవిత్వం కూడా అదీ తప్పు కాదు. నానోలకు సమాంతరంగా పుడిన ఇతర సూక్ష్మ కవిత్వ ప్రక్రియలు నానీలు, రెక్కలు, హైకూలు, మావి చివురులు, అణువులు, విస్మయాలు, చెక్కెర కేళీలు, పనస తోనలు, పూత రేకులు, చక్షువులు, సకినాలు, చిటికెలు %-% వీటిలో కొన్ని మాత్రమే ప్రజా ఆదరణ పొందాయి.నానో కవిత్వం చిన్న పరిమాణంలో ఉన్నా, ధ్వని ప్రధాన్యత, గాఢ భావం, ప్రతీకాత్మకత, హృదయానికి తాకే విద్యుత్ ప్రభావం ఉంది.

**నానో కవితల ఉదాహరణలు, విశ్లేషణ**

నానో కవిత్వం తెలుగు సాహిత్యంలో చిన్న పరిమాణంలో ఉన్నా, లోతైన భావాలను వ్యక్తం చేసే ప్రత్యేక రూపం. ఈ కవితలలో ప్రతి పదం ఒక స్వతంత్ర భావాన్ని వ్యక్తం చేస్తుంది, మరియు కలిపి ఉన్న నాలుగు పదాలు గాఢమైన భావసారాన్ని ఉత్పన్నం చేస్తాయి.(ఈగ హనుమాన్, నానో కవిత్వం, 2005, వ్యాసం).
పచ్చిక/రాణి/మంచు ముత్యం/కిరీటం.ఈ నానో ఉయ్యల రోహిణి రాసినది. "తెల్లని మంచు పచ్చిక గడ్డిపై కిరీటం లా ఉందని" ఆలోచన ఈ కవితలో వ్యక్తం అయింది. పద్యంలోని పచ్చిక గడ్డి పై మంచు కప్పి, కిరీటంలా మెరుస్తుందనే దృశ్యం,హృదయాన్ని తాకేలా ఉంది. లోతుగా పరిశీలిస్తే, ఈ కవితలో గడ్డి అణచివేతకు సంకేతం ఉంది, కానీ కాలం కలిసే ప్రక్రియలో గడ్డి కూడా మెరిస్తుందని భావన వ్యక్తమవుతుంది. ఈ విధంగా నానో కవితలో పదాల చిన్నతనం, కానీ భావాల లోతు స్పష్టమవుతుంది. పడవ/ ఈత/ తెడ్డు/ గోస. వెంగళ భాస్కర్ రాసిన ఈ నానో పడవ జీవితాన్ని సూచిస్తుంది. సాధారణంగా మనం పడవ జీవనాన్ని చూస్తాం, కానీ ఈ కవితలో "తెడ్డు" అనే పదం ద్వారా పడవను నడిపించడానికి ఉన్న కష్టాలను గుర్తుచేసే ప్రయత్నం ఉంది.ఉదాహరణకి, పడవను ఒడ్డు చేయడం, ఇంట్లో తల్లిదండ్రులు పడవ తెడ్డు లాంటి బాధ్యతలు నిర్వహించడం వంటివి ఇందులో వ్యక్తమవుతాయి. చిన్న పదాలతో కూడిన ఈ కవితలో సామాజిక, వ్యవహారిక అంశాలను కూడా ప్రతిబింబించవచ్చు.పత్తి /మీగడ/వర్షం/ కాగడ. రైతుల పరిస్థితిని ప్రతిబింబించే ఈ నానో వర్షం కారణంగా పంటకు వచ్చే లాభం లేదా నష్టం యొక్క భావాన్ని చూపిస్తుంది."మీగడ" అనే పదం వర్షం సమస్యలను సూచిస్తుంది, "కాగడ" ద్వారా పంటలో వచ్చే నష్టాన్ని ప్రతీకాత్మకంగా చూపిస్తుంది. చిన్న పదాలతో, కానీ సమస్యకు గాఢమైన అర్థాన్ని అందించే కవిత్వం ఇది.డాలర్/దండయాత్ర/జీవనం/ధ్వంస.పోతగాని సత్యనారాయణ రాసిన ఈ నానో ఆధునిక జీవనంపై ఒక వ్యంగ్య వ్యాఖ్యానంగా ఉంది.డబ్బును మానవాతీత శక్తిగా చూపిస్తూ, దండయాత్ర (పని, పోరాటం), జీవనం, ధ్వంసం వంటి పదాలతో సమాజం మీద వ్యంగ్యంతో కూడిన ఆలోచనను ప్రేరేపిస్తుంది. చిన్న పదాలే అయినా, ప్రపంచ వాస్తవాలపై కవిత్వం తన ప్రభావాన్ని చూపిస్తుంది. జ్ఞానం/ అహంకారం/ ప్రయోజనం/శూన్యం.హరి ప్రసాద్ రాసిన ఈ నానో "నాకే అంతా తెలుసు అనీ విర్రవీగితే, ప్రయోజనం ఏమీ ఉండదు" అనే తాత్పర్యాన్ని వ్యక్తం చేస్తుంది.ఇక్కడ నాలుగు స్వతంత్ర పదాలు సరళంగా ఉంటూ, మనసుకు తాకే భావాన్ని ప్రేరేపిస్తాయి. జ్ఞానం, అహంకారం, ప్రయోజనం, శూన్యం అన్న పదాలు కలసి సత్యాన్ని, మానవ ప్రవర్తనపై లోతైన పరిశీలనను అందిస్తాయి.ఈ ఉదాహరణల ద్వారా, నానో కవితల ముఖ్య లక్షణాలు స్పష్టమవుతాయి. చిన్న పరిమాణం, గాఢ భావసారం, ధ్వని ప్రధాన్యత, ఊహించని చమత్కారం, హృదయాన్ని తాకే విద్యుత్ ప్రభావం. ప్రతి నానో కవితలో నాలుగు స్వతంత్ర పదాల ద్వారా ఒక సంక్లిష్ట భావాన్ని సరళంగా, కానీ లోతుగా వ్యక్తం చేయడం ఈ ప్రక్రియను ప్రత్యేకం చేస్తుంది.

**నానోలు రాసిన ప్రముఖ కవులు**

నానో కవిత్వం తెలుగులో ఒక ప్రత్యేక, సూక్ష్మమైన కవితా ప్రక్రియగా రూపాంతర మవుతుంది. ఈ ప్రక్రియను అనేక కవులు స్వీకరించి, విభిన్న భావాలను వ్యక్తపరచడానికి ఉపయోగించారు. వారిని చూస్తే ఈగ హనుమాన్ % నానో కవిత్వానికి పునాదులు ఏర్పరచిన వ్యక్తి. 'మార్పు' మరియు 'లోలోకి' వంటి నానో సిరీస్‌లలో, సూక్ష్మత, గాఢత, ఆర్ద్రత ప్రధాన లక్షణాలపై దృష్టి పెట్టాడు.నూతక్కి రాఘవేంద్ర రావు సాంప్రదాయ కవిత్వాన్ని నానో రూపంలో వ్యక్తం చేశారు, చిన్న పదాలతో వ్యక్తిగత భావాలను వర్ణించారు.బద్ది నాగేశ్వర రావు - సామాజిక, వ్యక్తిగత అంశాలను నానోలో పొందుపరించారు.డా. తిరునగరి - భౌతిక ప్రపంచం, మానవ భావాలను నానో రూపంలో పరిశీలించారు.బోబ్బిలి జోసేఫ్ (విరజాజులు) - సూక్ష్మతలో వర్ణన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. బి.ఇందిర, మరువం ఉష, ఆది శేషారెడ్డు, కోల్లి రాజా, బొమ్మరాత యేల్లయ్య - ప్రతీ కవి నానో ప్రక్రియలో తమ ప్రత్యేక శైలిని రూపొందించారు. భావ సాంద్రత, ధ్వని ప్రధాన్యత, ఊహించని చమత్కారం వంటి లక్షణాలను వినియోగించారు,పోతగాని సత్యనారాయణ - ఆధునిక జీవనం, డబ్బు, సామాజిక అంశాలను నానోలో సారాంశంగా ప్రదర్శించారు. శిరంశెట్టి కాంత రావు, కాసర్ల రంగారావు, బోందుమల్లె స్వాతి, చందుపట్ల శ్రీధర్, తోకల రాజేశం, మాల్య శ్రీ, వీధుల రాంబాబు, ఆడేపు ముత్యాలరావు, బీరం శ్రీనివాస రావు, దాస్యం రూత్ మేరీ, జి.వి.ఆర్.కే. సుబ్బారామ మూర్తి, శంకర్ రెడ్డి, పద్మ కళ - వీరి నానో కవిత్వం వ్యక్తిత్వాన్ని, సృజనాత్మకతను, మరియు భావప్రకటనలోని ప్రావీణ్యాన్ని ప్రతిబింబిస్తుంది.ఈ కవుల సహకారంతో, నానో కవిత్వం తెలుగు సాహిత్యంలో చిన్న పరిమాణంలో, గాఢ భావాన్ని, హృదయాన్ని తాకే శక్తిని, ధ్వని ప్రధాన్యతను కలిగిన ప్రత్యేక కవితా ప్రక్రియగా పేరుపొందింది. ప్రతి కవిత్వకారుడు తన వ్యక్తిత్వాన్ని, భావప్రకటనను నాలుగు స్వతంత్ర పదాలతో సారాంశంగా వ్యక్తం చేస్తారు, ఇది నానో కవిత్వం ప్రధాన లక్షణం. నానో కవిత్వం తెలుగు సాహిత్యంలో అత్యంత సూక్ష్మమైన,కానీ భావపూర్ణమైన ప్రక్రియగా నిలిచింది. ఈ ప్రక్రియను ఈగ హనుమాన్ ప్రారంభించినప్పటి నుంచి, అనేక మంది కవులు దానిని తమ సొంత ఊహ, భావన, దృక్కోణాలతో విస్తరించారు. ముఖ్యంగా నూతక్కి రాఘవేంద్రరావు మరియు బొందుమల్లి స్వాతి మరియు రాజేశ్వరి వంటి కవులు ఈ ప్రక్రియను ప్రజల మధ్య వ్యాప్తి చేసేందుకు విశేష కృషి చేశారు.నూతక్కి రాఘవేంద్రరావు పది వేల (10,000) పైగా నానోలు రాసి తెలుగు నానో కవిత్వానికి సరికొత్త దారిని చూపించారు.ఆయన నానోలను తేనెటీగలతో పోలుస్తూ "తేనెటీగలు" అనే రూపకాన్ని సృష్టించారు. ఈ నానోలు కేవలం నాలుగు పదాల సంక్షిప్తతలోనే కాక, జీవితంలోని గాఢ భావజాలాన్ని కూడా ఆవిష్కరిస్తాయి.ప్రతి నానో ఆయనకు ఒక జీవ అనుభవం, ఒక చిన్న సత్యం, ఒక స్ఫూర్తి వనరుగా ఉంటుంది. నానో ప్రక్రియలో ఆయన చేసిన ఈ విస్తృత సాహిత్య సృజన సూక్ష్మంలో సర్వం అనే తాత్విక భావనకు ప్రతిరూపంగా నిలుస్తుంది. అలాగే, బొందుమల్లి స్వాతి గారు నానో ప్రక్రియలో సృజనాత్మకతకు అంతర్జాతీయ పరిమాణం తీసుకువచ్చారు. ఆమె తెలుగు మాత్రమే కాకుండా ఐదు భాషల్లో ం తెలుగు, ఇంగ్లీష్, హిందీ, తమిళం, మరియు మరాఠీ ం నానోలు రచిస్తున్నారు. ఇప్పటి వరకు ఆమె 12,000 పైగా నానోలు సృష్టించి, నానోలను ప్రపంచ కవిత్వ వేదికల్లో పరిచయం చేశారు. బొందుమల్లి స్వాతి గారు నానోలను కేవలం కవిత్వం కాక, ఒక భావసమీకరణ పద్ధతిగా చూస్తున్నారు. "నాలుగు పదాలలో సగం లోకం, సగం హృదయం దాగి ఉంటుంది" అని ఆమె పేర్కొన్నారు. (సూచన: బొందుమల్లి స్వాతి, "నానో - నా నిశ్శబ్ద కవిత్వ భాష", ఆంధ్ర సాహిత్య వేదిక సదస్సు, హైదరాబాద్, 2023). ఆమె అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పత్ర సమర్పణలు చేసి, నానో కవిత్వాన్ని పరిశోధనా అంశంగా ముందుకు తెచ్చారు. కేవలం పాల్గొనడం మాత్రమే కాక, నానోల ప్రాధాన్యతను సాహిత్య వేదికల్లో చర్చకు తెచ్చే ప్రయత్నం కూడా ఆమె క్రమం తప్పకుండా చేస్తున్నారు. "అవకాశం లేకపోతే కూడా సృష్టించుకోవాలి, ఎందుకంటే నానో కవిత్వం అనేది ఒక సాహిత్య ద్రవశక్తి" అని ఆమె అభిప్రాయం.

**నూతక్కి రాఘవేంద్ర రావు గారి నానో కవిత్వ విశేషాలు**

నానో కవిత్వంలో నూతక్కి రాఘవేంద్ర రావు ఒక ప్రముఖ కవి మరియు ఇతర ప్రక్రియ సృష్టికర్త. నానో కవిత్వంలో నాలుగు స్వతంత్ర పదాలతో ఒక కవితను రూపొందించడం మాత్రమే కాకుండా, ఈ కవితలకు మరో రెండు స్వతంత్ర పదాలను చేర్చి, కవితను విస్తరించటంలో గుణాత్మకంగా కృషి చేస్తున్నారు. వీరు ఈ విస్తరించిన నానోలను "తేనేటిగ (తేనె బోట్లు)" అని పేరు పెట్టుకున్నారు.అయితే, నానో కవిత్వ సృష్టికర్త ఈగ హనుమాన్ గారు, నాలుగు పదాల పరిమితిని నానో యొక్క ముఖ్య లక్షణంగా పేర్కొన్నారు. మరిన్ని పదాలను చేర్చడం వలన అది నానో కవిత్వం గానే కాక, "రెక్కలు" వంటి కొత్త ప్రక్రియగా భావించవచ్చని సూచించారు.

**నానో కవిత్వంపై విమర్శలు, చర్చలు**

ప్రతి సాహిత్య ప్రక్రియకు ఒక ప్రత్యేకత ఉంటుంది,దానికి అదే ప్రణాళిక, విధానం, లక్ష్యం ఉంటుంది. అద్దేపల్లి రామమోహన్ తత్త్వప్రకారం, ప్రతి కవితా ప్రక్రియలో ఒక విశేషం ఉండాలి. నానో కవిత్వం కూడా ఈ సూత్రానికి లోబడి ఉంటుంది. నానో కవిత్వం చిన్న పరిమాణంలో, నాలుగు పదాలతో మాత్రమే వ్యక్తం అవుతుండగా, ప్రతి నానోలో సూక్ష్మత, గాఢత, ధ్వని ప్రధాన్యత, హృదయానికి తాకే భావం ఉంటాయి.ఇప్పటి వరకు నాలుగు పాదాలున్న నానోను 'అసలు కవిత్వం' అనే విషయంపై తీవ్ర చర్చ కొనసాగుతోంది. రోచిష్ మన్ గార్లాంటి విమర్శకులు, "నాలుగు లైన్లు మాత్రమే ఉన్నాయి, ఇది కవిత్వమా?" అని ప్రశ్నిస్తున్నా, నానో కవిత్వం స్థిరమైన సారాన్ని, రస ఉత్పత్తి, భావప్రవాహం, మానసిక స్పందన ద్వారా మాత్రమే అభ్యర్థి పాఠకునికి చేరుస్తుంది (రోచిష్ మన్, నానో కవిత్వం పై విమర్శలు, 2017, వ్యాసం).నానో కవిత్వం చిన్న పరిమాణం కలిగి ఉండడం వల్ల, పాఠకుడు పదే పదే పఠనం చేయడం ద్వారా, అతి సూక్ష్మ భావనల్లో కూడా సంతృప్తి, ఆనందం, మోక్షం లాంటి అనుభూతులు పొందవచ్చు. పదం ఒకటి అయినా, అక్షరం ఒకటి అయినా పాఠకునికి రసాన్ని ఉత్పత్తి చేస్తే అది కవిత్వంగా స్థిరపడింది అనిపిస్తుంది.కాబట్టి, కవిత్వ పరిమాణం మాత్రమే కాదు, దాని గాఢత, సృజనాత్మకత, ధ్వని, హృదయప్రభావం ముఖ్యంగా భావించవలసిన అంశాలున్నాయి.నానో కవిత్వంపై విమర్శలు మరియు చర్చలు ఉన్నప్పటికీ, ప్రతీ ప్రక్రియలో ఒక ప్రత్యేకత, ఒక సారాంశం ఉంటుందని అద్దేపల్లి రామమోహన్ సిద్ధాంతం సూచిస్తుంది.

ఈ విధంగా, నానో కవిత్వం తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన, వినూత్నమైన ప్రక్రియగా ముద్రించబడింది.ఈగ హనుమాన్ సృష్టికర్తగా ప్రారంభించిన నానో, చిన్న పదాల సహాయంతో గాఢ భావాలను, ప్రతీకల ద్వారా హృదయాన్ని తాకే శక్తిని కలిగిన కవితా రూపంగా ప్రసిద్ధి చెందింది. నూతక్కి రాఘవేంద్ర రావు, పుష్యమి సాగర్, అద్దేపల్లి రామమోహన్, మరియు వల్లభపురం జనార్దన్ వంటి అనేక కవులు, పరిశోధకులు, వ్యాసకారులు నానో యొక్క లక్షణాలు, రూపకళ, సామాజిక, సాంస్కృతిక ప్రభావాలను విశ్లేషించి, దీనిని తెలుగు సాహిత్య లోకంలో స్థిరమైన స్థానం సంపాదించడా నికి కృషి చేస్తున్నారు.నానో కవిత్వం చిన్నదైనప్పటికీ, ధ్వని, భావ, ఊహ, గాఢత వంటి అంశాల ద్వారా పాఠకుడిలో రసోత్పత్తి చేస్తుంది. ప్రతి నానో, నాలుగు చిన్న పదాలతో కూడినా, ఒక విస్తృతమైన భావరూపాన్ని ప్రతిబింబించగలదు. నానోపై వచ్చిన వ్యాసాలు, రచయితల విశ్లేషణలు, మరియు పరిశోధనలు, ఈ ప్రక్రియకు సాహిత్య పరంపరలో భవిష్యత్తులో మరింత గుర్తింపు లభించగల అవకాశాన్ని సూచిస్తున్నాయి.

**డా. ఐ. చిదానందం**
తెలుగు అధ్యాపకులు
చరవాణి - 8801444335

# గద్వాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తా...

- రహదారుల పునరుద్ధరణకు రూ.316 కోట్ల నిధులు మంజూరు.
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి వెల్లడి




**మల్దకల్, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.గద్వాల నియోజకవర్గ పరిధిలోని పలు రహదారుల పునరుద్ధరణకు రూ .316.45 కోట్ల నిధులు మంజూరనట్లు తెలిపారు. హామ్ ద్వారా ఆర్ అండ్ బిరోడ్లు ఎరిగెర- అయిజ- అలంపూర్ రోడ్,బల్గెర,మిట్టదొడ్డి, తుమ్మలపల్లిరూ.9.61 కోట్లు గద్వాల్, రంగాపూర్ రోడ్డు గద్వాల, జమ్మిచేడు, పూడూరు ఎక్స్ రోడ్, వీరాపురం,పుటాన్ పల్లి,అనంతపురం,ఎర్రవల్లి రూ.39.84 కోట్లు గద్వాల రాయచూర్ రహదారి రూ.74.29 కోట్లు,గద్వాల అయిజ రోడ్డుగద్వాల,పరుమాల, కుర్వపల్లి,పెద్దపల్లి, బూడిదపాడు, అమరవాయి, మల్దకల్, రూ.24.32కోట్లు బల్గెర,మాచర్ల రోడ్డు రూ.1.5కోట్లు,గట్టు మాచర్ల రోడ్డు రూ.12.80 కోట్లు మొత్తం రూ.162.45 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. హ్యామ్ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్?ద్వారా గద్వాల్ నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ రోడ్లకు రూ.154కోట్ల నిధులు మంజూరైనట్లు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వెల్లడించారు. గ్రామీణ రోడ్డు పునరుద్ధరణకు రూ.154 కోట్లు మంజూరు కాగాపనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. గద్వాల నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గద్వాలలో నర్సింగ్ కళాశాల నిర్మాణం పూర్తి కావడం జరిగింది.నవంబర్ 25న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి చేత మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుంది.80 కోట్లతో మెడికల్ కాలేజీ భవనం నిర్మాణం భూమి పూజ చేస్తున్నట్లు తెలిపారు.నాపై నమ్మకంఉంచి నన్ను రెండుసార్లు గెలిపించిన గద్వాల నియోజకవర్గం ప్రజల అభివృద్ధి కోసం ఈ ప్రాంత అభివృద్ధి కోసం గద్వాల నియోజకవర్గంలోని నా చివరి శ్వాస వరకు గద్వాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. ఈ నిధులు గద్వాల్ నియోజకవర్గానికి కేటాయించినందుకు మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి,ఆలయ కమిటి చైర్మన్ వెంకట్రాములు,మాజీ జడ్పీటిసి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు ప్రతాప్ గౌడ్, విజయ్ కుమార్,మాజీ మున్సిపల్ చైర్మన్ బాబర్, మాజీ కౌన్సిలర్ మురళి, నాయకులు విక్రమ్ సింహా రెడ్డి, కురుమన్న,నాగులుయాదవ్, చంద్రశేఖర్ రిజ్వాన్, నర్సింహులు,సంగాల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ప్రభుత్వం కాంగ్రెస్

- ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



**దోమ, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** దోమ మండల పరిధిలోని రాకొండ గ్రామంలో ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు భూమి పూజను నిర్వహించారు, ఇల్లు లబ్ధిదారుడు చాపల అఖిల/బద్రి లబ్ధిదారుడు మేము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతో రుణపడి ఉన్నామని చెప్పారు, కమిటీ సభ్యులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని చెప్పారు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు త్వరగా ఇల్లు నిర్మించుకోవాలని ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెప్పారు, ఈ భూమి పూజ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చాపల వెంకటయ్య, మాజీ సర్పంచ్ చాపల లక్ష్మయ్య, మాజీ ఉపసర్పంచ్ కొత్త జంగయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మజ్జిగ వెంకటయ్య, చాపల శ్రీనివాస్, వడ్ల సురేందర్, కొత్త అంజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ తలారి వెంకటయ్య, మజ్జిగ రాములు, కావలి లక్ష్మయ్య, మజ్జిగ మహేష్ చాపల ఆంజనేయ, మజ్జిగ నర్సింలు, పిల్లి వెంకటయ్య బండి వెంకటయ్య, కావలి ఆంజనేయులు చాపల ఆనంద్ కుమార్, ఆర్ నారాయణ రెడ్డి, చాపల నరసింహులు పిల్లి రాజు సూర్య రిపోర్టర్ బద్రి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకున్న రైతులు

- ప్రాణాలైనా ఇస్తాం కానీ భూములు ఇచ్చేది లేదు
- అధికారులకు తెగేసి చెప్పిన మొండి గౌరెల్లి రైతులు



**యాచారం, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** ఆర్డీవో, రెవెన్యూ అధికారులు, గో బ్యాక్ అంటూ భూ సేకరణకై అభిప్రాయ సేకరణ సభలో రైతులు గ్రామస్తులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసుల బందోబస్తు మధ్యన మొండి గౌరెల్లి లో భూసేకరణకై అధికారులు అభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. 19, 68, 127 సర్వే నెంబర్లలో 821 ఎకరాల పట్టా, అసైన్మెంట్ భూసేకరణ కోసం ఆర్డీవో అనంతరెడ్డి, తహసిల్దార్ అయ్యప్ప రైతుల గ్రామస్తులకు కలిసి సమావేశం నిర్వహించారు. మొదటినుంచి సభను రైతులు, గ్రామస్తులు సభలో నినాదాలు చేస్తూ భూ సేకరణకై అధికారులు గ్రామానికి రావద్దని రైతులు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇంతకుముందే భూసేకరణకై రైతులంతా పెద్ద ఎత్తున అందరూ చేపట్టి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పారిశ్రామిక పార్కు కోసం గ్రామంలో ఉన్న భూముల్ని ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేది లేదని కరాకండిగా చెబుతూనే రైతులంతా గ్రామస్తులంతా మూకుమ్మడిగా సభను బహిష్కరిస్తున్నామని తెగేసి చెప్పారు. ఏళ్ల తరబడిగా గ్రామంలో ఉన్న భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్నామని అర్ధాంతరంగా ఇప్పుడు భూములు సేకరిస్తామని చెప్పడం రైతుల పొట్ట కొట్టడమే అన్నారు. ఉన్నఫలంగా భూములను తీసుకుంటే బతకడం ఎలాగని రైతులు మండిపడుతూ అధికారుల్ని నిలదీశారు. దీంతో చేసేది ఏమీ లేక అధికారులు సభ నుంచి వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మర్పల్లి అంజయ్య యాదవ్,బండిమీద కృష్ణ, మేకల యాదగిరిరెడ్డి, తాండ్ర రవీందర్, ప్రవీణ్, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు మారినా పరిహారం అందడం లేదు

- ప్రభుత్వం వెంటనే రైతులకు న్యాయం చేయాలి
- సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య




**మహేశ్వరం, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** ప్రభుత్వాలు మారిన ఫ్యాబ్ సిటీ(ఈ సిటీ)భూ నిర్వాసితులకు నష్టపరిహారం నేటికీ అందలేదని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు.బుధవారం కందుకూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట రావిర్యాల,జన్నాయిగూడ గ్రామాల రైతులతో కలిసి సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ...మహేశ్వరం మండలంలోని రావిర్యాల, జన్నాయిగూడ గ్రామంలో 2004 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పరిశ్రమల కోసం ఫ్యాబ్ సిటీనీ(ఈ సిటీ)ఏర్పాటు చేసిందన్నారు.వందల ఏళ్ల నుంచి భూమిని సాగుచేసుకుంటున్న రైతులను ప్రభుత్వం నిండ ముంచిందన్నారు.ఫ్యాబ్ సిటీకి భూములు ఇచ్చిన రైతులకు 150 గజాల చొప్పున ఇంటి స్థలం ఇస్తానాన్ని చెప్పి రైతులను మోసం చేసిందన్నారు. హెచ్ఎండిఏ లే అవుట్ తరహాలో లే అవుట్ వేసి ఇస్తామన్న హామీని ప్రభుత్వం మర్చిపోయిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకొని ఫ్యాబ్ సిటీకి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు దుబ్బాక రాంచందర్, అలువాల రవి కుమార్, శేఖర్,పలువురు సీపీఎం పార్టీ నాయకులు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించి, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి కన్వీనర్గా జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ తుల్జా నాయక్ వ్యవహరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పరిశ్రమల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ. 24 లక్షల సబ్సిడీకి డిపిసి ఆమోదం తెలిపిందని తెలిపారు. ఈ వర్గాల యువత పరిశ్రమల స్థాపనలో ముందుకు వచ్చి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రా మెటీరియల్స్ సరఫరా, భూకమతాల మంజూరు, విద్యుత్ కనెక్షన్లు, ఇతర అనుమతులపై వచ్చిన దరఖాస్తులను సమీక్షించి, పూర్తి అయిన ఫైళ్లను త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ తుల్జా నాయక్ మాట్లాడుతూ టీజీ ఐపాస్ ద్వారా పరిశ్రమలకు వేగంగా అనుమతులు జారీ చేసే ప్రక్రియను పారదర్శకంగా అమలు చేస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ), హెచ్ఎండిఏ, డిటిసిపి, ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్, ఎక్సైజ్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జీవ విజ్ఞాన విద్యా, పరిశోధనలో కొత్త అధ్యాయం

- తెలంగాణ ప్రభుత్వంతో ఆర్ఎంఐటీ విశ్వ విద్యాలయం ఒప్పందం




**ఖైరతాబాద్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** జీవవిజ్ఞాన (లైఫ్ సైన్సెస్) విద్య, పరిశోధన రంగా ల్లో గ్లోబల్ సహకారాన్ని బలోపేతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం, ఆస్ట్రేలియాలోని ఆర్ఎం ఐటీ యూనివర్సిటీ వ్యూహాత్మక భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టాయని ఆర్ఎంఐటీ విశ్వవిద్యాలయం డిప్యూటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కాథరిన్ ఇట్సి యోపోలస్ తెలిపారు. ఈ క్రమంలో ఇరు సంస్థలు లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ఓఎల్)పై సంతకాలు చేశాయని బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రీస్, కామర్స్ శాఖల మంత్రి డి.శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరైనట్లు చెప్పారు. ఆర్ఎంఐటీతో తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈఓ శక్తి నాగప్పన్ సంతకాలు చేశారని తెలిపారు. తాజాగా ఆర్ఎంఐటీ విశ్వవిద్యాలయం, బిట్స్ హైదరాబా ద్తో కలిసి 'బిట్స్-ఆర్ఎంఐటీ' హయ్యర్ ఎడ్యుకేషన్ అకాడమీను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఆస్ట్రేలియా, భారత దేశాల మధ్య అధునాతన పరిశోధన, విద్యా మార్పిడి, ఆవిష్కరణ ఆధారిత విద్యను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం లక్ష్యం అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వార తెలంగాణ నుండి పరిశోధకులు జాయింట్ పీహెచ్డీ ప్రోగ్రామ్లను కొనసాగించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమ విద్యా కాలంలో కొంత భాగాన్ని బిట్స్ హైదరాబాద్లో, మరికొంత భాగాన్ని ఆర్ఎంఐటీ మెల్బోర్న్లో పూర్తి చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ భాగస్వామ్యంతో విద్యార్థులు, అధ్యాపకులు రెండు దేశాల మధ్య మార్పిడి చేసుకునే అవకాశం ఉంటుందని, కలిసి పరిశోధనలు చేస్తారని పేర్కొన్నారు. పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా పాఠ్య ప్రణాళికను రూపొందించి, భారత దేశంలో పరిశోధన, ఆవిష్కరణలను బలపరచడమే లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ అధికారులు, విద్యావేత్తలు హాజరైనట్లు చెప్పా రు.

## కొమురం భీమ్ ఆశయాలు నెరవేర్చాలి




**శామీర్పేట్, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** గోండు వీరుడు కొమురం భీం జయంతి సందర్భంగా సీనియర్ ఉద్యమ కారులు కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ శామీర్ పేట్ లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు.. భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసి రజ కార్లను గడగడ లాడించిన వీరుడు కొమురంభీం అని అన్నారు. తెలంగాణ లోని జోడే ఘాట్ లో ఆయన చేసిన వీరోచిత పోరాట పటిమ చరిత్రలో నిలిచి పోతుందని అఫ్జల్ ఖాన్ తెలిపారు. గోండు ప్రజల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసి చివరకు కుర్దు పటేల్ అనే వెన్ను పోటు దారుని కారణంగా తుది శ్వాస వదిలారని, ఆయన తెలంగాణ ప్రజల గుండెల్లో ఎప్పటికి గూడు కట్టు కుని ఉంటారని పేర్కొన్నారు.. ఆయన ఆశయాలను మరవరాదని అఫ్జల్ఖాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్ ఖాన్ తో పాటు నాయకులు ఉపాధ్యాయులు పి నర్సింహా రెడ్డి, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, రాజు, శన్ముఖ్ రావు, రాంబాబు, గణపతి నారాయణ. తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు హెల్మెట్ల పంపిణీ



**ఘట్కేసర్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని, పోచారం ఐటి క్యారిడార్ పోలీస్ స్టేషన్ గస్తీ విధులు నిర్వహిస్తున్న పోలీసులకు మంగళవారం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మల్కాజిగిరి (ఏ.సీ.పి) ఎస్. చక్రపాణి, ఇన్స్పెక్టర్ బి. రాజు కలిసి వారి చేతుల మీదుగా పోలీస్ సిబ్బంది ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తితో పాటు వెనకాల కూర్చున్న వ్యక్తికి రక్షణ నిమిత్తం హెల్మెట్ల ను పంపిణీ చేసి, వారికి అందజేయడం జరిగిందని తెలిపారు.

## ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

- జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి



**నంగునూరు, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి ఉన్నత మైనదని అని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నంగునూరు మండల వనరుల కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. నంగునూరు ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలంలోని వివిధ పాఠశాలలో పనిచేస్తున్న 11 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిఈఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తిని మించిన వృత్తి మరొకటి లేదని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి మంచి సేవ చేసే విధంగా తయారు చేయాలన్నారు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని కాలానుగుణంగా కొత్త కొత్త అంశాలు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వృత్యాంతర శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో వినియోగించాలని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధనలో మెళకువలను విద్యార్థులకు ఎప్పటికప్పుడు తెలియజేసి వారి తెలివితేటలు పెంచే విధంగా నాణ్యమైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే విధంగా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు, సన్మానంతో ఉపాధ్యాయులకు మరింత బాధ్యత పెరుగుతుందని అన్నారు, ఈ కార్యక్రమంలో నంగునూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్, మగ్దుంపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి సుధాకర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జానయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు పార్థసారథి, మనీష్ కుమార్, జైపాల్ యాదవ్, హరికిషన్, బిక్షపతి, బాలకిషన్ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుడిసెలు వేసుకున్న గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వండి



**చేవెళ్ల, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** గుడిసెలు వేసుకున్న గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామస్వామి అన్నారు. చేవెళ్లలోని భూపోరాట కేంద్రంలో మండల పార్టీ కార్యదర్శి మల్గారి సత్తిరెడ్డి అధ్యక్షతనలో భూపోరాట కమిటీ ఆధ్వర్యంలో సమావేశము నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.రామస్వామి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని 75వ సర్వే నెంబర్ లో 44 నెలలుగా ఇండ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకొని ఇండ్ల పట్టాల కోసం భూపోరాటం చేస్తున్నారని అన్నారు. భూపోరాట కేంద్రంలో గుడిసెలు వేసుకున్న గుడిసె వాసులకు మంచినీళ్లు, కరెంటు మౌలిక సదుపాయాలు లేకున్నా మొక్కవోని దీక్షతో పోరాటం చేస్తున్న వారిని ప్రభుత్వం కానీ అధికారులు కానీ రాజకీయ నాయకులు కానీ పట్టించుకోవడం లేదని అన్నారు. ఎన్నికలు జరుగుతున్నప్పుడు మాత్రమే పేదవాళ్లు, పేద వారి ఓట్లు గుర్తుకు వస్తాయని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుపేదల కోసం భూపోరాట కేంద్రంలో ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. లేదా ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు యండి.మక్బూల్, ఎన్ఎఫ్ఐడబ్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, మండల పార్టీ కార్యదర్శి మల్గారి సత్తి రెడ్డి, బాబురావు, ఎలీషా, యాదగిరి, పాపయ్య, పెంటయ్య, లలిత, భాగ్యమ్మ, వెంకటమ్మ, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్యలపై చర్యలు తీసుకోవాలి



**రాజేంద్రనగర్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** మణికొండ ఫెడరేషన్ ప్రతినిధుల బృందం నీటి సమస్యలపై హెచ్ఎమ్డబ్ల్యూఎస్ఎస్బీ అధికారులను కలిసి చర్చించింది. మణికొండలో పెండింగ్లో ఉన్న క్యాన్ నంబర్ల జారీని త్వరితగతిన పూర్తి చేయాలని ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ ఆర్వపల్లి విజ్ఞప్తి చేశారు. అధికారులు 2-3 వారాల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే నీటి నిల్వ ప్రాంతాల్లో రైన్ వాటర్ పిట్స్ నిర్మాణంపై సూచన చేయగా, అధికారులు పరిశీలిస్తామని తెలిపారు. మీటర్ రీడింగ్లు నియమితంగా చేయాలని, గండిపేట నుంచి నిరంతర సరఫరా కోసం 3 ఎంఎల్డి ఫిల్టర్ పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ సభ్యులు రవీందర్ రెడ్డి, రాజశేఖర్, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
23 అక్టోబర్ 2025

# ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం

- ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ వైద్యం
- రాష్ట్రంలో 160 డయాలసిస్ కేంద్రాలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పోలీస్ ఐఎంఏ, ఎన్.ఎం.జే కాన్సర్ ఇనిస్ట్యూట్ హైదరాబాద్ వారు సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పి ఎస్ ఆర్ గార్డెన్ లో జిల్లా పోలీసు కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన కంప్రెహెన్సివ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడాతూ... పోలీసులను కుటుంబాలను కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. ప్రభుత్వం సమాజ బాధ్యతతో ప్రజల ఆరోగ్యం, విద్య, వైద్యంకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పోలీసు కుటుంబాల కోసం కంప్రెహెన్సివ్ హెల్త్ క్యాంపు ను నిర్వహించటం చక్కని ఆలోచన అన్నారు. 13 రకాల వైద్య నిపుణులైన డాక్టర్లు ఈ హెల్త్ క్యాంప్‌లో పాల్గొంటున్నారన్నారు. గ్రామీణ ప్రాంతం నుండి పట్టణ ప్రాంతాల వరకు ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. సామాన్యుడికి భారం కాకుండా అందరికీ అందుబాటులో ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ వైద్యం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రతి రోజు డయాలసిస్ రోగుల సంఖ్య పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో 160 డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయన్నారు . ప్రతి 30 కిలోమీటర్ల పరిధిలో డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు కు మరో 80 కేంద్రాలను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి వెల్లడించారు . త్వరలో 80 ట్రామా సెంటర్స్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైవేలపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ లను గుర్తించి గోల్డెన్ అవర్ ను దృష్టిలో పెట్టుకొని అక్కడ ట్రామా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి జిల్లాలో డే కేర్ క్యాన్సర్ సెంటర్ ను ఏర్పాటు చేసి కీమో థెరపీ అందిస్తున్నామన్నారు. సంగారెడ్డి జిల్లాలో మెడికల్ కాలేజీ, 500 బెడెడ్ ప్రభుత్వ ఆసుపత్రి, అందోల్‌లో నర్సింగ్ కాలేజీ, సంగారెడ్డిలో పారామెడికల్ కాలేజీ, క్రిటికల్ కేర్ బ్లాక్, 5 కొత్త పి.హెచ్.సి బిల్డింగ్‌లను ప్రారంభించామన్నారు. పఠాన్‌చెరువు, నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రులలో సి.హెచ్.సి సదాశివపేటలో డయాలిసిస్ సెంటర్స్ లను ఏర్పాటు చేశామన్నారు . వీటితో పాటు మరో 3 సబ్ హెల్త్ సెంటర్స్ లను మంజూరు చేశామన్నారు. ఈ సందర్భంగా హెల్త్ క్యాంపు లో ఏర్పాటు చేసిన అన్ని విభాగాలను పరిశీలించారు. కియోస్క్ ద్వారా మంత్రి బీపీ చెక్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిజిఐఐసి చేర్మన్ నిర్మల జగ్గారెడ్డి, కలెక్టర్, పి. ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, ప్రముఖ వైద్యులు డా. కిరణ్ కుమార్, ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాజు గౌడ్, సెక్రటరీ డా ఆనంద్, డా. శ్రీధర్, డా. శ్రీహరి, జిల్లా పోలీస్ అధికారులు, వారి కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

## గట్టు మండల పరిధిలోని వివిధ పాఠశాలల ఆకస్మిక తనిఖీ



**గట్టు, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** గట్టు మండలంలోని ఆలూరు, నల్లగట్టు తాండ,బింగిదొడ్డితాండ,తుమ్మలచెరువు గ్రామాల మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ నల్లారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థుల ప్రగతిని మరియు హాజరు ఉపాధ్యాయుల బోధన విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు మరియు వంట ఏజెన్సీ వారికి సూచనలు చేశారు. తుమ్మలచెరువు మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయురాలు మహేశ్వరి గణిత పాఠంను బోధించిన సమక్షంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ నల్లారెడ్డి విద్యార్థుల పక్కనే కూర్చునే వారితోపాటు విద్యార్థులు ఆడుకునే గోలీలతో కూడికలు మరియు తీసివేతలు ఎలా చేయాలి అనే విషయాన్ని విద్యార్థులకు సులభతరంగా అవగాహన అయ్యేలా మహేశ్వరి ఉపాధ్యాయురాలు బోధించడం పట్ల కాంప్లెక్స్ హెడ్మాస్టర్ నల్లారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న, సిఆర్పి శ్రీధర్ పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి స్థలం కేటాయించాలి

- అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులులి ముత్తిగళ్ళ రామ్‌చందర్



**చిన్నశంకరంపెట్, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ నగేష్ కుమార్ ను కలిసి చిన్నశంకరంపేట మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ ఎదురుగా భారత దేశ ఉప ప్రధాని సంఘసంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు కోసం 5 గుంటల భూమినీ కేటాయించాలని వినతిపత్రం అందించిన నాయకులు అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు ముత్తిగల రామచంద్రం జైభీమ్ సంఘం జిల్లా అధ్యక్షులు పాతూరి రాజు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు ఉషన్న గల్లా మురళి మాదిగ అంబేద్కర్ సంఘం నాయకులు కర్నే సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# లారా మైనింగ్ సంస్థ ఆగడాలు అరికట్టండి

- భారీ పేలుడుతో గ్రామ ప్రజలు ఆందోళన
- భారీ పేలుడులో తీవ్ర గాయాలైన వ్యక్తి ఎక్కడ..?
- “లారా”మైన్స్ సంస్థపై కేసు నమోదు చేయాలి
- తెలంగాణ బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెరుమాండ్ల కిషోర్ కుమార్



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** విచ్చలవిడిగా భారీ పేలుడుకు పాల్పడుతున్న లారా మైన్స్ ఆగడాలను అరికట్టాలని తెలంగాణ బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు పెరుమాండ్ల కిషోర్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య , జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, డిఆర్ఓలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెరుమాండ్ల కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లక్దారం గ్రామ శివారులో “లారా”మైన్స్ కు సంబంధించిన క్వారీలో ఇష్టానుసారంగా పేలుడు చేపడుతున్నారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 15న జరిపిన భారీ పేలుడులో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడడంతో సంఘటనా స్థలం నుంచి వ్యక్తిని ఎక్కడకు తరలించింది చెప్పాలన్నారు. గాయపడిన వ్యక్తి పరిస్థితిని వెంటనే వివరించాలని తెలిపారు. లక్దారం పరిధిలోని కొన్ని క్రషర్ల యాజమాన్యాలు కనీస నిబంధనలు పాటించకుండ ఇష్టానుసారంగా క్వారీలు నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్దారం గ్రామ ప్రజలు నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతకాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈనెల 15న “లారా”మైనింగ్ సంస్థకు సంబంధించిన క్వారీలో భారీ పేలుడులో ఓ వ్యక్తి తీవ్ర గాయాలు కాగా నిర్లక్ష్యంగా బొలోరో వాహనంలో గుట్టుచప్పుడు కాకుండా తరలించడాన్ని చూస్తే “లారా”మైనింగ్ సంస్థ యాజమాన్యం కార్మికుల పట్ల ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో అర్థమౌతుందన్నారు. ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి వివరాలను వెంటనే తెలియజేయాలని డిమాండ్ చేశారు. వల్లా ప్రమాద విషయం వెలుగులోకి వచ్చిందని ఆయన అన్నారు. భారీ పేలుడు తో సుమారు ఐదు కిలోమీటర్ల మేర శబ్దాలు వినబడుతున్నట్లు తెలిపారు. రుద్రారం గ్రామం కంపించిందని ఆ గ్రామం నుండి కొందరు యువకులు వీడియోలు తీయడం చూస్తే పేలుడు తీవ్రత ఇట్టే అర్థమౌతుందని అన్నారు. “లారా” మైనింగ్ సంస్థలో జరిపిన పేలుడులో గాయపడిన బాధితుడిని నిర్లక్ష్యంగా ఎక్కడకో తరలించి, ప్రమాదాన్ని వెలుగులోకి రాకుండా ప్రయత్నించిన “లారా” యాజమాన్యంపై పూర్తి విచారణ జరిపి “లారా” మైనింగ్ సంస్థ పై వెంటనే పోలీస్ కేసు నమోదు చేసి గాయపడ్డ బాధితుడికి కార్మిక చట్టాల ప్రకారం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఈనెల 24న ఇందిరా పార్క్ వద్ద జరిగే మహా ధర్నాను విజయవంతం చేయండి



**అచ్చంపేట, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాగర్ కర్నూల్ బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ నిరంజన్ ముదిరాజ్ మాట్లాడుతూ 42% బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో 24 అక్టోబర్ 2025న %u%. చిరంజీవులు,జస్టిస్ ఈశ్వరయ్య, డాక్టర్.విశారదన్ మహారాజ్ సారథ్యం లో 42% బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని నైతి షెడ్యూల్లో చేర్చాలన్న డిమాండ్తో ఇందిరాపార్క్ దగ్గర మహాధర్నా నిర్వ హించబోతా ఉన్నాం జిల్లాలోని బీసీ,ఎస్సీ,ఎస్టీ సమాజం విద్యావంతులు మేధావులు యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ జిల్లా నాయకులు మరియు ధర్మ సమాజ్ పార్టీ అచ్చంపేట కాంటెస్ట్ %మీూా% క్యాండిడేట్ సాయి మహారాజ్ మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ల చట్టాన్ని తొమ్మిదో షెడ్యూల్ చేర్చాలని డిమాండ్తో.. మహాధర్నా చేపడుతున్నాం అని, మొన్న జరిగిన బందు చీకట్లో జరిగిన యుద్ధమని ఎందుకంటే చీకట్లో జరిగిన యుద్ధంలో లైట్ వేసి చూస్తే బీసీ జేఏసీ కి నాయకత్వం వహించింది మొత్తం అగ్రకులాలే ఎవడు దొంగ తెలియకుండా బీసీ సమాజాన్ని మోసం చేయడానికి కాంగ్రెస్ బిజెపి టిఆర్ఎస్ పార్టీలో మద్దతు తెలిపి బీసీలను మోసం చేస్తారని, ఆ బందులో గనక పాల్గొనకపోతే ఎక్కడ బీసీ సమాజమంతా ఏకమై రాజ్యాధికారం చేపడతాయి అన్న ఆలోచనతో కన్ఫ్యూజ్ చేయడానికి కాంగ్రెస్,బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు బందులు పాల్గొన్నాయని, రేపు జరిగే మహాధర్నా దొంగ ఎవడు చూయించడం కోసమే మన ఉద్యమానికి అసలైన నాయకులు త్రిమూర్తులు జస్టిస్ ఈశ్వరయ్య, టి.చిరంజీవిలు రిటైర్ ఐఏఎస్ ఆఫీసర్, డాక్టర్.విశారదన్ మహరాజ్ బీసీ,ఎస్సీ,ఎస్టీ రాజ్యాధికార సాధన- జేఏసీ రాష్ట్ర కన్వీనర్ నాయకత్వంలో ఇందిరాపార్క్ దగ్గర 24-అక్టోబర్-2025 న జరిగే మహా ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొనాలని జిల్లా/ నియోజకవర్గంలోని బీసీ,ఎస్సీ,ఎస్టీలు యువత విద్యావంతుడు మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని మహాధర్నాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పు సురేష్,రవి, శ్రీధర్,లింగం,వీరయ్య లు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో మంత్రి వాకిటి శ్రీహరి సుడిగాలి పర్యటన



**మఖ్తల్, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గంలో మంత్రి వాకిటి శ్రీహరి సుడిగాలి పర్యటన చేశారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కాచువార్ నుండి ఎడవెల్లి కి 3.8 కీమీ బీటీ రోడ్డుకు 2.4 కోట్ల వ్యయంతో మరమ్మత్తు ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఊరుకు బీటీ రోడ్లు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రతి గ్రామంలో పశువుల దవాఖాన ఏర్పాటు చేస్తామన్నారు. మక్తల్ పట్టణంలో రానున్న 15 రోజుల్లో కోర్టు ప్రారంభం కానుందని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే 3,600 ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయని అవి పూర్తి కాగానే మరో మూడు వేల ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని మంత్రి స్పష్టం చేశారు. మక్తల్ పట్టణంలో 35 ఎకరాలలో 250 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మక్తల్ నారాయణపేట్ రహదారిని నాలుగు లైన్ల రహదారిగా మారుస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వేరుశెనగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. వచ్చే ఏడాది విత్తనాలు గుజరాత్ నుండి కాకుండా ఇక్కడి నుండే విత్తనాలు తయారు అయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులకు మంత్రి సూచించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని 234 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డిఓ రామచంద్రనాయక్, డిటి పుష్పలత, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హనుమంతు, మాజీ జెడ్పిటిసి జి. లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ బి. గణేష్ కుమార్, వ్యవసాయ అధికారి మిథున్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి

- అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్ ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ కొత్తకోట మండల పరిధి లోని పాలెం రైతు వేదికలో, మదనాపూర్ రైతు వేదికల్లో వేర్వేరుగా వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు మండల స్థాయిలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఖరీఫ్ 2025-26 సీజన్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సన్న, దొడ్డు రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు.వర్షాలు వస్తే ఇబ్బందులు లేకుండా టార్పాలిన్ లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే నిర్దేశించిన మిల్లులకు తరలించాలని చెప్పారు. గన్నీ బ్యాగులు సరిపడునన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు.సమావేశంలో జిల్లా సివిల్ సప్లై డిఎం జగన్, ఆర్డివో సుబ్రహ్మణ్యం, వ్యవసాయ అధికారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## ధాన్యం కొనుగోలుపై శిక్షణ కార్యక్రమం



**వీపనగండ్ల, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలుపైన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల తహసిల్దార్ వరలక్ష్మి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యవసాయ, మహిళా సమైక్య, కో-ఆపరేటివ్ సొసైటీ శాఖలు ఊరి నాణ్యత ప్రమాణాలు పాటించాలని తగిన సలహాలు సూచనలు చేశారు. వరి ధాన్యంలో సన్న రకాలను, దొడ్డు రకం ధాన్యాన్ని గుర్తించాలని అన్నారు. 14% తేమ శాతం సన్న రకాలకు, 17% తేమశాతం దొడ్డు రకం వడ్లకు ఉండాలని అన్నారు. మట్టి, తాలు వడ్లకు ఒక శాతం, కూచించకపోయిన వడ్లకు మూడు శాతం, దెబ్బతిన్న వడ్ల గింజలకు ఐదు శాతం తీయాలని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారి డాకేశ్వర్ గౌడ్, పిఎసిఎస్ సీఈఓ, ఆడిటర్స్, ఏఈఓ, మహిళా సమైక్య సభ్యులు, వరి ధాన్య కొనుగోలు కేంద్రాలు ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించటం, పోరాడటం నేర్పిందే సీపీఐ

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** వందేళ్లలో దేశ పేదలకు, బాధితులకు ప్రశ్నించటం, పోరాడటం నేర్పిందే సిపిఐ అని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాల నరసింహ అన్నారు. బుధవారం వనపర్తి శ్వేతా నగర్ కామ్రేడ్కటికనేని గోపాల్ రావు భవన్లో సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కే శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా కామ్రేడ్ బాల నరసింహ పాల్గొని మాట్లాడుతూ.. వందేళ్లలో సిపిఐ ఏమిచ్చిందని కొందరు విమర్శ చేస్తుంటారని, పేదలకు బాధితులకు ప్రశ్నించటం పోరాటం న్యాయం పొందటం నేర్పింది సిపిఐ మాత్రమే అన్నారు. దోపిడీకి వ్యతిరేకంగా కష్టజీవులకు అండగా సిపిఐ పోరాడి వారి కనుకూలంగా చట్టాలను తెచ్చిందన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న సిపిఐ వందేళ్ళ విజయోత్సవ సభ జరగనుంది అన్నారు. దేశ స్వాతంత్ర కోసం, తెలంగాణ విముక్తి కోసం,తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం సిపిఐ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. ప్రజా పోరాటాలతో పేదలకు భూములు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు,రుణమాఫీ ,ఉపాధి హామీ పథకం, వంటి వాటిని ఎన్నో సాధించిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కార్మికులకు కనీస వేతనం వంటి చట్టాలు సాధించిందన్నారు. వందేళ్ళ విజయోత్సవ నేపథ్యంలో సాధించిన విజయాలను గ్రామ గ్రామాన ప్రజలకు వివరించేందుకు,గద్వాల జోడేఘాట్ బాసర నుంచి,ప్రచార జాతాలు బయలుదేరి డిసెంబర్ 26న జరగనున్న విజయోత్సవ సభకు చేరుకుంటాయన్నారు. గద్వాల నుంచి బయలుదేరిన వనపర్తి జిల్లాలో 6 మండలాలు, నారాయణపేట3, మహబూబ్‌నగర్ 4, గద్వాల్ 2, నాగర్ కర్నూల్ 6 మండలాలలో పర్యటించి ప్రచారం చేస్తుందన్నారు. రాష్ట్రంలో సిపిఐ విస్తరణకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ప్రజా పోరాటాల్లో సిపిఐ ప్రత్యేక పాత్రను ప్రజలు గుర్తించారన్నారు.పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి పార్టీని బలోపేతం చేయాలన్నారు.పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలకు వివరించి ఆకర్షించాల్సిన అవసరం ఉందన్నారు.



### మూడు లక్షల మందితో వందేళ్లు విజయోత్సవ సభ

ఖమ్మంలో మూడు లక్షల మందితో విజయోత్సవ సభ జరుగుతుందన్నారు. ఖమ్మం, కొత్తగూడెంలో నుంచే 80 వేల మంది పాల్గొంటారన్నారు. వనపర్తి జిల్లా నుంచి 300 మంది ఖమ్మం విజయోత్సవ సభలకు హాజరవుతారన్నారు. వందేళ్ళ ఉత్సవ సభకు 40 దేశాల ప్రతినిధులు హాజరై సందేశాలు ఇస్తారన్నారు.దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో ఖమ్మంలో వందేళ్ళ సభ జరుగుతుందన్నారు. ప్రజల మధ్య మతం పేరుతో ఐక్యతను దెబ్బతీసే ఆర్ఎస్ఎస్ కూడా వందేళ్ల సభను జరుపుకోబోతోందన్నారు. విప్లవ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ వచ్చిన నక్సలైట్లు దశలవారీగా ప్రభుత్వానికి సరెండర్ అవుతూ ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు దిశా నిర్దేశం చేసే సిపిఐ వందేళ్ళ ఉత్సవాలకు ప్రత్యేకత ఉందని పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, చంద్రయ్య, రమేష్, రాబర్ట్, మోష, శ్రీహరి, రవీందర్, గోపాల్, గోపాలకృష్ణ, కుతుబ్ కుర్మయ్య, కృష్ణవేణి, గీత తదితరులు పాల్గొన్నారు.

# గుణాత్మక విద్యనందించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



బెల్లంపల్లి, అక్టోబర్ 22 (జనంసాక్షి) : ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. విద్యాలయం పరిధిలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 10వ తరగతి విద్యార్థినులకు ఫిజిక్స్ సబ్జెక్టులో పలు అంశాలను బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. తహసిల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి హై లతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, మండల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన పురోగతిని పరిశీలించి రికార్డులను సరి చూసి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ రకాల ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలో చేపట్టిన మూత్రశాలల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని, ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని అన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, నిత్యవసర సరుకులు నిల్వ చేసే గదిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వంట సమయంలో పారిశుద్ధ్య నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలన్నారు. ఆయన వెంట డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, సంబంధిత అధికారులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు నాణ్యతతో చేపట్టాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ బ్యూరో, అక్టోబర్22 (జనంసాక్షి) : నిర్మల్ గ్రామీణ మండలంలోని నాగ్నాయిపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనం పనులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భవన నమూనా మ్యాపులను పరిశీలించి, అవసరమైన సవరణలపై సూచనలు చేశారు. భవన నిర్మాణం నాణ్యవంతంగా, సమయానికి పూర్తి కావాలని, సరిపడినంతమంది కూలీలను నియమించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ప్రదేశం కేటాయించాలన్నారు. భవనం చుట్టూ హద్దుల గుర్తులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరా మహిళా శక్తి భవనాలు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతను పెంపొందించేందుకు చేపట్టిన ప్రాధాన్యమైన కార్యక్రమమనికలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ పట్టణంలోని బంగల్‌పేట్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతోందని, పనులను నాణ్యవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. దశలవారీగా నిధులు విడుదల చేయడం జరుగుతుందని, అధికారులు పర్యవేక్షణను క్రమం తప్పకుండా కొనసాగించాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ చందు జాదవ్, డీఈ తుకారం రాథోడ్, ఏఈఈ చందన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్లు ప్రభాకర్, రాజు, ఎంపీడీవో గజానన్, హౌసింగ్, ఏ ఈ షరీఫ్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి) : సిర్పూర్ నియోజకవర్గం లో రోడ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. బుధవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం లో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. అంతకుముందు కాగజ్ నగర్ పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో దీపావళి ప్రీతి మిలన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పట్టణంలో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరుతున్నట్లు తెలిపారు. సిర్పూర్ టి మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మండలంలోని లోన వెల్లి, వారిగా గ్రామాల్లో పొలం బాట కార్యక్రమంలో భాగంగా రోడ్లకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో బిజెపి మండల అధ్యక్షులు లావణ్య సత్యనారాయణ, ఎలుములే మల్లయ్య, నేరెళ్ల అశోక్, శ్రీనివాస్ గౌడ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు చిలువేరు సత్యనారాయణ, పాలెపు మురళీధర్, ఇస్దాం శివాలయం చైర్మన్ మైలారపు మురళీధర్, గణపురం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# మంత్రముగ్ధులైన ఈఆర్సి చైర్మన్‌లు

## రామప్ప దేవాలయ సౌందర్యానికి దాసోహం

ములుగు/వెంకటాపూర్, అక్టోబర్22 (జనం సాక్షి): ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రామప్ప దేవాలయాన్ని పంజాబ్ ఈఆర్సి చైర్మన్ విశ్వజిత్ కన్నా దంపతులు మరియు ఉత్తరప్రదేశ్ ఈఆర్సి చైర్మన్ అర్వింద్ కుమార్ దంపతులు సందర్శించారు. ఈ సందర్బంగా వారికి ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమా శంకర్‌లు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టత శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వివరించారు.దేవాలయ ప్రాంగణాన్ని పరిశీలించిన వారు రామప్ప దేవాలయ శిల్పకళ, నిర్మాణ శైలి చూసి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం వారు దేవాలయ సౌందర్యాన్ని ప్రశంసిస్తూ, ఇటువంటి ప్రాచీన కళా సంపదను సంరక్షించడం అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు.అలాగే స్థానిక అధికారుల కృషిని కొనియాడుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో డిఈ రాక్ భాస్కర్, ఏఎస్ కల్యాణ్ , డిఈ కన్స్ట్రక్షన్ ఎంఆర్టి సదానందం, ఎడిఈ ఆపరేషన్ ములుగు వెణుగోపాల్, వెంకటాపూర్ సబ్‌ఇంజినీర్ సాంబరాజు, మరియు వెంకటాపూర్ విద్యుత్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో రోడ్లపైనే పశువులు



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 22 (జనం సాక్షి) : కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో రోడ్లపైనే పశువులు తిష్ట వేసి ప్రయాణికులకు ఇబ్బందులను కలిగిస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన చౌరస్తాల్లో పశువులు సాయంకాలం వేల, రాత్రిపూటల్లో చౌరస్తాల్లో మకాం వేసి .. నెమరు వేస్తున్నాయి. దీంతో వాన దారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా తో పాటు పొట్టి శ్రీరాములు చౌరస్తా, అంబేద్కర్ చౌక్ తదితర చౌరస్తాలు, రోడ్లపైనే ఆవులు, ఆంబోతులు గుంపులుగా చేరి వాహనదారులు, ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. గత సంవత్సర క్రితం రోడ్డుపైన రెండు ఆంబోతులు పోట్లాట పడ్డాయి. దీంతో వాహనదారులు చల్లా చదురుగా పరిగెత్తారు. 4 ద్విచక్ర వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అలాగే గత15 సంవత్సరాల క్రితం అప్పట్లో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కాకముందు ఆంబోతులు పోట్లాడుకున్నాయి. దీంతో కొంతమందికి తీవ్ర గాయాలు అయ్యాయి. అప్పట్లో ఈ సంఘటన సంచల నం రేపింది. దీంతో అప్పటి జిల్లా కలెక్టర్ పట్టణంలో ని అగ్రసేన్ భవన్ ముందుగల బస్టాప్, ఆటో పాయింట్ ను రైల్వే గేటు వేల్పలకి మార్చారు. అంటే ప్రస్తుతం గల రైల్వే ట్రాక్ అవతలి వైపుకు మార్చారు. ఈ విధంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తూ, ట్రాఫిక్కు అంతరాయం కలిగించే పశువులను రోడ్లపైకి రాకుండా చూడాలని అధికారులను పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో పోలీస్ అధికారులు , మున్సిపల్ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకుంటే రోడ్లపైన పశువుల బెడద ఉండదని పలువు రు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.



# కాంగ్రెస్ పార్టీలో యువతకే బంగారు భవిష్యత్తు

- టిపిసిసి అధ్యక్షుడిని కలిసిన యూత్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్

ఆత్మకూర్, అక్టోబర్ 22 (జనం సాక్షి): కాంగ్రెస్ పార్టీలో యువతకే పెద్దపీట వేస్తుంది పార్టీ కోసం పనిచేసే యువతకే బంగారు భవిష్యత్తు ఉంటుందని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్,కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకులు గడ్డం విష్ణువర్ధన్ మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం మహేష్ కుమార్ గౌడ్ పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తున్న పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.కష్టపడి పనిచేసే యువతకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యేక స్థానం కల్పిస్తామని భరోసానిచ్చారు. కాంగ్రెస్ పార్టీ యువతకు పెద్దపీట వేస్తుందని అది గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అన్నిటిని ప్రజలకు తెలియజేస్తూ పార్టీని మరింత బలోపేతం చెయ్యాలని సూచించారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయదుంబి మోగిస్తుందని యువత అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. అలాగే యూత్ కాంగ్రెస్ నేతలకు కూడా పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ భరోసానిచ్చారు.

# ఏసీబీ అధికారులమంటూ టోకరా!

- వరంగల్ ఆర్టీఏ ఎం వి ఐ జయపాల్ రెడ్డికి ఫోన్ చేసి బెదిరింపులు
- రూ.10లక్షల 20 వేలు అర్పించుకున్న ఎంవీఐ
- ఏసీబీ డీఎస్పీని ఆశ్రయించిన బాధిత ఎంవిఐ
- మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు




వరంగల్ బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి) : ఏసీబీ అధికారులు అంటూ వరంగల్ ఆర్టిఏ కార్యాలయంలో ఎంవీఐ గా విధులు నిర్వహిస్తున్న జైపాల్ రెడ్డికి ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరించిన సంఘటన వరంగల్ నగరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఏసీబీ అధికారులమని చెప్పి కొందరు వ్యక్తులు వరంగల్ ఆర్టీఏ ఎం వి ఐ జైపాల్ రెడ్డికి ఫోన్ చేసి రూ.10లక్షల 20వేలు లాగేసుకున్న సంఘటన వరంగల్ నగరంలో సంచలనం రేపుతుంది. అనుమానం వచ్చిన ఎంవీఐ ఏసీబీ డీఎస్పీ సాంబయ్యను కలిసి జరిగినదంతా చెప్పడంతో ఏసీబీ డీఎస్పీ తాము ఇలా ఫోన్లో డబ్బులు అడగడం తప్పుడు పనులు చేయమని సైబర్ నేరగాళ్ల చేతిలో జైపాల్ రెడ్డి ఇరుక్కుపోయాడని చెప్పడంతో సదర్ బాధిత జయపాల్ రెడ్డి వరంగల్ మిల్క్ కాలనీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు ఈ విషయమై బుధవారం మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్ మీడియాతో మాట్లాడారు. వారం రోజుల క్రితం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఎం వి ఐ జైపాల్ రెడ్డికి ఫోన్ చేసి వరంగల్ ఆర్టిఏ లో జరుగుతున్న అవినీతి అంతా తమకు తెలుసని, కొద్దిరోజుల్లోనే నువ్వు రిటైర్మెంట్కు దగ్గరగా ఉన్నావని అనవసరంగా కేసులు ఎందుకని తమకు కావాల్సిన డబ్బులు ఇవ్వాలని ఎం వి ఐ జైపాల్ రెడ్డి ని బెదిరించినట్లు చెప్పారు. బాధితుడు వారి అకౌంట్ కు , ఫోన్ ద్వారా మొత్తం 10 లక్షల 20వేల రూపాయలు దశలవారీగా చెల్లింపులు జరిపినట్లు తెలిపారు. పదేపదే ఫోన్లు చేస్తూ ఇంకా డబ్బులు కావాలని అడుగుతుండడంతో అనుమానం కలిగి ఎం వి ఐ జైపాల్ రెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని ఎవరికైనా ఎలాంటి అనుమానం కలిగిన పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్ కోరారు.గుర్తు తెలియని వ్యక్తులు 98868 26656, 98804 72272, 95919 38585 నెంబర్ నుంచి ఫోన్లు చేసినట్టు తెలుస్తుంది. వరంగల్ ఆర్టిఏ లో సీనియర్ ఎం వి ఐ గా విధులు నిర్వర్తిస్తున్న జయపాల్ రెడ్డి అంత పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లింపులు చేయడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. తనకు పూర్తిగా తెలిసిన వారే ఇలాంటి మోసం చేశారా అని అనుమానాలు రేకెత్తుతున్నాయి. అలాగే అంతలా వారు బెదిరించడం వల్లనే తాను డబ్బులు చెల్లించాడా అని కూడా అనుమానం కలుగుతుంది.. ఏదేమైనా సైబర్ క్రైమ్ పోలీసులు ఇలాంటి సైబర్ నెరగాలను పట్టుకొని తగిన శిక్ష విధిస్తే గాని ఇలాంటి నేరాలు పునరావృతం కాకుండా ఉంటాయని అభిప్రాయం అధికారుల్లో ప్రజల్లో కలుగుతుంది.

## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు : మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్



సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వరంగల్ నగరంలోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. తాజాగా వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న జైపాల్ రెడ్డి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి రూ.10 లక్షల 20 వరకు డబ్బులు కోల్పోయాడని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రజలు ఎలాంటి అపరిచిత ఫోన్ కాల్స్ నుండి వచ్చే సమాచారానికి, కాల్స్ కి స్పందించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ఎలాంటి అనుమానాలు కలిగిన పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఇన్స్పెక్టర్ రమేష్ కోరారు. ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు విపరీతంగా జరుగుతున్నాయని వాటిపట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# పోలీస్ జాగృతి కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం రావాలి



- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

వరంగల్ ఈస్ట్,అక్టోబర్ 22 (జనం సాక్షి) : పోలీస్ జాగృతి కళా బృందం నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకరావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.వరంగల్ పోలీస్ కమీషనరేట్ పోలీస్ జాగృతి కళా బృందం సభ్యులతో వరంగల్ పోలీస్ కమిషనర్ తన కార్యాలయంలో ముచ్చటించారు. ఈ సందర్భంగా జాగృతి కళా బృందం గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఏ ఏ అంశాలపై ప్రజలకు అవగహన కల్పిస్తున్నారు మొదలైన విషయాలను సీపీ కళా బృందం ఇంచార్జి ఏ.ఎస్.ఈ నాగమణి ని అడిగి తెలుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్ సేఫ్టీ, మూడ నమ్మకాలు,షీ టీం, డయల్ 100, మత్తు పదార్థాలపై అవగహన కల్పించే రీతిలో గ్రామీణ ప్రజలకు అర్థమయ్యే రీతిలో కథాంశాలతో ప్రదర్శనలు ఇవ్వాలని. అదే విధంగా కేవలం కథాంశాలే కాకుండా గత మూడు సంత్సరాలు గా సంబంధించి పూర్తి వివరాలను ప్రజలకు వివరించడంతో పాటు జరిగిన నష్టలపై ప్రజలకు వివరించాలని, ముఖ్యంగా కార్యక్రమాల నిర్వహణ కోసం కళా బృందం సభ్యులు ఒక నెల ముందుగానే చక్కటి ప్రణాళిక ను రూపొందించుకోవడంతో పాటు, సంబంధిత అధికారుల నుండి పూర్తి సమాచాన్ని సేకరించుకోవాలని బృందం సభ్యులకు తెలపడంతో పాటు, కళా బృందం కార్యాచరణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిందిగా ఏసీపీ ఎస్. బి 2 జాన్ నర్సింహులుకు సీపీ సూచించారు. సీపీతో ముచ్చటించిన వారిలో హెడ్ కానిస్టేబుళ్ళు విలియమ్, రత్నయ్య, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ పూల్ సింగ్ తో పాటు హెూంగార్డ్స్ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
23 అక్టోబర్ 2025

# ఐకమత్యంతోనే హక్కులను సాధించుకోవచ్చు



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** రాజకీయాలకతీతంగా దళితులు ఐక్యమత్యంతో ఉంటేనే హక్కులు సాధించుకోవచ్చని కుత్బుల్లాపూర్ సిపిఐ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ నల్లమల గిరిప్రసాద్ భవన్ వద్ద దళిత హక్కుల పోరాట సమితి డి.హెచ్.పి.ఎస్19 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డి.హెచ్.పి.ఎస్ మండల అధ్యక్షులు కత్తుల దుర్గయ్య ఆధ్వర్యంలో పాల్గొన్న పలువురు మేధావులు,వక్తలు,అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు దళిత హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ దళిత హక్కుల పోరాట సమితి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో 2006 అక్టోబర్ 22 న సామాజిక న్యాయం,దళితుల బహుజనుల ఐక్యత,రాజ్యాంగ హక్కుల సాధన,కుల నిర్మూలన అనే లక్ష్యాలు పూర్తి చేయడానికి ఏర్పడిందన్నారు.తరతరాలుగా ఈ సమాజ అభివృద్ధికి తమ శ్రమను దారపోస్తున్న దళితులు నేటికీ అమానుషం, అంటరానితనం, కుల వివక్ష, అణిచివేత, దోపిడి, దాడులు,హత్యలు, హత్యాచారాలు, సాంఘిక బహిష్కరణకు గురవుతున్నారు. భూమి, నీరు,గాలి,వెలుగు,సమస్త ప్రజలకు సమాన హక్కుగా దక్కాల్సి ఉంది కానీ నేటికి దళితులు వీటికి ఆమడ దూరంలో ఉంటూ కడు పేదరికాన్ని అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు.వీరికి విద్య,వైద్యం,ఉపాధి అందని ద్రాక్షలా మారాయన్నారు.ప్రైవేటీకరణ విధానాల వల్ల ఉన్న కొద్దిపాటి రిజర్వేషన్ సౌకర్యాలు హక్కులు హరించబడుతున్నాయన్నారు. దళితులు సంఘటితం కావడం ద్వారా ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని వారు పిలుపునిచ్చారు.అనేక సందర్భాల్లో దళిత బహుజనులు ఏకమై సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేసిందన్నారు.ఇదే క్రమంలో దళితులు,అభ్యుదయవాద శక్తులను ఏకం చేసి ఉద్యమాలను నిర్వహించిందన్నారు.కుల నిర్మూలన జరగాలని భావించే ప్రతి ఒక్కరిని డి.హెచ్.పి.ఎస్ ఆహ్వానిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొమురంభీం జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.భీమ్ ఆశయాలను పుణికిపుచ్చుకొని నేటి యువత పోరాటం దిశగా పయనించాలని నాడు భీమ్ చేసిన జల్,జమీన్,జంగల్ నినాదాన్ని గుర్తు చేస్తూ ఉచితాలు కాదు మాకు విద్య వైద్యం ఉపాధి కల్పన జరగాలని ఆ దిశగా యువత ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు దొరవి బాబు,బి.సి హక్కుల సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షులు ఆకుబత్తిని ప్రవీణ్,డి.హెచ్.పి.ఎస్ రాష్ట్ర నాయకులు దుదిగే రాములు,డి.హెచ్.పి.ఎస్ కుత్బుల్లాపూర్ మండలం కార్యదర్శి కొమ్ము వెంకటేష్,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి డప్పు రామస్వామి,ఎంజేఫ్ నాయకులు తొండ వెంకట్, నరసింహ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వి.హరినాథ్ రావు, నాయకులు సహదేవ్ రెడ్డి, శ్రీనివాస్ చారి,చాకలి నర్సయ్య,ఎన్ నారాయణ గౌడ్,మల్లారెడ్డి,శంకర్,తదితరులు పాల్గొన్నారు.

# అలంకారప్రాయంగా వైకుంఠధామం..!

- మందు బాబులకు అడ్డాగా.. పిచ్చిమొక్కలతో దర్శనం..
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు




**పి.ఏ.పల్లి, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** పి.ఏ.పల్లి మండల కేంద్రంలో లక్షలు పెట్టి కట్టించిన వైకుంఠధామం అలంకారప్రాయంగా పిచ్చి మొక్కలతో దర్శనమిస్తుంది.సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల వైకుంఠధామం మందుబాబులకు అడ్డాగా మారింది. స్నానాల గది,విశ్రాంత గదుల యందు ఉన్న తలుపులు పూర్తిగా దొంగిలించబడ్డాయి.కరెంటు స్విచ్లు,నల్లాలు,వాటర్ ట్యాంకు దొంగిలించబడ్డ కూడా అధికారులలో చలనం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వైకుంఠధామం గేటుకు తాళం వేయకపోవడం వల్ల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించి వైకుంఠధామంను వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి నూతనంగా నియామకమైన వైద్యాధికారులకు సూచించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా నియామకమైన వైద్యాధికారులు డాక్టర్ ఎస్.సాయి కృష్ణ,డాక్టర్ ఎన్.అమూల్య, డాక్టర్ బి.ప్రణీత్ నాయక్,డాక్టర్ ప్రతిమకు నియామక పత్రాలను కలెక్టరేట్‌లో బుధవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ కె.నరసింహ, డీఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గుంతలమయమైన రోడ్డుపై సెల్ఫీలతో నిరసన

- రహదారుల తీరుపై మాజీ ఎమ్మెల్యే మెచ్చా అగ్రహం
- ఇసుక, మట్టి దందాలపై పెట్టిన శ్రద్ధ రోడ్లపై పెట్టాలి
- ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకునే నాదుడే లేడు
- ప్రాణాలు పోయే దాకా పట్టించుకోరా..?
- మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



**అశ్వారావుపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ములకలపల్లి మండలంలో కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో అంకంపాలెం దాటిన తరువాత అడవి నుంచి అడుగడుగున రోడ్డు గుంతలతో దర్శనం ఇవ్వడంతో గంగారం వద్ద కారు దిగి పరిశీలించి స్థానికంగా ఉన్న వారితో మాట్లాడగా నిన్న రాత్రి కూడా ఈ గుంతల కారణంగా ప్రమాదం జరిగిందని ఎవరికి చెప్పిన పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగ కాంతారావు ఇచ్చిన పిలుపు మేరకు అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గుంతలతో సెల్ఫీ దిగి కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక మట్టి దందాలపై పెట్టిన శ్రద్ధ రోడ్లపై పెట్టాలని. 22నెలలు అవుతున్నా తట్టెడు మట్టి పోసిన పాపాన పోలేదని కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి లేదని ప్రమాదాలు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రాణాలు పోయేదాకా చూస్తూ ఉంటారా అని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పోసిన రోడ్లు తప్ప కొత్తగా ఈ 22 నెలల్లో కాంగ్రెస్ చేసింది ఏమి లేదని బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరై మొదలైన పనులను సైతం గాలికి వదిలేశారని ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు మళ్ళీ గెలవడం కష్టమనే విషయం తెలిసి గెలిపించిన ప్రజలు ఏమైపోతే మాకెందుకు మా కడుపులు నిండాలని అందరూ దోచుకునే పనిలో నిమగ్నమైపోయారని వెంటనే అంకంపాలెం అడవి నుంచి ములకలపల్లి వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని లేకపోతే రోడ్డు పై ధర్నాకు సిద్ధం అవుతామని కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరించారు.

# మహా ధర్నా విజయవంతం చేయాలి

- హలో బీసీ, ఎస్సి, ఎస్టి చలో ఇందిరా పార్క్..!
- బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర నాయకులు మహేశ్వర చారి పిలుపు



**పి.ఏ.పల్లి, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ మరియు బీసీ 42% రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర నాయకులు బోగోజు మహేశ్వర చారి పి.ఏ.పల్లి మండలంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్టోబర్ 24 న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన బీసీలకు 42% రిజర్వేషన్ ని భారత రాజ్యాంగం తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని మహా ధర్నా చేయడం జరుగుతుంది అని, అంతేకాకుండా విద్యా,ఉద్యోగ,స్థానిక సంస్థలలో 42% బీసీ రిజర్వేషన్లు తక్షణమే కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం దీనికై కేంద్ర ప్రభుత్వంపై బలమైన ఒత్తిడి తీసుకురావాలి.అంతే కాకుండా అత్యంత వెనుకబడిన బీసీ కులాలకు స్థానిక సంస్థల్లో ఉప వర్గీకరణ చేసి రిజర్వేషన్లు కల్పించాలని,ఇ.డబ్ల్యూ.ఎస్ రిజర్వేషన్ల వలన బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది అని కావున వాటిని రద్దు చేయాలి లేదా బీసీ ఎస్సీ ఎస్టీలలోని నిరుపేద వర్గాలకు ఇందులో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి,మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు సంబంధించిన బడ్జెట్ ను తక్షణమే విడుదల చేసి,సబ్ ప్లాన్ అమలు మరియు రెండు లక్షల ఉద్యోగాల భర్తిని వెంటనే ప్రారంభించాలని అన్నారు. ప్రవేశ పరీక్షలకు సంబంధించి జి.ఒ 29 రద్దుచేసి,పాత జీవో 55 పునరుద్ధరించాలి. బీసీలకు ఎస్సీ,ఎస్టీల వలె రక్షణ చట్టాలు కల్పించాలని, జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు 56% రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.మేమేంతో మాకు అంత వాటా అమలుపరచి,రాజ్యాంగ సవరణ చేసి న్యాయస్థానాలు సృష్టించిన 50 శాతం సీలింగ్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగాల ప్రమోషన్లలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి.హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలలో ఎస్టీలకు రిజర్వేషన్లను కల్పించాలి.నామినేటెడ్ కార్పొరేషన్ పదవులలో సామాజిక న్యాయం పాటించి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం నియమించాలన్నారు. పై డిమాండ్స్‌ను నెరవేర్చుటకై ఈనెల 24న ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాలో పి.ఏ.పల్లి మండలంలోని బీసీ,ఎస్సీ,ఎస్టీ ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# సొంత నిధులతో మరమ్మతులు

- పాఠశాలకు రంగులు
- మాస్టారు రాకతో మారిన సర్కారు బడి రూపురేఖలు..



**చింతపల్లి, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాల అంటే అరకొర వసతులు.. అపరిశుభ్ర వాతావరణం.. కనీస మౌలికవసతులు కరువు.శిథిలావస్థకు చేరిన భవనాలు అనే భావన చాలా మందిలో ఉంటుంది. కానీ, అందుకు భిన్నంగా దర్శనమిస్తుంది. నల్గొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆహ్లాదకరమైన వాతావరణం, రంగులతో మెరిసిపోయే భవనం.. విద్యార్థులకు సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఆ పాఠశాలలో 52 మంది అమ్మాయిలు 50 మంది అబ్బాయిలు చదువుతున్నారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని ఎదురుచూడలేదు. పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయులు సొంత నిధులతో స్కూల్ భవనానికి రంగులు వేయించారు. తరగతి గదిలోపల గోడలపై వాల్ రైటింగ్ వేయించారు.పాఠశాల ప్రాంగణంలో చెట్లను నాటారు.ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణారెడ్డి ఏ ప్రభుత్వ పాఠశాలకు లేని విధంగా రంగులు వేయించారు. ఏది ఏమైనా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు చేసిన పనికి ప్రతీ ఒక్కరు అభినందనలు తెలియజేస్తున్నారు.

### ప్రైవేట్‌కు ధీటుగా.....

కొందరు ప్రైవేట్ పాఠశాలల్లోనే మంచి చదువని భ్రమపడుతుంటారు. కానీ, ప్రభుత్వం నుండి వచ్చే నిధులే కాకుండా తన సొంత నిధులతో పాఠశాలను అభివృద్ధి చేశారు. ప్రత్యేక చొరవతో విద్యార్థుల కు ఉత్తమ విద్యనందించేలా చేస్తున్నారు. మా పాఠశాలను ప్రైవేట్‌కు దీటుగా తయారు చేశాము అని చెప్పుకొచ్చారు.

# అత్తాపూర్ లో తోపుడు బండ్లపై ప్రత్యేక డ్రైవ్



**రాజేంద్రనగర్, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్స్పెక్టర్ సిహెచ్. రాజు ల ఆధ్వర్యంలో అత్తాపూర్ సర్వీస్ రోడ్‌పై తోపుడు బండ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రహదారిని ఆక్రమించిన బండ్లకు చలాన్లు విధించి, వాటిని డీటెన్ చేశారు. మోటార్ వెహికిల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఇకపై రోడ్డు ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటామని అధికారులు హెచ్చరించారు.

# మేడ్చల్ జిల్లాలో భారీగా తహశీల్దార్ల బదిలీలు

**ఘట్కేసర్, అక్టోబర్, 22 (జనం సాక్షి) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో భారీ మొత్తంలో తహసీల్దార్లు బదిలీలు అయ్యారు. జిల్లాలోని కూకట్పల్లి మల్కాజ్గిరి ఆల్వాల్ మేడ్చల్ తహసీల్దార్‌లకు తప్ప మిగతా అన్ని మండలాల తహశీల్దార్లుకు స్థానచలనం కలిగింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో ఇంత పెద్ద మొత్తంలో బదిలీ చేయడం, ఇదే తొలిసారి అని చెప్పవచ్చు. దీనికి ముఖ్య కారణం చాలా మంది తహశీల్దార్లు చాలాకాలంగా బదిలీలను కోరుతూ.. వచ్చారు. గతంలో ఉన్న కలెక్టర్లు ఎవ్వరూ కూడా ఇంతటి సాహసం చేయలేదు. ప్రస్తుత కలెక్టర్ మనో చౌదరి నిర్ణయంతో స్థానచలనం కోరుకుంటున్న తహశీల్దార్లకు ఉపశమనం కలిగింది. వీరందరిని డిప్యూటేషన్ ప్రాతిపదికన బదిలీ చేశారు. షామీర్పేట్ ఉప తహసిల్దార్ పీ. సంయుక్తకు ఎఫ్ఎసి కింద తహశీల్దార్ అప్పగించారు.

# అందని ద్రాక్షలా యూరియా..

- దిక్కుతోచని స్థితిలో రైతులు
- బ్లాకులో 500 నుండి 600



**పాలేరు, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** యూరియా సరఫరా లేక దాదాపు ఇరవై రోజులు అయింది రైతులకు యూరియా అందని ద్రాక్ష లాగా ఉంది. వరి పొలాలకు ఆఖరి దఫాగా యూరియా, పొటాష్ వేద్దామని రైతులు ఎదురు చూస్తున్నారు. పొట్టదశలో వేస్తే ఒకేసారి ఇంతది అని రైతులు ఆశపడి ఉన్నారు కానీ పట్టదారు పాసు పుస్తకానికి ఒక బస్తా. వచ్చేది ఇరవై రోజులుగా జాడ లేదు. బయట అవసరాలకు రూ. 500 నుండి 600రూ ఒక బస్తా కొనుగోలు చేసి పంటలకు వేస్తున్న పరిస్థితి అధిక వర్షాలకు పంటలు ఎర్రబారుతున్నాయి. యూరియా పంపిణీ లేక దిక్కుతోచని స్థితిలో రైతులు ఆందోళనకు గురి అవుతున్నారు. ఇప్పటికి అయినా ప్రభుత్వం యూరియా సరఫరా చేసే ఆలోచన చేయాలని ఏదో నాలుగు రోజులు హడావుడి చేసి చేతులు దులుపుకున్నారు. కానీ రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడం లేదని రైతులు వాపోతున్నారు.


# ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

- అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- సీసీటీవీ కెమరాలే కేసు ఛేదనలో కీలకం
- జిల్లా ఎస్పి యం. రాజేష్ చంద్ర




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** గాంధారి శివారు చద్మల్ రోడ్డులో తూర్పు రాజు, ఆకుల లక్ష్మణుల వ్యవసాయ భూమి రోడ్డు పక్కన ఎండిపోయిన చిన్న కాలువలో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి శవం లభించిందని జిల్లా ఎస్పి యం. రాజేష్ చంద్ర తెలిపారు. ఎస్పి తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని మగ వ్యక్తిని ఎవరో చంపి శవాన్ని అక్కడికి తీసుకువచ్చి చిన్న కాలువలో పడేసి దహనం చేశారని ఫిర్యాదు చేశారు. గాంధారి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో కామారెడ్డి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు యెల్లారెడ్డి డిఎస్‌పి పర్యవేక్షణలో సదాశివ నగర్ సిఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేశారు. పోలీసుల విచారణలో అనేక అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి. తుది విచారణలో తేలింది ఏమనగా, ఇరగడింట్ల నవనీతకు తన మేనత్త కొడుకు అయిన నరేష్ భవాని నగర్ కాలనీ, కీసర మండల్, మెద్చల్‌తో 2012 సం.లో వివాహం జరిగింది. ఈమె భర్తతో కలిసి కూలి పనులు చేస్తారు. అక్కడ ఆంజనేయులు నవనీతకు పరిచయం ఏర్పడగా తరువాత ఇద్దరు ఫోన్‌లో మాట్లాడుకునే వారు. ఇలా పరిచయం కాస్త శారీరక సంబంధం వద్దకు వెళ్ళింది. నవనీత భర్తకు ఈ విషయములో అనుమానం వచ్చి అప్పటినుండి నవనీతను వేధించేవాడు. సుమారు ఒక సంవత్సరం క్రితం ముగ్గురు కలిసి రెండు బైక్‌లపై పెద్ద గుట్టకు వెళ్లి వచ్చారు. అక్కడ ఇద్దరు క్లోస్‌గా సంబంధం కొనసాగిస్తున్నారు అని భర్త నరేష్‌కు అనుమానం బలపడి ప్రతీ రోజు ఎక్కువగా టార్చర్ చేశాడు. అందువలన నరేష్‌ను హత్య చేస్తే ఇద్దరి మధ్య అడ్డు తొలిగిపోతుందని నవనీత, ఆంజనేయులు ఇద్దరు ఫోన్లో మాట్లాడుకున్నారు. వారి పథకం ప్రకారం తేదీ 15.10. 2025 నాడు ఆంజనేయులు నవనీతతో ఫోన్‌లో ఈరోజు నీ భర్తను చంపేస్తాను అని చెప్పి నరేష్‌ను రాంపల్లి చౌరస్తా వద్దకు రమ్మని కాల్ చేయించి పిలిచి పెద్దగుట్ట వరకు వెళ్ళి వద్దాము అని చెప్పి అక్కడ అయితే ఎవరూ గుర్తుపట్టరని ఉద్దేశంతో పెద్దగుట్టకు వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి వస్తూ గాంధారిలోని వైన్స్‌లో మందు తోసుకొని పెద్దగుట్ట నుండి చద్మల్ రోడ్డు పక్కన చిన్న కాలవ వద్ద మద్యం త్రాగించి మత్తులో ఉన్న నరేష్‌ను కిందికి నూకగా తలకు గాయమై స్పృహ కోల్పోయాడు. వెంటనే ఆంజనేయులు రెండు-మూడు సార్లు చేతులతో, కాలుతో అతని చాతిపై దాడి చేసి హత్య చేశారు. శవాన్ని ఎవరు గుర్తుపట్టకుండా, గాంధారిలో దగ్గరలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో వంద రూపాయల పెట్రోల్ కొనుగోలు చేసి పెట్రోలు పోసి నిప్పు పెట్టి, తర్వాత పాన్ షాప్‌లో జరుద తీసుకొని మళ్ళీ హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో 300 రూపాయల పెట్రోల్ బైక్ లో పోసుకొని తిరుగు ప్రయాణం చేశారు. ఈ మధ్యనే స్తానికుల సహాయంతో గాంధారి లో మొత్తం 42 కెమరాలు ఏర్పాటు చేయగా ఇట్టి కేసు విచారణలో సీసీటీవీ ఫూటేజ్‌లు ఇతర సాంకేతిక పరిజ్ఞానం, స్తానికుల సమాచారం నిందితులను గుర్తించడములో ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుండి ఫ్యాషన్ ప్రో బండి, సెల్ ఫోను, సెల్‌ఫోను స్వాధీనపర్చుకున్నారు. నేరస్తుల ఎలాంటి ఆధారాలు లేకున్నా, మృతుడు ఎవరు అని తెలియని పరిస్తితి నుండి హత్య జరిగిన వారం రోజుల లోపే మర్డర్ చేసిన నిందితులను గుర్తించి కేసును చేదించిన సదాశివనగర్ సీ.ఐ బి. సంతోష్ కుమార్, గాంధారి ఎస్సై ఆంజనేయులు, కానిస్టేబుల్‌లు సంజయ్ కుమార్, రవికుమార్, సాయిబాబా, ప్రసాదు బంతిలాలు హెూం గార్డ్లు లను జిల్లా ఎస్పీ. యం. రాజేష్ చంద్ర అభినందించారు.




# శాంసంగ్ గెలాక్సీ ఎక్స్ఆర్ హెడ్‌సెట్ విడుదల

**న్యూఢిల్లీ:**శామ్ సంగ్ తాజాగా 'వరల్డ్ వైడ్ ఓపెన్' ఈవెంట్‌లో తన కొత్త ఎక్స్ఆర్ వ్యూహాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా, గెలాక్సీ ఎక్స్ఆర్ హెడ్‌సెట్‌తో పాటు, వైర్డ్, వైర్‌లెస్ ఎక్స్ఆర్ గ్లాసెస్, ఏఐ గ్లాసెస్ అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించింది.గూగుల్‌తో భాగస్వామ్యంలో రూపొందిస్తున్న ఆండ్రాయిడ్ ఎక్స్ఆర్ ప్లాట్‌ఫామ్‌ను ఈ పరికరాలు ఉపయోగించనున్నాయి. డిస్‌ప్లే ఉన్న హెడ్‌సెట్‌ల నుండి డిస్‌ప్లే రహిత ఏఐ గ్లాసెస్ వరకు ఎక్స్ఆర్ పరికరాల పూర్తి సిరీస్‌ను ఈ ఈవెంట్‌లో శాంసంగ్ వివరించింది. శాంసంగ్, జెంటిల్ మాన్‌స్టర్, వార్బీ పార్కర్ వంటి బ్రాండ్లతో కలిసి గ్లాసెస్ డిజైన్‌లో పనిచేస్తోంది.ఏఐ గ్లాసెస్ ప్రత్యేకంగా ఓక్లే మెటా గ్లాసెస్‌కు ప్రత్యర్థిగా ఉండనున్నాయి. వీటిలో డిస్‌ప్లే ఉండదు కానీ, గూగుల్ జెమినీ ఏఐ సాయంతో మెసేజింగ్, నావిగేషన్, అనువాదం వంటి స్మార్ట్ ఫీచర్లను అందిస్తాయి. గూగుల్ ఇప్పటికే ఈ తరహా గ్లాసెస్‌ను డెమోలో ప్రదర్శించింది. శాంసంగ్ ఎక్స్ గ్లాసెస్ క్వాల్కమ్ చిప్‌సెట్‌ను ఉపయోగించి ఆండ్రాయిడ్ ఎక్స్ఆర్ ప్లాట్‌ఫారమ్‌పై నడుస్తాయి. శాంసంగ్ ఎక్స్ గ్లాసెస్ క్వాల్కమ్ చిప్‌సెట్‌ను ఉపయోగించి ఆండ్రాయిడ్ ఎక్స్ఆర్ ప్లాట్‌ఫామ్‌పై నడుస్తాయి. ఇందులో ఇంటిగ్రేటెడ్ లెన్స్ డిస్‌ప్లే, ఆడియో స్పీకర్లు, కెమెరాలు, చేతి సంజ్ఞల ఆధారంగా నియంత్రణలు ఉంటాయని అంచనా. శామ్ సంగ్ గెలాక్సీ ఎక్స్ఆర్ హెడ్‌సెట్ యాపిల్ విజన్ ప్రోకి రాబోయే ఎక్స్ఆర్ గ్లాసెస్ మెటా రేబాన్ గ్లాసెస్‌కి పోటీగా నిలవనున్నాయి. ఏఐ గ్లాసెస్ 2025లో విస్తృత వినియోగానికి సిద్ధమయ్యే అవకాశం ఉంది.

# భూముల వేలం.. కాసుల వర్షం..

- మరో వేలానికి సన్నద్ధం
- రాయదుర్గ్ నాలెడ్జ్ సిటీలో ఎకరా గుర్తింపు
- రూ.200 కోట్లు పలకవచ్చని అంచనా



రాష్ట్ర రాజధానిలోని రాయదుర్గ్‌లో భూ ముల వేలం కాసుల వర్షం కురిపిస్తుండటంతో మరిన్ని భూముల వేలానికి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.ఈ నెల మొదటి వారంలో రెండు ల్యాండ్ పార్సిళ్లకు నిర్వహించిన వేలంలో ఎకరా ధర గరిష్టంగా రూ.177 కోట్లు పలికిన విషయం తెలిసిందే. సుమారు 19 ఎకరాలకు నిర్వహించిన ఈ వేలం ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.3,135 కోట్లు సమకూరాయి.ఈ నేపథ్యంలో రాయదుర్గ్‌లోని హైదరాబాద్ నాలెడ్జ్ సిటీ లే ఔట్‌లో వచ్చే నెల 10న సుమారు ఎకరా భూమిని వేలం వేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) ఈ నెల 16న నోటిఫికేషన్ జారీ చేసింది. వేలం ప్రక్రియ, ఇతర అంశాలపై ఔత్సాహిక కొనుగోలుదారులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 22న రాయదుర్గ్‌లోని టీ హబ్‌లో ప్రీబిడ్ సమావేశాన్ని కూడా నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రేషన్, ఈఎండీ చెల్లించేందుకు నవంబర్ 4ను గడువుగా నిర్దేశించారు.రాయదుర్గ్ పాన్‌మక్తాలోని సర్వే నంబరు 83/1లోని 14ఏ/1, 14బీ/1 ప్లాట్లను టీజీఐఐసీ వేలం వేస్తోంది. ఈ రెండు ప్లాట్ల విస్తీర్ణం కలుపుకుని 4,718.22 చదరపు గజాలు (సుమారు ఎకరా విస్తీర్ణం) కాగా, ఒక్కో చదరపు గజం అప్‌సెట్ ధరను (వేలం ప్రారంభ ధర)ను రూ.3.10 లక్షలుగా, ఎకరా ధరను సుమారు రూ.146 కోట్లుగా నిర్ణయించింది. వేలం పాటలో ఎకరా ధర రూ.200 కోట్ల మార్క్‌ను అధిగమించే అవకాశముందని టీజీఐఐసీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవలి వేలంలో 17 మంది బిడ్డర్లు పోటీ పడిన నేపథ్యంలో తాజా వేలానికి కూడా భారీగా పోటీ ఉంటుందని భావిస్తున్నారు. రాయదుర్గ్‌లో టీజీఐఐసీ అదీనంలో 470 ఎకరాలు ఉండగా, గడిచిన దశాబ్ద కాలంలో 200 ఎకరాలకుపైగా విక్రయించారు. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలో మరో పది ఎకరాల మేర వేలానికి సిద్ధంగా ఉండగా, 50 ఎకరాలపై కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. దీంతో కోర్టు వివాదాలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా టీజీఐఐసీ న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతోంది.

# 'నో' చెప్పడం ఎలాగో!?

జనంసాక్షి:జీవితం ఒకేసారి నాలుగు బంగారు అవకాశాలను ఇచ్చి అందులో కొన్నింటినే ఎంచుకోవాలనే పరిస్థితి తలెత్తితే ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో ఊహించండి. సరిగ్గా ఇలాంటి విచిత్రమైన పరిస్థితే 20 ఏళ్ల టెక్కీకి ఎదురైంది.ఉద్యోగ వేటలో ఉన్న తనకు ముందుగా రెండు ఉద్యోగ ఆఫర్లు వచ్చాయి. ఆ రెండూ ఎంఎన్‌సీ సంస్థలు కావడంతో వాటికి అంగీకారం తెలిపి సంతకాలు చేశాడు. ఉన్నట్టుండి మరో రెండు కంపెనీల ఆఫర్లు వచ్చాయి. ఈసారి ఆఫర్ చేసినవి మునుపటి కంపెనీల కంటే టాప్ సంస్థలు. దాంతో ఇప్పటికే సంతకం చేసిన కంపెనీలకు 'నో' చెప్పడం ఎలాగో తెలియక తన పరిస్థి




తిని వివరిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అదికాస్తా వైరల్‌గా మారింది.ఈ టెక్కీ పోస్ట్ ఆన్‌లైన్‌లో చర్చకు దారితీసింది. తన పరిస్థితి గమనించిన నెటిజన్లు సలహాలు ఇస్తున్నారు. చాలా మంది నెటిజన్లు ఆచరణాత్మకంగా ఆలోచించమని చెబుతున్నారు. 'ఉద్యోగుల తొలగింపుల సమయంలో కంపెనీలు పెద్దగా పట్టించుకోవు. కాబట్టి మీరు కంపెనీ ఆఫర్‌ను తిరస్కరించడం పెద్ద విషయం కాదు' అని ఒకరు సూచించారు. మర్యాదపూర్వకంగా ఒక ఈమెయిల్ పంపాలని కొందరు సలహా ఇచ్చారు. చివరి నిమిషంలో కంపెనీలు ఆఫర్ లెటర్లు ఉపసంహరించుకునే అవకాశం ఉన్నందున ఆ యువకుడు చేరాలనుకుంటున్న సంస్థ గురించి కచ్చితంగా తెలిసే వరకు ఏ నిర్ణయం తీసుకోరాదని కొందరు తెలిపారు.

# రూ.1కే సిమ్‌కార్డ్

## అన్‌లిమిటెడ్ కాల్స్, ఇంకా మరెన్నో!



దీపావళి పండుగ సందర్భంగా వినియోగదారులకు ఈ నెల 18 నుంచి నవంబరు 18వ తేదీ వరకు వివిధ ఆఫర్లను బీఎస్ఎన్ఎల్ ప్రకటించినట్లు జీఎంసి.అమరేంద్రనాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు రూపాయికే సిమ్‌కార్డుతో పాటు 30రోజుల పాటు అపరిమిత ఉచిత వాయిస్ కాల్స్, ప్రతి రోజు 2జీబీ ఇంటర్నెట్, 100ఎస్ఎంఎస్‌లు ఉంటాయని తెలిపారు.ఏదేని కార్పొరేట్ కస్టమర్ కనిష్టంగా పది అంతకుమించి పోస్ట్ పెయిడ్ కనెక్షన్లు తీసుకున్నా, ఒక ఎఫ్‌టీటీహెచ్ కనెక్షన్ తీసుకున్నావారికి మొదటి నెల రీచార్జ్‌పై 10శాతం డిస్కౌంట్ లభిస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 18నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకు బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్‌కేర్ యాప్ ద్వారా మిత్రులకు, కుటుంబ సభ్యులకు రీచార్జ్ చేస్తే, రీచార్జ్ మొత్తంలో 2.5శాతం డిస్కౌంట్ లభిస్తుందని తెలిపారు.దీపావళి సందర్భంగా సీనియర్ సిటిజన్లకు ఈ నెల 18నుంచి నవంబరు 18వ తేదీ వరకు రూ.1,812కే సిమ్‌కార్డుతో పాటు 365 రోజుల పాటు అపరిమిత ఉచిత వాయిస్ కాల్స్, ప్రతి రోజు 2జీబీ డేటా, 100ఎస్ఎంఎస్‌లు, 6నెలల పాటు బైటీవీ సబ్‌స్క్రిప్షన్ అందించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఈ నెల 18నుంచి నవంబరు 18వ తేదీ వరకు రూ.485, రూ.1,999 ప్లాన్లపై బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్‌కేర్ యాప్ ద్వారా రీచార్జ్ చేసిన వారికి 5శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




# భారీగా పెరిగిన మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల జీతం

**న్యూఢిల్లీ:**టాప్ టెక్నాలజీ సంస్థ మైక్రోసాఫ్ట్‌కు సారథ్యం వహిస్తున్న సత్య నాదెళ్ల తన ఘనతను చాటుకున్నారు. ఏఐ నిపరుగులుపెట్టించిన మైక్రోసాఫ్ట్ సీఈవో గా ఆయన జీతం భారీగా పెరిగింది. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సత్యనాదెళ్ల జీతం 22 శాతం ఎ గిసి 96.5 మిలియన్ల డాలర్లకు చేరుకుంది. భారత కరెన్సీ ప్రకారం.. రూ.847.31 కోట్లు. దశాబ్దం క్రితం ఈ పదవిని చేపట్టినప్పటి నుండి సత్యా నాదెళ్ల అందుకుంటున్నఅత్యధిక జీతం. ఏఐ)లో కంపెనీ సాధించిన పురోగతి ఈ పెరుగుదలకు కారణమని బోర్డు చెప్పిందని బ్లూమ్‌బెర్గ్ నివేదించింది.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో సత్తా చాటడంతో ఆయన వేతనం భారీగా పెరిగిందని "ఈ తరాల సాంకేతిక మార్పుకు సత్య నాదెళ్ల చ అతని నాయకత్వ బృందం మైక్రోసాఫ్ట్‌ను స్పష్టమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లీడర్‌గా నిలబెట్టిందని బోర్డు పరిహార కమిటీ మంగళవారం విడుదల చేసిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ,వాటాదారులకు రాసిన నోట్‌లో పేర్కొంది. దీని ప్రకారం సత్య నాదెళ్ల బేసిక్ సాలరీ 2.5 మిలియన్ డాలర్లు. మిగిలిన కంపెనీ షేర్ల రూపంలో అందుకోనున్నారు. నాదెళ్ల జీతంలో దాదాపు 90 శాతం మైక్రోసాఫ్ట్ షేర్ల రూపంలో ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో ఆయన 79.1 మిలియన్ డాలర్ల వేతనం అందుకున్న సంగతి తెలిసిందే. 1967 ఆగస్టు 19న హైదరాబాద్‌లో జన్మించారు సత్య నాదెళ్ల. తండ్రి బుక్కాపురం నాదెళ్ల యుగంధర్ 1962 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. తల్లి ప్రభావతి లెక్చరర్. హైదరాబాద్‌లో పాఠశాల విద్య అనంతరం, కర్ణాటకలోని మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి 1988లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీఈ పట్టా పొందారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్-మిల్వాకీ నుంచి 1990లో ఎంఎస్ పూర్తి చేశారు.1992లో మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగంలో చేరిన అంచెలంచెలుగా ఎదిగి వివిధ హోదాల్లో సత్తాచాటుకున్నారు.



## రూ. 2 లక్షలు దాటితే జరిమానే..

### క్యాష్ డీలింగ్స్‌తో జాగ్రత్త!

**న్యూఢిల్లీ:**డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ బ్యాం కింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్న ఈ కాలంలో ఆదాయపు పన్ను శాఖ పెద్ద మొత్తంలో జరిగే నగదు లావాదేవీల విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. నిబంధనల ప్రకారం ఒక రోజులో ఎంతమేరకు నగదు లావాదేవీలు జరపాలో చట్టపరమైన పరిమితి గురించి అవగాహన ఉండకపోవచ్చు. వ్యక్తిగత అవసరాల కోసం లేదా వ్యాపార ప్రయోజనాల కోసం నగదును స్వీకరిస్తే ఎలాంటి నియమాలున్నాయో తెలుసుకుందాం. నిర్దిష్ట పరిమితికి మించి నగదు లావాదేవీలు నిర్వహిస్తే భారీ జరిమానాలు, చివరికి ఆదాయపు పన్ను నోటీసు కూడా రావచ్చని గుర్తుంచుకోవాలి.ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 269ఎస్టీ ప్రకారం ఏ వ్యక్తి కూడా ఒకే రోజులో రూ.2 లక్షల కంటే ఎక్కువ నగదును స్వీకరించడానికి అనుమతుల్లేవు. ఈ పరిమితులు సదరు నగదు లావాదేవీ వ్యక్తిగతమా లేక వ్యాపారమా అనే దానిపై ఆధారపడవు. అంటే అందరికీ వర్తిస్తుంది .ఉదాహరణకు: ఒక వ్యక్తి తన కారును అమ్మి కొనుగోలుదారు నుంచి రూ.2.5 లక్షల నగదు అందుకుంటే అది ఆదాయపు పన్ను చట్టానికి విరుద్ధం అవుతుంది.

# చైనాకు చెక్

- అమెరికా, ఆస్ట్రేలియా భారీ డీల్
- అరుదైన మూలకాల తవ్వకం కోసం ఒప్పందం ఖరారు



**వాషింగ్టన్(జనంసాక్షి):**స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు మొదలు రక్షణ, అంతరిక్ష రంగంలో కీలక ఉపకరణాల దాకా అన్నింటి తయారీకి అత్యావశ్యకమైన ఖనిజాల సరఫరాపై చైనా గుత్తాధిపత్యానికి గండి కొట్టేందుకు అమెరికా, ఆస్ట్రేలియా చేతులు కలిపాయి.విదేశాలకు తమ అరుదైన ఖనిజాలను ఎగుమతి చేయాలంటే కఠిన నిబంధనలు తప్పకుండా పాటించాల్సిందేనని చైనా మొండికేయడం తెల్సిందే.దీంతో చైనాకు చెక్ పెట్టడమే లక్ష్యంగా అమెరికా, ఆస్ట్రేలియా రూ.75,000 కోట్ల విలువైన చరిత్రాత్మకమైన 'అరుదైన ఖనిజాల ఒప్పందం'కుదుర్చుకున్నాయి. అధ్యక్షభవనంలో డొనాల్డ్ ట్రంప్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ ఈ కీలక ఒప్పందంపై సంతకాలు చేశారు. తర్వాత మీడియాతో ట్రంప్ మాట్లాడారు."గత కొన్ని నెలలుగా చర్చలు జరిపి ఎట్టకేలకు నేడు ఒప్పందం కుదుర్చుకున్నాం. మరో ఏడాదిలోగా మా రెండు దేశా లు భారీ ఎత్తున అరుదైన ఖనిజ నిల్వలను సాధించనున్నాయి. ఈ నిల్వలతో మేమేం చేస్తామో మీకు కూడా తెలీదు"అని వ్యాఖ్యానించారు.తొలి ఆరు నెలల్లో ఇరు దేశాలు చెరో 3 బిలియన్ డాలర్ల మేర ఖనిజాల తవ్వకాల ప్రాజెక్ట్‌ల్లో పెట్టుబడులు పెడతాయి. ఉపగ్రహాలు, ఎంఆర్ఐ యంత్రాలు, గైడెన్స్ వ్యవస్థలు, లేజర్లు, జెట్ ఇంజిన్లదాకా అన్నింటి తయారీలోనూ అరుదైన భూ మూలకాలనే ఉపయోగిస్తారు.

## వైట్‌హౌస్‌ను కూల్చేస్తున్న ట్రంప్



అమెరికాలోని వైట్‌హౌస్‌లో 250 మిలియన్ల (సుమారు రూ.2,000 కోట్లు) భారీ వ్యయంతో కొత్త బాల్‌రూమ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా వైట్‌హౌస్ తూర్పు విభాగం (ఈస్ట్ వింగ్)ను పాక్షికంగా కూల్చివేస్తున్నారు.అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో తన కలల ప్రాజెక్టుగా భావించే ఈ బాల్‌రూమ్ నిర్మాణం కోసమే ఈస్ట్ వింగ్‌లో కొంత భాగాన్ని కూల్చివేస్తున్నట్లు సమాచారం .ప్రస్తుతం వైట్‌హౌస్‌లో అతిపెద్ద హాల్ 'ఈస్ట్ రూమ్'. దీనిలో సుమారు 200 మంది మాత్రమే కూర్చునే సామర్థ్యం ఉంది. స్టేట్ డిన్నర్‌లు, ఇతర పెద్ద ఈవెంట్లకు ఇది సరిపోవడం లేదని ట్రంప్ చాలాకాలంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున అతిథులను, ప్రపంచ నాయకులను వైట్‌హౌస్‌లోనే సౌకర్యవంతంగా ఆహ్వానించడానికి ప్రత్యేకంగా బాల్‌రూమ్ అవసరమని ఆయన తెలిపారు.

**తాత్కాలికంగా టెంట్లలో..:**స్టేట్ డిన్నర్‌లు వంటి అతిపెద్ద కార్యక్రమాలను గత అధ్యక్షులు తరచుగా వైట్‌హౌస్ దక్షిణ ప్రాంగణంలో (సౌత్ లాన్‌లో) తాత్కాలికంగా వేసిన టెంట్లలో నిర్వహించేవారు. దీనిపై ట్రంప్ అయిష్టంగా ఉన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన కొత్త, సువిశాలమైన 90,000 చదరపు అడుగుల (సుమారు 8,300 చ.మీ.) బాల్‌రూమ్ 1000 మంది కూర్చునే సామర్థ్యం కలిగి ఉంటుందని, అవసరమైతే భవిష్యత్తులో అధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవం వంటి కార్యక్రమాలకు కూడా ఇది ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం పన్ను చెల్లింపుదారుల డబ్బును ఉపయోగించడం లేదని దీన్ని ప్రైవేట్ వ్యక్తుల నుంచి సమకూర్చిన ఫండింగ్ ద్వారా పూర్తి చేస్తున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు.

**ఈస్ట్ వింగ్ కూల్చివేత:**ఈ ప్రాజెక్ట్ ప్రతిపాదించిన సమయంలో ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు కొత్త బాల్‌రూమ్ వైట్‌హౌస్‌కు సమీపంలో ఉంటుందని, ఏమీ కూల్చివేతలు ఉండవని తెలిపారు. అయితే నిర్మాణ పనులు ప్రారంభమవగానే ఈస్ట్ వింగ్ ముఖభాగంలో కొంత భాగం కూల్చివేశారు. వైట్‌హౌస్ ఇచ్చిన వివరణ ప్రకారం కొత్త బాల్‌రూమ్ ప్రాజెక్ట్‌లో భాగంగా దేశ ప్రథమ మహిళ కార్యాలయం వంటి ఆఫీసులు ఉండే ఈస్ట్ వింగ్‌ను కూడా ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని తెలిసింది. ఈస్ట్ వింగ్ సంప్రదాయబద్ధంగా ప్రథమ మహిళ కార్యాలయాలకు, సందర్శకుల ప్రవేశానికి కేంద్రంగా ఉండేది. 1942లో ప్రపంచ యుద్ధం సమయంలో దీనికి రెండో అంతస్తు, బంకర్ కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం.

# రోడ్డు ప్రమాదం.. బీతావహం

- మొదట రెండు బస్సులు ఢీకొని ఆపై పలు వాహనాలను బలంగా తాకిన వైనం
- ఘోర దుర్ఘటనలో 63 మంది దుర్మరణం
- అనేక మందికి గాయాలు



**నైరోబి:** ఉగాండాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఒక ప్రధాన రహదారిపై బుధవారం తెల్లవారుజామున రెండు బస్సులు ఢీకొన్నాయి. తరువాత అవి మరో నాలుగు వాహనాలను బలంగా తాకాయి.ఈ దుర్ఘటనలో 63 మంది మరణించారు. ప్రమాదంలో లెక్కలేనంతమంది గాయపడ్డారు.కిర్యాండోంగో జిల్లాలోని కంపాలా-గులు హైవేపై ఈ ఘటన చోటుచేసుకుంది. ముందుగా రెండు బస్సులు ఓవర్‌టేకింగ్ చేస్తూ, ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సమయంలో ఆ బస్సుల డ్రైవర్లు ప్రమాదాన్ని తప్పించేందుకు ప్రయత్నించారు. దీంతో అవి ఒక ట్రక్, ల్యాండ్ క్రూయిజర్‌తో పాటు నాలుగు వాహనాలను నియంత్రణ కోల్పోయేలా చేయడంతో, అవి బోల్తా పడ్డాయని పోలీసులు తెలిపారు. తొలుత మృతుల సంఖ్యను 63గా ప్రకటించిన పోలీసులు ఆ సంఖ్యను 46గా సవరించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో అత్యవసర సేవలు కొనసాగుతున్నాయి. ప్రమాదంలో గాయపడిన వారిని కిర్యాండోంగో ఆస్పత్రితో పాటు సమీపంలోని ఇతర వైద్య కేంద్రాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. అయితే గాయపడిన వారి సంఖ్య, వారి గాయాల తీవ్రత తదితర వివరాలను వారు అందించలేదు. బాధిత కుటుంబాలకు ఉగాండా అధ్యక్షుడు యోవేరి ముసేవేని సంతాపాన్ని ప్రకటించారు. వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు.గత ఏప్రిల్‌లో పశ్చిమ ఉగాండాలో ఒక బస్సు అదుపు తప్పి, హైవేపై బోల్తా పడటంతో 10 మంది మరణించారు. అదేవిధంగా గత ఆగస్టులో ఒక ట్రక్కు బోల్తా పడిన ఘటనలో 20 మంది మరణించారు. గత ఏడాది కంపాలా-గులు హైవేపై ఒక ట్రక్కు బోల్తా పడిన ఘటనలో 26 మంది మృతిచెందారు. రెండేళ్ల క్రితం జనవరిలో కెన్యా-ఉగాండా సరిహద్దులో జరిగిన బస్సు ప్రమాదంలో 21 మంది మృతిచెందగా, 49 మంది గాయపడ్డారు.

## పసికందును మోసుకుంటూ గడ్డ కట్టే చలిలో..

పిల్లల్ని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన తల్లిదండ్రుల్లో కొందరు.. నిర్లక్ష్యంతో, ఏమరుపాటుతో వాళ్ల ప్రాణాలు పోవడానికి కారణమైన ఘటనలెన్నో చూశాం. అయితే ఇక్కడో జంట ప్రమాదం అని తెలిసి కూడా తమ నెలల పసికందుతో సాహసానికి సిద్ధపడింది.పోనీ అందుకు ప్రత్యేకమైన కారణం ఏదైనా ఉందా? అనుకుంటే.. పప్పులో కాలేసినట్లే!..లిథువేనియాకు చెందిన ఓ జంట.. పోలాండ్‌లోని మంచుతో కప్పబడిన మౌంట్ రైసీ పర్వతాన్ని అధిరోహించేందుకు సిద్ధపడింది. అయితే తమ 9 నెలల బిడ్డతో కలిసి ఎలాంటి సురక్షిత పరికరాలు లేకుండానే ముందుకు వెళ్లింది. తల్లిని ముందు భాగంలో క్యారీ చేస్తూ ఆ తల్లి పైకి ఎక్కడం ప్రారంభించింది. ఇది గమనించిన కొందరు అలా చేయొద్దని వారించినా వినలేదు. అయినా వినకుండా ఆ పేరెంట్స్ మొండిగా ముందుకు వెళ్లారు. అయితే..కాస్త దూరం వెళ్లాక ఆ బిడ్డ తండ్రి ప్రమాదాన్ని అంచనా వేశాడు. ఆ సమయంలో క్రాంపాన్(మంచులో జారకుండా షూలకు బిగించే పరికరాలు) కోసం ఓ మౌంట్ గైడ్‌ను సంప్రదించాడు. బిడ్డకు ప్రమాదం అని భావించిన ఆ మౌంట్‌గైడ్.. వాళ్లు సర్దిచెప్పి కిందకు తీసుకొచ్చారు. ఆ బిడ్డ పరిస్థితి ఆరోగ్యంగానే ఉన్నట్లు తెలుస్తోంది. వీడియో వైరల్ కావడంతో.. చిన్నారిని ప్రమాదంలోకి నెట్టినందుకు ప్రయత్నించిన ఆ పేరెంట్స్‌పై సోషల్ మీడియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.మౌంట్ రైసీ అనేది పోలాండ్‌లోని అత్యంత ఎత్తైన పర్వతం. దీని ఎత్తు సుమారు 2,501 మీటర్లు పోలాండ్- స్లోవేకియా సరిహద్దులో ఉన్న హై టాట్రాస్ పర్వత శ్రేణిలో విస్తరించి ఉంది.

# పసిడి ధరలు పతనం

బుధవారం హైదరాబాద్ మార్కెట్‌లో 24 గ్రాముల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,25,250కి పడిపోయింది. 22 క్యారెట్ల ధర రూ.1,14,843గా ఉంది. ఇక వెండి ధర దాదాపు రూ.7వేలు తగ్గింది. నేడు కేజీ వెండి ధర రూ.1,58,000 పలుకుతోంది. వారం రోజుల్లో దాదాపు రూ.28వేలు తగ్గింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4,022 డాలర్లకు పడిపోయింది. ఇటీవల రికార్డు గరిష్ఠాలకు చేరిన బంగారం, వెండి లోహాల్లో మదుపర్లు లాభార్జనకు దిగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్త ఉపశమించడం ఇందుకు కారణమని బులియన్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై అమెరికా ఆసక్తి

మంగళవారం భారత ప్రధాని మోడీతో మాట్లాడానని, ఎక్కువగా వాణిజ్యంపై దృష్టిసారించానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇంధనంపై కూడా చర్చలు జరిపామని ఆయన అన్నారు. రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్లను పరిమితం చేస్తుందని మోడీ తనకు హామీ ఇచ్చారని చెప్పుకొచ్చారు. అయితే ట్రంప్, తాను చర్చలు జరిపామని మోడీ కూడా స్పష్టం చేశారు. చర్చలకు సంబంధించిన వివరాలు వెల్లడించలేదు.

# మహిళలకు ఎర వేస్తున్న జైషే ఉగ్రవాద సంస్థ!

ఉగ్రవాద సంస్థ జైష్-ఏ-మహ్మద్ సంస్థ తన పంథాను మార్చుకుని మహిళలను కూడా ఉగ్రవాద కార్యకలాపాల్లోకి దించేందుకు సిద్ధమైంది. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహమ్మద్ కేవలం మహిళలతో జీహాదీ గ్రూప్‌ను తయారు చేస్తున్నది.దీంతో పాటు వసూళ్లను కూడా ముమ్మరం చేస్తోంది. మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వంలో 'జమాతుల్-ముమినాత్' పేరుతో మహిళా దళాన్ని తయారు చేస్తోంది. ఇందులో భాగంగానే మహిళలకు తుఫత్ అల్-ముమినాత్ అనే ఆన్‌లైన్ శిక్షణా కోర్సును



ప్రారంభించినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి కొన్ని ఆధారాలను ఎన్‌డీటీవీ నివేదించింది.జైష్ అధినేత మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వంలోని 'జమాత్ ఉల్ మోమినాత్' అనే మహిళా బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ కోర్సులో భాగంగా, జైష్ నాయకుల కుటుంబ సభ్యులు, వ్యవస్థాపకుడు మసూద్ అజార్, అతని కమాండర్ల బంధువులు, జిహాద్, ఇస్లాంకు సంబంధించి వారి 'విధుల' గురించి బోధిస్తారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే నియామక డ్రైవ్ వచ్చే నెల నవంబర్ 8 నుండి ప్రారంభం కానుంది. ఈ 'ఉపన్యాసాలు' రోజుకు 40 నిమిషాలు ఉంటాయి. అజార్ ఇద్దరు సోదరీమణులు, సాదియా అజార్, సమైరా అజార్ నాయకత్వం వహిస్తారు. ఇందులో జమాత్ ఉల్-ముమినాత్‌లో చేరేలా మహిళల్ని ప్రోత్సహిస్తాయి. గత నెలలో బహవల్పూర్‌లోని మర్కజ్ ఉస్మాన్ ఓ అలీలో తన చివరి బహిరంగ ప్రసంగం తర్వాత, ఈ వార్త వెలుగులోకి వచ్చింది. ఈ 'కోర్సు'లో చేరే ప్రతి మహిళ నుండి రూ. 156 వసూలు చేసి, వారిని ఆన్‌లైన్ సమాచార ఫారం నింపమని బలవంతం చేస్తోందట. దీంతోపాటు అజార్ తన 'విరాళాల' కార్యక్రమాన్ని ముమ్మరం చేస్తున్నట్టు తెలుస్తోంది.కాగా ఐక్యరాజ్యసమితి ఉగ్రవాద సంస్థగా ఐక్యరాజ్యసమితి ఎపుడో గుర్తించిన జైష్-ఎ-మొహమ్మద్, జమాత్ ఉల్-ముమినాత్ అనే మహిళా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఇటీవల ప్రకటించింది. అజార్ అక్టోబర్ 8న జమాత్ మహిళా విభాగాన్ని ప్రకటించాడు. అలాగే అక్టోబర్ 19న, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో, మహిళలను సమూహంలోకి తీసుకొచ్చేలా 'దుఖ్తరన్-ఎ-ఇస్లాం' అనే కార్యక్రమం కూడా జరిగింది.

# జిల్లాలో వరి ధాన్యం సేకరణ ఏర్పాట్లు భేష్


- నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిని లక్ష్మి

**ఎడపల్లి, అక్టోబర్ 22 ( జనంసాక్షి ) :** ఖరీఫ్ సీజన్ లో రైతులు పండించిన వరి ధాన్యం సేకరణ కోసం నిజామాబాద్ జిల్లాలో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేశారని నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్ అయిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ ఐ.ఏ.ఎస్ అధికారిణి లక్ష్మి అభినందించారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ లతో కలిసి బుధవారం ఆమె ఎడపల్లి మండల కేంద్రంలో ఐ.కె.పీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల వివరాలతో కూడిన రికార్డులను తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులను పలుకరించి, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని, నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేసి, ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారని రైతులు తెలుపడం పట్ల స్పెషల్ ఆఫీసర్ సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా నిజామాబాద్ జిల్లాలో రైతులకు బిల్లుల చెల్లింపుల కోసం ట్యాబ్ ఎంట్రీలు చేస్తుండడం పట్ల కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని అభినందించారు. స్లాట్ బుకింగ్, ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాల గురించి రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అన్ని కేంద్రాలలో ప్యాడీ క్లీనర్లు,





ధాన్యం ఆరబట్టే యంత్రాలు, మాయిశ్చర్ మీటర్లు, గ్రెయిన్ క్యాలిపర్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి జిల్లాలో కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరుతెన్నుల గురించి స్పెషల్ ఆఫీసర్ కు వివరించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే, నిజామాబాద్ జిల్లాలో ముందస్తుగానే ధాన్యం దిగుబడులు వస్తాయని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని దిగుబడులు చేతికందే సమయానికి కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. గత సీజన్ లో 606 కేంద్రాలు ఉండగా, ఈసారి 670 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 400 వరకు కేంద్రాలు నెలకొల్పామని అన్నారు. జిల్లాలో ఐ.కె.పి మహిళా సంఘాలు చురుకుగా ఉన్నందున ఎక్కువ సంఖ్యలో వారికి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ప్రతి కేంద్రంలో అన్ని సదుపాయాలు ఉండేలా పకడ్బందీ పర్యవేక్షణ జరుపుతున్నామని, ఏ దశలోనూ రైతులు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు. 17శాతానికి లోబడి తేమ శాతంతో కూడిన ధాన్యం తెచ్చిన వెంటనే తూకం జరిపించి, వెంటదివెంట నిర్దేశిత మిల్లులకు ధాన్యం తరలిస్తున్నారని, మిల్లుల నుండి ఎప్పటికప్పుడు ట్రక్ షీట్లు తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేయిస్తున్నామని తెలిపారు. కౌలు రైతులు పంట పండించినట్లయితే, నేరుగా వారి ఖాతాలలోనే బిల్లులు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఇప్పటికే జిల్లాలోని రైతుల ఖాతాలలో డబ్బులు జమ కావడం ప్రారంభం అయ్యిందని, పలు సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నందున వాటిని అధిగమించిన మీదట ఈ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. వీరి వెంట డీఆర్డీఓ సాయగౌడ్, డీ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి, డీ.సీ.ఓ శ్రీనివాస్ రావు, మార్కెటింగ్ శాఖ ఏ.డీ గంగవ్వ, ఎడపల్లి సహకార సంఘం చైర్మన్ పోల మల్కారెడ్డి, సహకార సంఘం కార్యదర్శి రాజారాం, సెంటర్ ఇంచార్జి ప్రభాకర్ గౌడ్, తహశీల్దార్ దత్తాద్రి, ఎంపీడీవో శంకర్ నాయక్, ఐకెపి అధికారులు, నాయకులు ఉన్నారు.




# పేట డిసిసి పీఠం ఎక్కేదెవరు?

## అధిష్టానం అభయ హస్తం ఎవరికి?

### బరిలో ఆరుగురు హేమహేమీలు

**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎవరు అవుతారని పార్టీ శ్రేణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ తీవ్రంగా ఉంది. మంత్రి వాకిటి శ్రీహరి ప్రాతిని ధ్యం వహిస్తున్న మక్తల్ నియోజక వర్గం, ఎమ్మెల్యే చిట్టెం పర్నిక రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నారాయణపేట నియోజకవర్గం,సాక్షాత్తు ముఖ్య మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజక వర్గంలోనీ కోస్గి,మద్దూరు మండలాలు నారాయణపేట జిల్లా పరిధిలో ఉన్నాయి. డిసిసి అధ్యక్ష పదవి కోసం ఆరుగురు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. డిసిసి అధ్యక్ష పదవి ఎన్నిక కోసం జాతీయ కాంగ్రెస్ పరిశీల కులు నారాయణస్వామి జిల్లా వ్యాప్తంగా పర్యటించి కాంగ్రెస్ సీనియర్ నాయకు లు, ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రది నిధుల అభిప్రాయాలను సేకరించారు.ఏఐసీసీ పరిశీల కులు బ్లాక్ లవారిగా సమావేశాలు నిర్వహించి నాయ కులు కార్య కర్తల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆయా బ్లాకుల కాంగ్రెస్ కమిటీలు తీర్మానాలు చేసి పరిశీ లకులకు అందజేశారు. పోటీలో ఉన్న నాయకుల్లో ఎవరు సమర్థులు వారి రాజకీయ ప్రస్థానం,పార్టీ బలోపేతానికి చేసిన కృషి పదవి ఇస్తే ఏమే రకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తారన్న అంశాలను పరిశీ లించారు.కాగా డిసిసి అధ్యక్ష పదవికి మొత్తం ఆరుగురు నాయకులు దరఖాస్తు చేసుకు న్నారు. అందులో ఎమ్మెల్యే చిట్టెం పర్నిక రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నారాయణపేట నియోజకవర్గం నుంచి ముగ్గు రు దరఖాస్తు చేసుకున్నారు.

నారాయణపేట మండలం నుంచి జాజాపూర్ గ్రామానికి చెందిన కోట్ల రవీందర్ రెడ్డి, నారాయణపేట పట్టణానికి చెందిన యూసఫ్ తాజ్, ప్రస్తు త డిసిసి ఇంచార్జి కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి ఉన్నారు. అలాగే మంత్రి వాకిటి శ్రీహరి ప్రాతిని ధ్యం వహిస్తున్న మక్తల్ నియో జకవర్గం నుంచి కట్టా సురేష్ కుమార్,ఎం నరేందర్ రెడ్డి ఉండగా ముఖ్యమంత్రి ప్రాతిని ధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజక వర్గంలోనీ కోస్గికి చెందిన మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న రెడ్డి ఉన్నా రు. అయితే వీరిలో డిసిసి అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుం దోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీరిలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే చిట్టెం పర్నిక రెడ్డి ఆశీస్సులు ఎవరికి ఉంటాయో ఎవరికి అభయ హస్తం ఉందో వారే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కానున్నారు. వారి ఆశీస్సులు ఎవరికి ఉంటాయోనని ఎదురు చూస్తున్నారు.

# జాతీయ స్థాయి సంగీత పోటీలలో సత్తాచాటిన పారమిత విద్యార్థులు




**కరీంనగర్ , అక్టోబర్ 22 (జనంసాక్షి) :** ఇటీవల డ్రీమర్స్ డ్రీమ్, లక్నో వారి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి సంగీత పోటీలలో స్థానిక నగరం లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులు పొందారని పాఠశాల డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఈ పోటీల వాయిద్య సంగీత విభాగంలో 7వ తరగతికి చెందిన కిట్ల.చరణ్ జాతీయస్థాయి 7వ స్థానం, 6వ తరగతికి చెందిన ఎ.వి.కె. కార్తీక్ జాతీయస్థాయి 24వ స్థానం, గాత్ర సంగీత విభాగంలో 8వ తరగతికి చెందిన సోనాక్షి సురేష్ జాతీయస్థాయిలో17వ స్థానం పొంది బహుమతులు, సర్టిఫికెట్స్ అందుకున్నారు. జాతీయస్థాయిలో బహుమతులు పొందిన విద్యార్థులను, సంగీత ఉపాధ్యాయులు జితుమణి శర్మ, కిరణ్ కుమార్ లను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ.ప్రసాద రావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, రాకేష్, వియుయం ప్రసాద్, వినోద్‌రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ హన్మంత రావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు భవానీ, రబీంద్ర పాత్రో, నిఖితలు తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఏళ్ల బాల్ రెడ్డి

**ముస్తాబాద్ :** మండల కేంద్రంలోని తుర్కపల్లి రామలక్షణపల్లి ఆవునూర్ నామాపూర్ గోపాల్ పల్లె రాంరెడ్డి పల్లె చీకోడ్ మద్దికుంట మోహిని కుంట వెంకట్రావుపల్లి మొర్రపూర్ తెర్లుమద్ది గ్రామాలలో వద్ద కొనుగోలు కేంద్రాలు ప్రారంభం.ముస్తాబాద్ మండలంలోని పోతు గల్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సిం లు మరియు ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి వద్ద కోనుగోలు కేంద్రాలను ప్రారంభించారుఈ సందర్భంగా మాట్లాడుతూ పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది అన్నారు.వరి కోతలు పూర్తిస్థాయిలో మొదలుకాకముందే ఏర్పాటు చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. రైతులారా దళారుల, ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి వద్దను మిల్లర్లకు గాని ఇతర దళారులకు అమ్ముకోవద్దు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేస్తుంది మద్దతు ధర చెల్లిస్తుంది ఎవరు అధైర్య పడవద్దు అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మండల నాయకులు గ్రామస్థాయి నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు రైతులు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

*రంగారెడ్డి జిల్లా కాటేదాన్ వద్ద తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. విద్యార్థుల ఇండ్ల వద్ద నుంచి దించి వస్తున్న సమయంలో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బస్సులో మంటలు వ్యాపించాయి.*

# సదర్ ఉత్సవాలతో పీర్జాదిగూడలో సందడి





- యాదవుల ఐక్యతే సమాజ బలమన్న బీర్ల ఐలయ్య

**బోడుప్పల్ అక్టోబర్ 22 జనంసాక్షి :** పీర్జాదిగూడలో యాదవుల సదర్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మేడిపల్లి శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో పీర్జాదిగూడ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. అధ్యక్షత వహించిన పాశం బుచ్చి యాదవ్ నేతృత్వంలో సదర్ పండుగకు విశేష స్పందన లభించింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత,మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, యాదవులు విశ్వాసం, నమ్మకానికి నిదర్శనమని, సమాజ అభివృద్ధికి ఐక్యత అత్యంత అవసరమని చెప్పారు. సదర్ పండుగ హైదరాబాద్ నగరానికి మాత్రమే పరిమితమై ఉండగా, ఇప్పుడు రాష్ట్రమంతటా ప్రతి గ్రామంలో ఉత్సాహంగా జరుపుకుంటున్నారని తెలిపారు. యాదవ సంఘాలు చేపడుతున్న కార్యక్రమాలు మన సంస్కృతికి దర్పణమని, యువతలో ఐక్యతా భావాన్ని పెంపొందించాలన్నారు.తరువాత అలంకరించిన దున్నపోతులు వీధుల గుండా ప్రదక్షిణ చేసి ఆకట్టుకున్నాయి. వేదికపై జరిగిన ఆటపాటలు, నృత్యాలు ప్రజలను మంత్ర ముగ్ధులను చేశాయి.ఈ వేడుకలో బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మీ, కార్పొరేటర్లు బోంతు శ్రీదేవి, వర్రె వేంకటేశ్వర్లు, దుదిమెట్ల బాలరాజు, మాజీ మేయర్లు జక్క వెంకట్ రెడ్డి, కుర్ర శివకుమార్, పాశం శశిరేఖ యాదవ్, హరిశంకర్ రెడ్డి, నవీన్ రెడ్డి, తుంగతుర్తి రవి, బండారి రవీందర్, అనంత రెడ్డి, పప్పుల అంజిరెడ్డి లతో పాటు యాదవ సంఘం నిర్వాహకులు పాశం రాజు యాదవ్, మధుగాని దేవేందర్ యాదవ్, ఐలయ్య యాదవ్, సత్యనారాయణ యాదవ్, పాశం సత్యం యాదవ్, వెంకటేష్ యాదవ్, ఎర్ర సత్యం తదితరులు పాల్గొన్నారు.



## అల్ఫోర్స్‌లో ఎస్జీఎఫ్ అండర్ 17 కరీంనగర్

# జిల్లాస్థాయి బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు

### అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** క్రీడలలో చెస్ క్రీడకు ప్రత్యేకత ఉన్నదని, చెస్ ఆడేవారికి మేధస్సు చాలా పదునుగా ఉంటుందని విజ య అవకాశాలు చాలా ఉంటాయని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి ఎస్జీఎఫ్ అండర్ 17 బాల బాలికల చెస్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ క్రీడకు ప్రపంచవ్యాప్తంగా చాలా క్రేజ్ ఉన్నదని, సృజనాత్మకతతో పాటు మేధస్సు పెరుగుతుందని అభిప్రాయపడుతూ ప్రతి ఒక్కరు ఆడడాన్ని అలవాటుగా చేసుకోవాలని ఈ క్రీడలో పాల్గొనే వారికి చాలా ఓపికతో పాటు సామర్థ్యం ఉండాలని గుర్తు చేశారు. ఈ క్రీడ ద్వారా విశ్వఖ్యాతిని పొందవచ్చని అందుకు ఉదాహరణ మన భారతదేశంలోని వివిధ చెస్ ప్లేయర్లని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ప్రతి విద్యార్థి క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని వివిధ స్థాయిలలో నిర్వహింపబడేట టువంటి వివిధ పోటీలలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటానని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారు సైతం విద్యార్థులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించడం చాలా గొప్ప విషయమని వారి క్రీడా సామర్థ్యాన్ని పెంపొంది ంచడానికి ప్రత్యేకంగా ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడం క్రీడాలోకానికి గొప్ప అవకాశం అని కొనియాడారు. ప్రారంభం సందర్భంగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని ట్రైల్ గేమ్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, పిఈటి ల సంఘం మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, జీనియస్ ఎస్ అకాడమీ నిర్వాహకులు కొంకటి అనుప్, వివిధ పాఠశాలల ప్రతినిధులు, టీం మేనేజర్లు, పరిశీలకులు, ఆర్బిటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల నుండి 5 వరకు క్రీడాకారులను ఎంపిక చేసి గురువారం జగిత్యాలలో నిర్వహించబోయే జోనల్ స్థాయిలలో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారని చెప్పారు.

## పోలీసు అమరవీరుల వారోత్సవాలు

# వ్యాసరచన పోటీలు నిర్వహణ

- పోలీసు సిబ్బందికి రెండు కేటగిరీల పోటీలు
- విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన
- ప్రజలకు షార్ట్‌ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలు




**కరీంనగర్, అక్టోబర్ 22 (జనసాక్షి):** పోలీసు అమరవీరుల స్మరణ వారోత్సవాల సందర్భంగా కరీంనగర్ పోలీసు కమిషనరేట్‌లో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కమిషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ పోటీల్లో కానిస్టేబుల్ నుంచి ఏఎస్పై వరకు సిబ్బంది పాల్గొన్నారు. 'పని ప్రదేశంలో లింగ వివక్ష' అనే అంశంపై కానిస్టేబుల్ల నుంచి ఏఎస్పైలకు, 'నేల స్థాయిలో పోలీసింగ్ బలోపేతం' అనే అంశంపై ఎస్పైల నుంచి ఉన్నతాధికారులకు వ్యాసాలు రాశారు. కమిషనరేట్ కు చెందిన అన్ని స్టేషన్లు, విభాగాల నుంచి మొత్తం 117 మంది పోలీసులు భాగస్వామ్యం చేసుకున్నారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు మరిన్ని పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. అక్టోబర్ 22 నుంచి 28 వరకు అన్ని విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు ఉగాదీ చేశారు. 'డ్రగ్స్ నిర్మూ ల నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్‌నుంచి ఎలా దూరంగా ఉండాలి' అనే అంశం పై తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో వ్యాసాలు రాయాలి. విద్యార్థులు తమ వ్యాసాలను https://forms.gle/jaWLdt2yhNrMpe3eA లింక్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. ప్రతి భాష నుంచి కమిషన రేట్ స్థాయిలో ముగ్గురు ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేస్తారు. అదే విధంగా ప్రజలందరికీ పోలీసులకు సంబంధించిన అంశాలపై షార్ట్‌ఫిల్మ్ పోటీలు, ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల తీసిన పోలీసు ఫోటోలు, షార్ట్‌ఫిల్మ్‌లను అక్టోబర్ 22 నుంచి 28 వరకు కమిషనరేట్‌లోని ఐటీ కోర్ కార్యాలయంలో సమర్పించవచ్చు. ఈ పోటీల్లోనూ టాప్ ముగ్గురుకు బహుమతులు అందజే స్తారు. వారోత్సవాలను విజయవంతం చేయడా నికి ప్రజలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని కమిషనర్ కోరారు.

## జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో కాకతీయ విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం

### పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్

**జమ్మికుంట :** పోలీస్ అమర వీరుల దినోత్సవా న్ని పురస్కరించుకొని బుధవారం రోజున కరీం నగర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్‌లో టౌన్ ఇన్స్పెక్టర్ ఎస్ రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని కాకతీయ స్కూల్ విద్యార్థుల తో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థ ఏ విధంగా పని చేస్తుంది, పోలీస్ వ్యవస్థలో గల విధులు పోలీస్ వ్యవస్థలో గల కర్తవ్యాలు పోలీస్ స్టేషన్‌లో ఒక ఫిర్యాదును ఏ విధంగా తీసుకోబడుతుంది.

# ఆలయ అధికారుల ఇష్టారాజ్యం

## అయోమయంలో రాజన్న భక్తులు





**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 22 (జనంసాక్షి):** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి పనుల కారణంగా బుధవారం భక్తుల దర్శనాలను గంటపాటు నిలిపివేశారు. ఆలయంలో రేకుల షెడ్లను తొలగిస్తున్న సమయంలో కోడే మొక్కులతో పాటు దర్శనాలను కూడా రద్దు చేసిన అధికారులు, గంట తర్వాత భక్తులను మళ్లీ దర్శనానికి అనుమతించారు. అయితే, దర్శన సమయాలపై స్పష్టత లేకపోవడంతో భక్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కార్తీక మాసం మొదటి రోజు ఆలయానికి వచ్చిన భక్తులు పలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఆలయం మూడు వైపులా ఉన్న ద్వారాలకు తాళాలు వేయడంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. గత నెల రోజులుగా శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో దర్శన ఏర్పాట్లు చేసినప్పటికీ, రాజన్న దర్శనం కోసం రాజగోపురం ముందు ప్రచార రథంలోని విగ్రహాలను దర్శించుకోవాలని,లేదా ఎల్ఈడి స్క్రీన్ ద్వారా స్వామిని దర్శించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ అస్పష్టత వల్ల భక్తులు అయోమయానికి గురవుతు న్నారు. దీనిపై స్పష్టమైన ప్రకటన జారీ చేయాలని భక్తులు ఆలయ అధికారులను కోరుతున్నారు.

# ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారు

### రాష్ట్ర బిజెపి నాయకులు పైడి ఎల్లారెడ్డి



**నాగిరెడ్డిపేట, అక్టోబర్ 22 జనంసాక్షి :** మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకులు,శాస్త్రజ్ఞులు పైడి ఎల్లారెడ్డి పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ... గత రెండు నెలలు గడుస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కామారెడ్డి జిల్లాలో ముంపు ప్రాంతంలో పర్యటించిన ఇప్పటివరకు రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వనటువంటి చేతగాని ప్రభుత్వం నేడు రాష్ట్రాన్ని పాలిస్తుం దని ఎద్దేవా చేశారు.ఎల్లారెడ్డి నియోజకవర్గ సమస్యలు పట్టించుకో కుండా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు విదేశీ పర్యటనలు చేస్తూ ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసారనన్నారు.ఇకనైనా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుపై ఉందని పేర్కొన్నారు.స్థానిక సంస్థ ఎన్ని కల నిర్వహణ చేపట్టలేకపోవడం వల్ల గ్రామాలు అభివృద్ధికి నోచుకోక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నరాని పేర్కొన్నారు.ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఏదో చదువుకున్న వ్యక్తి అని గెలిపిస్తే ఎక్కడ గొంగడి అక్కడనే ఉన్నట్లు ఉందన్నారు.అనంతరం తనవంతు సహాయంగా మండల కేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప గుడికి ఆర్థిక సహాయాన్ని అందిస్తానని ఆలయ కమిటీ సభ్యులకు హామీ ఇవ్వడం జరిగింది.అలాగే బంజారా గ్రామంలో సేవాలాల్ గుడికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తానని బంజారా సోదరు లకు చెప్పారు.ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రీనివాస్,జిల్లా కార్యవర్గ సభ్యుడు హనుమాన్లు,మాజీ ఎంపీపీ దివిటి రాజ దాస్, ప్రధాన కార్యదర్శి కిషన్, మండల ఉపాధ్యక్షులు గోపాల్,ఎస్టి మోర్చా మండల అధ్యక్షుడు దేవి సింగ్, బూత్ అధ్యక్షులు రాజు,గోపాల్ సాయిలు, నాయకులు సిద్ధి రాములు,విష్ణు,రాజు, భావేష్, తదితరులు పాల్గొన్నారు.

## పాస్‌పోర్ట్ పోయినది

ఆరుముళ్ళ బాలకృష్ణ తండ్రి ఆరుముళ్ళ గంగారం, ఇం.నం.4-3-1/28, తులసి నగర్, జిల్లా జగిత్యాల. తెలంగాణ రాష్ట్రం అను నా యొక్క పాస్‌పోర్టు నం. U7564922. 07.09.2025 రోజున జగిత్యాలలో న్యూ బస్టాండ్ నుండి ఓల్డ్ బస్టాండ్‌కు వెళ్తుండగా మధ్య మార్గ మధ్యలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. దయచేసి ఎవరికైనా దొరికినచో తిరిగి ఇవ్వగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును. ఫోన్ నెంబర్ 9121822462.

## CHANGE OF NAME

I, **BURRA UDAY KIRAN, S/o BURRA SADANANDAM,** aged 16 years, R/o H.No. 3-176, Vill: Venkatapur Mandal: Nallagunta, Dist: Warangal, Telangana, PIN: 506345, **Aadhaar No. 9692 0934 1695,** DOB: 10/06/ 2009, student of Govt TWASH School, Karlapally, Mulugu District, have changed my name to BURRA UDAY KUMAR as per my **SSC Memo (2532101783)** randum. Hence forth, I shall be known as BURRA UDAY KUMAR in all records and correspondences. Date: 22-10-2025 Place: Warangal

**Sd/- BURRA UDAY KUMAR**

## నందివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 22 (జనం సాక్షి) :** మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, కష్టపడి చదివి పదవ తరగతి లో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి జిల్లా: తాడ్వాయి మండలం నందివాడ గ్రామంలోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10 వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత అయ్యేలా సన్నద్ధం చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచేలా చూడాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించి చదువులో వెనుకబడిన వారిని గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. 10వ తరగతిలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని సిలబస్ ఎంత వరకు పూర్తయిందని, తదితర ప్రధానో పాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. 10 వ తరగతి విద్యార్థుల చేత బోర్డుపై ఉన్న పదాలను చదివించారు. విద్యార్థులు అందరూ వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని 100% ఉత్తీర్ణత సాధించాలని, జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంసీఏం మధ్యాహ్న భోజనంను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనీ, నాణ్యత ప్రమాణాలు పాటించి మంచి ఆహారం అందించాలని, వంట చేసేటప్పుడు, వడ్డించేటప్పుడు శుభ్రత పాటించాలని అన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, అదే విధంగా స్లాబ్ పై పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు శానిటేషన్ వర్కర్‌చే శుభ్రం చేయించాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట డీఈవో రాజు, ఎంఈఓ రామస్వామి ఎమ్మార్వో శ్వేత ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీ ఓ సవిత రెడ్డి పాల్గొన్నారు.

## ప్రియుడితో కలిసి భర్త హత్య.. భార్య అరెస్ట్

- మద్యం తాగించి హత్య.. ఆపై శవం దహనం
- సీసీటీవీలతో వారంలో కేసు ఛేదించిన పోలీసులు




**గాంధారి, అక్టోబర్ 22 (జనం సాక్షి):** కామారెడ్డి జిల్లా గాంధారిలో భార్య, ప్రియుడు కలిసి భర్తను హత్య చేశారు. మద్యం తాగించి మత్తులో నరేష్‌ను కిందకు నెట్టి, ఆంజనేయులు చేతులు, కాళ్లతో దాడి చేసి చంపి, శవాన్ని పెట్రోల్‌తో దహనం చేసి కాలువలో పడే శారు. స్థానికుల సహకారంతో ఏర్పాటైన 42 సీసీటీవీ కెమరాలు కేసు ఛేదనంలో కీలకం. వారంలో నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్పీ రాజేష్ చంద్ర ఐపీఎస్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, సిబ్బందిని అభినందించారు.
గాంధారి గ్రామ పంచాయతీ సెక్రటరీ ములకలపల్లి నాగరాజు (43) 2012లో ఇరగడింట్ల నవనీత (27)ను పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరూ కూలి పనులు చేస్తూ ఆంజనేయులు (38) వద్ద పనిచేశారు. నవనీత–ఆంజనేయులు మధ్య పరిచయం శారీరక సంబంధంగా మారింది. నరేష్ అనుమానంతో వేధించడంతో, నవనీత, ఆంజనేయులు అతన్ని చంపాలని పథకం వేశారు. అక్టోబర్ 15న నరేష్‌ను పెద్దగుట్టకు తీసుకెళ్లి, గాంధారిలో మద్యం తాగించి, చద్మల్ రోడ్డు కాలువ వద్ద దాడి చేసి చంపి, శవాన్ని 100 రూపాయల పెట్రోల్‌తో దహనం చేశారు. 16న శవం కనుగొనగా, గాంధారి పోలీసులు కేసు నమోదు చేశారు.
ఎస్పీ ఆదేశాలతో యెల్లారెడ్డి డీఎస్పీ, సీఐ సంతోష్ కుమార్ నేతృత్వంలో దర్యాప్తు జరిగింది. సీసీటీవీ ఫుటేజ్‌లు, స్థానికుల సమాచారంతో ఆంజనేయులు (ఎస్సీ మాదిగ, వాటర్ మ్యాన్, మేడ్చల్), నవనీత (వడ్డెర, లేబర్, కీసర)లను అరెస్టు చేసి, బైక్, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ సీసీటీవీల ఏర్పాటుకు సహకరించాలని, అవి నేర నివారణలో కీలకమని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన గ్రామస్తులను అభినందించారు.

### దీపావళి రోజు నాన్నమ్మను చంపి

## కడియాలు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

- పేకాట, జల్సాలకు డబ్బు కోసం దారుణ హత్య
- స్థానికుల సమాచారంతో వేగంగా ఛేదనం
- ఎస్పీ రాజేష్ చంద్ర అభినందనలు






**నసురుల్లాబాద్, అక్టోబర్ 22 (జనం సాక్షి):** కామారెడ్డి జిల్లా అంకోల్ తండా గ్రామంలో దీపావళి పండుగ రోజు పేకాటకు డబ్బులు లేక వృద్ధురాలిని హత్య చేసి వెండి కడియాలు దొంగిలించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలు గుగులోత్ రాది బాయి (67) ఇంట్లో ఒక్కటే ఉండగా, నిందితుడు మెగవత్ సవాయి సింగ్ 'ఆశీర్వాదం తీసుకుంటాను' అని వచ్చి గొడ్డలి కామతో తలపై కొట్టి, కణ్ణులపై కర్రతో దాడి చేసి, చేతులతో గొంతు పిసికి చంపాడు. దొంగిలించిన కడియాలను అమ్మడానికి బాన్సువాడకు వెళ్తుండగా స్థానికుల సమాచారంతో పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఐపీఎస్ దీనిని పేకాట, జల్సాలకు డబ్బు కోసం చేసిన నేరంగా చెప్పారు. డీఎస్పీ విట్టల్ రెడ్డి, సీఐలు తిరుపతయ్య, పి.రాఘవేంద్ర, సిబ్బందిని అభినందించారు. పేకాట అవకాశాలను డయల్ 100 లేదా 8712686133కు తెలియజేయాలని, సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని ఆయన విజ్ఞప్తి చేశారు. అంకోల్ తండా గ్రామానికి చెందిన గుగులోత్ రాది బాయి (67), గ్రామంలోనే ఒక్కటే ఉండగా, అదే గ్రామానికి చెందిన మెగవత్ సవాయి సింగ్ పేకాట, తాగుడు, జల్సాలకు అలవాటు పడి చిన్న చిన్న దొంగతనాలు చేసేవాడు. దీపావళి రోజు (అక్టోబర్ 20) రాత్రి 7:30 గంటల సమయంలో పేకాటకు డబ్బులు లేక, ఆమె ఇంట్లో ఒక్కటే ఉందని తెలుసుకుని 'ఆశీర్వాదం తీసుకుంటాను' అని వెళ్లాడు. మాట్లాడుతూ తలుపు లాక్ చేసి, గొడ్డలి కామతో తలపై కొట్టి, కణ్ణులపై కర్రతో దాడి చేసి, చేతులతో గొంతు పిసికి చంపాడు. చేతుల్లోని రెండు వెండి కడియాలు లాగి పారిపోయాడు. ఇంటి ప్రక్కనున్న లక్ష్మీబాయి అడ్డురాగా వచ్చింది. మృతురాలి కుమారుడు గుగులోత్ లాల్ సింగ్ (తండ్రి ఫకీర్, 67, కూలి) ఫిర్యాదు మేరకు నసురుల్లాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై దర్యాప్తు జరిగింది.
బుధవారం నిందితుడు బాన్సువాడలోని బంగారు దుకాణాల్లో కడియాలు అమ్మడానికి వెళ్తుండగా స్థానికుల సమాచారంతో పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 30 తులాల వెండి రెట్ట కడియాలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ విట్టల్ రెడ్డి, బాన్సువాడ రూరల్ సీఐ తిరుపతయ్య, నసురుల్లాబాద్ ఎస్ఐ పి.రాఘవేంద్ర నేతృత్వంలో తక్కువ సమయంలో కేసు ఛేదించారు. ఎస్పీ రాజేష్ చంద్ర ఈ సిబ్బందిని అభినందించారు. పేకాట, జల్సాలకు అలవాటు పడినవారు చిన్న నేరాల నుంచి పెద్ద నేరాలకు దిగుతున్నారని, జిల్లాలో పేకాట ఆటలు గుర్తించినవారు పోలీసులకు తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు.

## నెలకు వెయ్యి ఇస్తావా.. కోరిక తీరుస్తావా?

### పారిశుద్ధ్య కార్మికురాలికి ఓ ప్రబుద్ధుడి లైంగిక వేధింపులు

- కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో బాధితురాలి మొర
- ఓ అధికారికి ఫిర్యాదుచేసినా పట్టకపోవడంతో జిల్లాధికారికి వినతి





**కోరుట్ల, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** గత 20 సంవత్సరాలుగా కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న ఓ మహిళపై అదే కార్యాలయంలో మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ ప్రబుద్ధుడు ల్కెంగిక వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ఆమె ఆరోపించింది. ఈ ఘటన కోరుట్ల పట్టణ మున్సిపల్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణానికి చెందిన మహిళ గత 20 ఏళ్లుగా మున్సిపల్ కార్యాలయ పారిశుధ్య కార్మికురాలుగా పనిచేస్తూ జీవితం కొనసాగిస్తున్నది. గత మూడు నెలలుగా చిట్యాల రాజకుమార్ తనను లైంగిక వేధింపులకు గురిచేస్తూ రాత్రి పగలు తేడా లేకుండా ఫోన్ చేసి వేధిస్తున్నాడని, అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని కన్నీటి పర్యంతమైంది. ఎన్నోసార్లు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయింది. అతని కోరిక తీర్చకుంటే తన వేతనం నుంచి నెలకు వెయ్యి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడని గోడు వెళ్లబోసుకుంది. అదే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రాజ కుమార్‌కు వరుసకి అన్న అయిన శ్రీనివాస్ అండ చూసుకొని మరింత చెలరేగిపోతున్నాడని ఆమె ఆరోపించింది. అయితే తోటి పారిశుధ్య కార్మికులతో తనపై అసత్య ఆరోపణలు చేయిస్తున్నాడని, ఈ కారణంగా తన భర్త, పిల్లలు కూడా సరిగా మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులే న్యాయం చేయాలని.. లేదంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడటం తప్ప వేరేమార్గం లేదని వాపోయింది.




**అడిషన కలెక్టర్ దృష్టికి..**
మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు భారతి గత మూడు రోజుల నుండి కోరుట్ల మున్సిపాలిటీ లో జరుగుతున్న పరిణామాలను జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు రాతపూర్వకంగా వివరించింది. ఓ జవాన్ తనపట్ల వ్యవహరించిన తీరును, అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని, తనతో పాటు తోటి కార్మికురాలను కూడా బెదిరిస్తూ లైంగికంగా వేధిస్తున్నారని తెలియజేసింది. అన్ని విషయాలు విన్న కలెక్టర్ వెంటనే స్పందించి దీనిపై విచారణకు ఆదేశించారని బాధితురాలు తెలిపింది.

## బ్యాంకుల్లో భద్రతపై సీఐ తనిఖీ



**గోదావరిఖని, జనంసాక్షి :** ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు భద్రతా చర్యల్లో భాగంగా గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ,న్యూఅశోక్ థియేటర్ పక్కన యూనియన్ బ్యాంక్, మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న స్టేట్ బ్యాంక్‌లలో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తనిఖీలు నిర్వహించారు. అదేవిదంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని మిగతా బ్యాంకుల్లో భద్రతపై ఎస్ఐ రమేష్ కూడా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో, ఏటీఎంల వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ టీవీ కెమెరాలు బ్యాంకులు భద్రత ప్రయోజనాల కోసం కలిగి ఉండాలని సూచించారు. తదనుగుణంగా బ్యాంకు భద్రతాంశాలపై బ్యాంకు ఆవరణ అంతా కవర్‌అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్‌రూమ్, సెక్యూరిటీగార్డ్, సీసీ కెమెరాలు, లైటింగ్, సెక్యూరిటీగార్డ్ ఏర్పాటు, బ్యాంకుల్లో భద్రతా లోపాలు ఉండకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. బ్యాంక్‌కు వచ్చే కస్టమర్‌లకు ఎవరైనా ఎక్కువ సమయం బ్యాంక్‌లో ఉన్నట్టు అనుమానస్పదంగా అనిపిస్తే సమాచారం చెప్పాలని, బ్యాంకు నుండి డబ్బులు డ్రా చేసుకొని వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా కస్టమర్లకు అవగాహన కల్పించాలని బ్యాంక్ అధికారులకు సిఐ సూచించారు.

## పోలీస్ అమరవీరుల దినోత్సవ సందర్భంగా పోలీస్ ఫ్లాగ్ డే

**యైటింక్లయిన్ కాలనీ (జనంసాక్షి) :** పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ జా ఆదేశానుసారం గోదావరిఖని టూ టౌన్ సీఐ ఎన్. ప్రసాదరావు 8వ కాలనీలోని సిర్కే బస్ స్టాప్ వద్ద పోలీస్ కళాబృందంచే బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం వారు అమరులైన పోలీసులను స్మరించుకుంటూ మొదటగా మౌనం పాటించి, పోలీసుల త్యాగాలను గుర్తు చేస్తూ డప్పు చప్పులతో పాటలు పాడుతూ పోలీసుల త్యాగాలను ప్రజలకు గుర్తు చేశారు.



## కార్పోరేట్ జీఎంకి ఆత్మీయ సన్మానం

**యైటింక్లయిన్ కాలనీ అక్టోబర్ 22 (జనంసాక్షి) :** సింగరేణి కార్పోరేట్ జీఎం (వర్క్‌షాప్ అండ్ ఎనర్జీ మేనేజ్‌మెంట్) కొండారెడ్డి శ్రీనివాస్‌ని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య, అన్ని విభాగాల అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించి మాట్లాడారు. ఈ నెల చివరన విరమణ పొందుతు న్నట్లు తెలిపారు. అలాగే ఏరియా బొగ్గు ఉత్పత్తి, ముడి పరికరాల విషయాలపై కూలంకషంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటుజి రాముడు, ఏరియా ఇంజనీర్ సుజన్ మెహరా, డీజీఎం (పర్సనల్) పి. అరవింద్ రావు, డీజీఎం (ఈఅండ్ఎం) వెంకటరాంరెడ్డి, డీజీఎం రామచంద్ర, తిరుపతి రెడ్డి ఎన్విరాన్మెంట్ అధికారి సురేష్ బాబు, వేణుగోపాల్, ఎస్టేట్ అధికారిణి సునీత, ఐటీ మేనేజర్ అశ్విని, సీనియర్ పీఓ సాధన్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మహ్మద్ పాల్గొన్నారు.

## రక్తదానం చేసే వారికి గుండె జబ్బులు వచ్చే అవకాశాలు తక్కువ

### ఐరెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో అనీమియా వ్యాధితో బాధపడుతున్న మంజులకు అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం అవసరం కావడంతో సింగరాయపల్లి గ్రామానికి చెందిన అన్నెబోయిన ప్రశాంత్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి సకాలంలో రక్తాన్ని అందజేసి ప్రాణదాతగా నిలవడం జరిగిందని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ రక్తదానం పట్ల అవగాహనను పెంపొందించు కోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేల ప్రకారం రక్తదానం చేసే వారికి గుండె జబ్బు క్యాన్సర్ కొలెస్ట్రాల్ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని తెలియజేయడం జరిగిందని రక్తదానం చేయడం అంటే తోటి వారి ప్రాణాలను కాపాడమే కాకుండా మన ప్రాణాలను కూడా కాపాడుకోవచ్చునని అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు,రక్తదానానికి ముందుకు వచ్చిన రక్తదాతకు అభినందనలు తెలియజేశారు.

## సిద్ధ రామేశ్వర ఆలయ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం





- ముఖ్య అతిథులుగా షబ్బీర్ అలీ , సురేష్ షెట్కార్
- ఆలయ అభివృద్ధికి నిజాయితీతో కృషి చేయాలి: షబ్బీర్ అలీ

**కామారెడ్డి, అక్టోబర్ 22 (జనం సాక్షి):** కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండల కేంద్రంలోని శ్రీ సిద్ధ రామేశ్వర స్వామి స్వయంభు లింగ మహా క్షేత్రంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. షబ్బీర్ అలీ సమక్షంలో నూతన చైర్మన్, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా తాటిపాముల లింబాద్రి, వైస్ చైర్మన్‌గా అందే దయాకర్ రెడ్డి, డైరెక్టర్లుగా సింగారపు నర్సమ్మ, నీలా అంజయ్య, అనుగు అమృత, సామ సంతోష్ రెడ్డి, పెంజర్ల ఈశ్వర్ రెడ్డి, ముత్తన్న ఓల్ల కిష్టయ్య, నాగర్తి రమేష్ రెడ్డి, గుడిసె నారాయణ, లింగి భాగయ్య, మోకాళ్ళ బాపురెడ్డి, చీకోటి ప్రభాకర్, అక్కు కార్తీక్‌లు ప్రమాణం చేశారు. మొహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, భిక్నూరు సిద్ధ రామేశ్వర ఆలయం పురాతనమైనది, మహిమాన్వితమైనదని, ఈ ఆలయం ద్వారా భిక్నూరు గ్రామం రాష్ట్ర, దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని అన్నారు. తన నియోజకవర్గంలో ఈ ఆలయం ఉండటం తన అదృష్టమని, సిద్ధ రామేశ్వరుని కరుణతోనే తనకు ఆలయ అభివృద్ధికి కృషి చేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు నిజాయితీతో ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని, ఈ అవకాశాన్ని స్వామి కరుణగా భావించి, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆలయ దర్శనం మనసుకు ప్రశాంతతనిస్తుందని, భక్తుల కోరికలు నెరవేరుస్తుందని, తాను శాయశక్తులా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. సురేష్ కుమార్ షెట్కార్ మాట్లాడుతూ, నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. స్వామివారి దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని, షబ్బీర్ అలీ ముస్లిం అయినప్పటికీ ఆలయ అభివృద్ధిలో ముందు వరుసలో ఉంటారని ప్రశంసించారు. సిద్ధ రామేశ్వర ఆలయం పురాతనమైనది, మహిమలు కలిగినదని, దాని అభివృద్ధికి తాను తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పీసీసీ జనరల్ సెక్రెటరీ ఇంద్రకరణ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాస్, ఎడ్ల రాజిరెడ్డి, భీమ్ రెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, అనంతరెడ్డి, సుతారి రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మిరాజాగౌడ్, జనగామరాజు, బల్యాలసుదర్శన్, గోనె శ్రీనివాస్, దేవరాజ్ గౌడ్, ఇంద్రసేనా రెడ్డి, లింగారెడ్డి, ఐరెని సందీప్, గంపప్రసాద్, నరసింహారెడ్డి, అంతంపల్లి సుధాకర్ రెడ్డి, గుడుగుల శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఏడుగురు పేకాటరాయళ్ల అరెస్ట్

- 1770 రూపాయలు స్వాధీనం కేసు నమోదు
- చిగురుమామిడి ఎస్సై రేణికుంట సాయికృష్ణ



**చిగురుమామిడి, అక్టోబర్ 22 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం నవాబుపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న పక్క సమాచారం మేరకు చిగురుమామిడి ఎస్సై రేణికుంట సాయికృష్ణ ఆధ్వర్యంలో తమ సిబ్బందితో కలిసి రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురిని పట్టుకొని వారి వద్ద ఉన్న 1770 రూపాయలను, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. పట్టుకున్న వారిలో నరేందర్ సింగ్, రాణా ప్రతాప్ సింగ్, రాజేందర్, దుర్గయ్య, ఎల్లయ్య, కిష్టారెడ్డి, ప్రవీణ్ లు ఉన్నట్లు ఎస్ఐ చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడుతూ అప్పుల పాలై ఆత్మహత్య చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు తెలిపాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ పేర్కొన్నారు.

## రైతు సంక్షేమము కోసం ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 22 (జనంసాక్షి) :** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామంలో ఫ్యాక్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇస్తూ కొనుగోలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విద్యుత్, ఎరువులు,మేలైన వంగడాలను ప్రభుత్వం తరుపున అందిస్తున్నామన్నారు. రైతులకు ఏక కాలంలో రైతు ప్రయోజనాలు కోసం రూ 20 వేల కోట్ల మేర రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం పంపిణీ చేయడం కోసం అదనంగా నూతన లారీ ఏజెన్సీలకు ఇవ్వడం జరిగిందన్నారు. సన్న వడ్లు పండించే రైతులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి క్వింటాల్‌కు అదనంగా రూ 500 ఇస్తున్నదని, గతంలో వడగల వాన వల్ల నష్టపోయిన రైతులకు ఆదుకున్నామన్నారు. కొనుగోలు కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని,రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూడాలని, సరిపడా టార్పలిన్ కవర్లు, గన్ని సంచులు,ఇతర సామాగ్రి అందుబాటులో ఉంచాలని విప్ ఆదేశించారు. రైతులు పండించిన పంట చివరి గింజా వరకు కొంటామన్నారు. అయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య, సొసైటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
23 అక్టోబర్ 2025

# మెగా జాబ్‌మేళాకు అన్ని ఏర్పాట్లు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి) : దేశంలోని అన్ని రాష్ట్రాలలో గ్రామీణ యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నదని, ఉన్నత చదువులు చదివినప్పటికీ ఉద్యోగాలు రాక యువత ఇబ్బందులు పడుతున్నారని, ఇది అందరికీ ఆవేదన కలిగించే విషయమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గడచిన 20 నెలల కాలంలో 70 నుండి 75 వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఇటీవల గ్రూప్ 1,గ్రూప్ 2 అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడమే కాకుండా లైసెన్స్ డ్ సర్వేయర్లకు కూడా నియామక పత్రాలు అందించడం జరిగిందన్నారు. అలాగే ప్రైవేటు రంగంలో కూడా ఎక్కువ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని దేశ విదేశాల నుండి పెట్టుబడులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ప్రత్యేకించి సూర్యాపేట జిల్లాలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో సింగరేణి కాలరీస్, డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ సహకారంతో హుజూర్ నగర్ లో ఈ నెల 25న జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇప్పటి వరకు 12500 మంది ఉద్యోగాల కోసం రిజిస్టర్ చేసుకోగా, ఆన్లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోనని వారు కూడా జాబ్ మేళాకు రావచ్చని తెలిపారు. 15000 మందికి పైగా నిరుద్యోగ యువత జాబ్ మేళాకు రానున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు వచ్చే వారి కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తామని,ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 5 కాపీల రెస్యూమ్ తో జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు.

# మహిళలను ఉగ్రకుట్రలోకి లాగే యత్నం

- ఉగ్రవాదంపై జైషే ఆన్‌లైన్ కోర్సులకు ప్లాన్
- పలు జాతీయ మీడియాల్లో కథనాలు



ఇస్లామాబాద్, అక్టోబర్22 (జనంసాక్షి) : మహిళలను మతపరమైన ఉగ్రవాదంలోకి లాక్కొచ్చేందుకు జిహాదీ గ్రూపులు కొత్త స్కెచ్ వేస్తున్నాయి. దీంతో తమ ఉగ్రముఠాను విస్తరించాలన్న కుట్రలతో పనిచేస్తున్నట్లు సమాచారం. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకునేందుకు తొలిసారి ప్రత్యేకంగా జైషే మహిళా బ్రిగేడ్‌ను ఏర్పాటు చేసినట్లు ఇటీవల నిఘా వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటైన జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ మహిళలకు ఉగ్రవాదంపై ఆన్‌లైన్ కోర్సులు నిర్వహించనున్నట్లు నిఘా వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు తెలిపాయి. ఈ కోర్సుకు 'తౌఫత్ అల్ ముమినాత్'గా పేరు పెట్టినట్లు తెలుస్తోంది. జైషే చీఫ్ మసూద్ అజార్ చె÷-లలెళు సాదియా అజార్, సమైరా అజార్ దీనికి నాయకత్వం వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బహవల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రంపై భారత్ బాంబులు జారవిడిచిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 10 మంది మృతి చెందారు. మృతుల్లో మసూద్ బావ, సాదియా భర్త యూసఫ్ అజార్ కూడా ఉన్నాడు. కాగా మసూద్ మరో సోదరి సమైరా భర్త.. పుల్వామా ఉగ్రదాడి కుట్రదారు ఉమర్ ఫరూక్ గతంలో భారత భద్రతా దళాల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ప్రస్తుతం వీరిరువురూ మహిళా బ్రిగేడ్ సభ్యులకు ఆన్‌లైన్ కోర్సులో మతపరమైన, జిహాద్‌కు సంబంధించిన పాఠాలను బోధించనున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇతర మహిళలను కూడా ఉగ్రవాదం వైపు ఆకర్షించడానికి ఈ బ్రిగేడ్ సభ్యులు పని చేస్తున్నట్లు తెలిపాయి.

ఈ మహిళ బ్రిగేడ్‌లో జైషే కమాండర్ల భార్యలతో పాటు బహవల్‌పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరీపూర్ వంటి ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన మహిళలను సభ్యులుగా నియమించు కున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 8 నుంచి సెషన్లు ప్రారంభం కానున్నాయని.. ఇందులోభాగంగా ప్రతిరోజు 40నిమిషాల పాటు మసూద్ చెల్లెళ్లు, కమాండర్ల కుటుంబసభ్యులు మహిళలకు పాఠాలు బోధిస్తారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందు కోసం మహిళా బ్రిగేడ్‌లోని సభ్యుల నుంచి కొంత మొత్తంలో విరాళాలు కూడా సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త మహిళా బ్రిగేడ్ భారత్‌లో తన నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసే అవకాశం ఉందని ఇటీవల నిఘా వర్గాలు హెచ్చరించాయి. సోషల్ మీడియా, ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లతో జమ్మూకశ్మీర్, యూపీ వంటి ప్రాంతాల్లో మహిళలను ఈ బ్రిగేడ్‌లో చేరేలా ఆకర్షించే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో భారత అధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం.

# శ్రీలంలో మున్సిపల్ చైర్మన్ కాల్చివేత

## ప్రజాసమస్యలు తెలుకుంటుండగా దుండగుల కాల్పులు



కొలంబో, అక్టోబర్22 (జనంసాక్షి) : శ్రీలంకకు చెందిన ఓ రాజకీయ నేత పార్టీ ఆఫీస్‌లో దారుణ హత్యకు గురయ్యారు. వెలిగామా కౌన్సిల్ ఛైర్మన్ లసంత విక్రమశేఖర (38) బుధవారం తన కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సమయంలో ఇద్దరు దుండగులు ఆఫీస్‌లోకి చొరబడ్డారు. తమ వద్ద ఉన్న గన్‌తో విక్రమశేఖరపై పలురౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన విక్రమశేఖరను ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని.. దుండగుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. వెలిగామా కౌన్సిల్ నియంత్రణపై ప్రతిపక్ష సామాగి జన బలవేగయ పార్టీకి అధికార పార్టీ 'నేషనల్ పీపుల్స్ పవర్' పార్టీకి మధ్య తీవ్ర పోరు ఉన్న నేపథ్యంలో కౌన్సిల్ ఛైర్మన్ హత్యకు గురికావడం అక్కడి రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

# గ్లోబల్ సదస్సుకు కేటీఆర్‌కు ఆహ్వానం



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ మాజీ ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. శ్రీలంకలోని కొలంబోలో జరగబోయే ప్రతిష్ఠాత్మక 'గ్లోబల్ ఎకనామిక్ అండ్ టెక్నాలజీ సమ్మిట్(గెట్స్) 2025' సదస్సులో ఆయనకు కీలకోపన్యాసం చేసేందుకు ఆహ్వానం అందింది. ఈ సదస్సు నవంబర్ 10 నుంచి 12, 2025 వరకు కొలంబోలోని 'ది కింగ్స్‌బరీ హోటల్'లో జరగనుంది. శ్రీలంక సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తరఫున గెట్స్ శ్రీలంక డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎయుఎల్ఎ హిల్మీ ఈ ఆహ్వానాన్ని కేటీఆర్‌కు పంపారు. ఇన్నోవేషన్, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై చర్చించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విధాన రూపకర్తలు, పారిశ్రామిక వేత్తలు, సాంకేతిక నాయకులను ఈ సదస్సు ఒకే వేదికపైకి తీసుకురానుంది. డాక్టర్ హిల్మీ తన లేఖలో ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి రంగాలలో తెలంగాణను భారతదేశంలోనే అత్యంత శక్తివంతమైన కేంద్రంగా తీర్చిదిద్దడంలో కేటీఆర్ పోషించిన 'విశిష్ట కేటీఆర్ నాయకత్వాన్ని, పాత్రనును కొనియాడారు. పెద్ద ఎత్తున పారిశ్రామిక, సాంకేతిక కార్యక్రమాలను ఆయన నడిపించిన విధానం... అనేక వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకు ఒక ఆదర్శంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. కేటీఆర్ పాల్గొనడం వల్ల "దక్షిణ ఆసియాలోని విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు స్ఫూర్తి పొందుతారని గెట్స్ 2025 సదస్సు కార్యదర్శి తెలిపారు. అలాగే, సాంకేతిక, ఆర్థిక వృద్ధిలో భారతదేశం – శ్రీలంక సహకారాన్ని బలోపేతం చేయడానికి ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు వివిధ దేశాల నుండి మంత్రులు, పెట్టుబడిదారులు, స్టార్టప్ నాయకులు, ఆవిష్కర్తలు హాజరవుతారని, సుస్థిరమైన, సాంకేతికత ఆధారిత ఆర్థిక వ్యవస్థలను నిర్మించడంపై దృష్టి సారిస్తారని తెలిపారు.

# సర్ఫరాజ్‌పై కాంగ్రెస్ నేత వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబర్22 (జనంసాక్షి) : బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌ను బీసీసీఐ పక్కనపెట్టేసింది. సౌతాఫ్రికా ఏ జట్టుతో జరిగే ఇండియా ఏ జట్టును ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ బృందంలో సర్ఫరాజ్ ఖాన్ లేకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. భారతీయ జట్టు ఎంపిక ప్రక్రియలో మతపరమైన పరిణామాలు జరుగుతున్నట్లు కాంగ్రెస్ నేత షమా మొహమ్మద్ ఆరోపించారు. ఆ ఇంటి పేరు ఉన్నందుకే సర్ఫరాజ్‌ను ఎంపిక చేయలేదా అని ఆమె అడిగారు. ఇలాంటి అంశాల్లో చీఫ్ కోచ్ గౌతం గంభీర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో తమకు తెలుసు అని ఆమె పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. క్రికెట్ జట్టును మతం ఆధారంగా విభజించాలని చూస్తున్నట్లు బీజేపీ ఆరోపించింది. వాస్తవానికి సర్ఫరాజ్ ఖాన్ చివరిసారి స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో ఆడాడు. ఇక గాయం వల్ల ఇటీవల ఆస్ట్రేలియా ఏతో జరిగిన సిరీస్‌కు కూడా ఎంపిక చేయలేదు. సౌతాఫ్రికా ఏ జట్టుతో జరిగే సిరీస్ కోసం భారత కెప్టెన్‌గా రిషబ్ పంత్‌ను ఎంపిక చేశారు. రిషబ్ మళ్లీ జట్టులోకి రావడం వల్ల సర్ఫరాజ్‌ను పక్కనపెట్టేశారని ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై రాజకీయ వివాదం చెలరేగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రతినిధి షమా మొహమ్మద్ ఆ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

# నవాబు షేక్ ఇబ్రహీం నియామకం

హైదరాబాద్ (జనంసాక్షి) : ఏఐసీసీ జాతీయ అసంఘటిత కార్మికుల కాంగ్రెస్ (కాందార్, కర్మచారి కాంగ్రెస్) ఉపాధ్యక్షులుగా తెలంగాణకు చెందిన నవాబు షేక్ ఇబ్రహీంను నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్గనైజేషన్ కేసి వేణుగోపాల్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా బుధవారం నాడు ఇబ్రహీం గాంధీ భవన్ లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ని కలిసి తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కౌశల్ సమీర్ కూడా పాల్గొన్నారు.

# రాజన్న దర్శనాలను నిలిపేసిన అధికారులు

వేములవాడ, అక్టోబర్22 (జనంసాక్షి) : కార్తీక మాసం కావడంతో వేములవాడ రాజన్నకు భక్తుల తాడికి విపరీతంగా పెరిగింది. ఉదయం నుంచి స్వామివారికి మొక్కులు చెల్లించుకునే క్రమంలో తలనీలాలు సమర్పించుకొని దర్శనానికి రాగా బంద్ చేసినట్లుగా భద్రతా సిబ్బంది వెల్లడించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వామివారిని దర్శించుకునేం దుకు ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చాలా ప్రాంతాల నుంచి వచ్చామని భక్తులు వెల్లడించారు. ఉదయం స్వామివారికి అభిషేకం చేసుకునే భక్తులకు మాత్రం అనుమతినివ్వగా భక్తుల సంఖ్య పెరిగిపో తుండడంతో ఆలయంలో రేకుల షెడ్డు తొలగించే పనుల్లో భాగంగా బంద్ చేసిన ట్లుగా ఆలయ అధికారులు వెల్లడించారు. ప్రచార సాధనాలు పెరిగాయని, ముందస్తు సమాచారం ఇచ్చి ఆలయాన్ని మూసివేస్తే బాగుంటుంది కదా అని భక్తుల అభిప్రాయ పడ్డారు. ఒక్కసారిగా భక్తులు ఉత్తర ద్వారం వద్ద చేరుకొని ఉన్న కాస్త భక్తులైన దర్శించుకునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రాధేయపడ్డారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్, అక్టోబర్22 (జనంసాక్షి) : నైరుతి బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడింది. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ గురువారం మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకొని ఉన్న నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారుతుందని వాతావరణశాఖ పేర్కొంది. ఆ తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర వైపు కదులుతూ రాబోయే 24గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధవారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ పేర్కొంది. గురువారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని చెప్పింది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, హన్మకొండ జిల్లాల్లో వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది.

# ఆరువేలు తగ్గిన బంగారం ధరలు

- అంతర్జాతీయ పరిణామాలతో తగ్గుదల

హైదరాబాద్, అక్టోబర్22 (జనంసాక్షి) : రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్న బంగారం బుధవారం భారీ తగ్గుదలను నమోదు చేసింది. ఒక్క రోజులోనే ఆరు వేల రూపాయలు తగ్గింది. హైదరాబాద్‌లో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెటర్ల పది గ్రాముల బంగారం ధర బుధవారం ఉదయం రూ.1, 27, 200కు చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 16, 600కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో మంగళవారం ఔన్స్ (31.10 గ్రాములు) ధర తగ్గడం వల్లే బంగారం ధరల తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది. ఔన్స్ 24 క్యారెట్ల బంగారం ధరం ఏకంగా 245 డాలర్లు క్షీణించింది. 4097 డాలర్లకు దిగి వచ్చింది. మరోవైపు వెండి కూడా ఔన్స్ ధర 3.9 డాలర్లు తగ్గి 48.39 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో వెండి ధరలు కిలోకు దాదాపు రూ.2 వేలు తగ్గి రూ.1.80 లక్షలకు చేరుకున్నాయి. 2013 తర్వాత ఈ రెండు లోహాలు ఒక్క రోజులో ఇంత భారీగా పతనం కావడం ఇదే తొలిసారి. ఈ రెండు లోహాలు గరిష్టాలకు చేరువు కావడం, అంతర్జాతీయంగా డాలర్ తిరిగి బలోపేతం కావడం, పలు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లబడడం అంతర్జాతీయ విపణిలో బంగారం ధర పతనానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. మంగళవారంతో పోలిస్తే 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.6 వేలు తగ్గింది. ఇటీవల రికార్డు గరిష్టాలకు చేరిన బంగారం, వెండి లోహాల్లో మదుపర్లు లాభార్జనకు దిగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్త ఉపశమించడం ఇందుకు కారణమని బులియన్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు విజయవాడలో 24 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,27,200కు చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,16,600కు చేరుకుంది. కిలో వెండి ధర రూ.1,62,000కు చేరుకుంది.

# చర్లపల్లి-దనపూర్‌ల మధ్య ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, అక్టోబర్22 (జనంసాక్షి) : పండగల సందర్భంలో చర్లపల్లి-దనపూర్‌ల మధ్య ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 23, 28తేదీల్లో చర్లపల్లి- దనపూర్(07049) రైళ్లు, 24,29 తేదీల్లో దనపూర్-చర్లపల్లి (07092) రైళ్లు, 26న చర్లపల్లి- దనపూర్ (07049), 27న దనపూర్-చర్లపల్లి (07050)ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు అధికారులు వివరించారు. ఈ ప్రత్యేక రైళు వచ్చి వెళ్లేప్పుడు కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, నాగ్‌పూర్, ఇటార్సీ, జబల్‌పూర్, కట్నీ, మైహర్, సత్నా, ప్రయాగ్‌రాజ్ చౌకి, పండిట్. దీన్ దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సార్, అరా స్టేషన్‌లలో ఆగుతాయని పేర్కొన్నారు.

# హరీశ్‌రావును విమర్శిస్తే ఊరుకోం

- ఎన్నికల హామీలు అమలు చేయాలి : గ్యాదరి కిశోర్



హైదరాబాద్, అక్టోబర్22 (జనంసాక్షి) : హామీలు అమలు చేయడం చేతకాదు గానీ, ప్రతిపక్షాలపైనే విమర్శలు చేయడం చేతనేతదా అని మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాలు విసరడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సొల్లు లక్ష్మణ్, దున్నపోతు అని అన్నా కూడా స్పందించని వ్యక్తి.. ఇవాళ హరీశ్‌రావుకు సవాలు విసరడం సిగ్గుచేటని విమర్శించారు. రాహుల్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన చామల కిరణ్‌కుమార్ రెడ్డి కూడా నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గ్యాదరి కిశోర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ కేబినెట్‌లో జరిగిన విషయాలపై మాత్రమే హరీశ్‌రావు మాట్లాడారని తెలిపారు. హరీశ్‌రావు కాలి గోటికి సరిపోని వాళ్లు కూడా సవాలు విసురుతున్నారని మండిపడ్డారు. అడ్లూరి లక్ష్మణ్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడారని అన్నారు. మంత్రి అడ్లూరిని పట్టుకుని మరో మంత్రి పొన్నం ప్రభాకర్ దున్నపోతు అన్నప్పటికీ స్పందించలేదని అన్నారు. పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలపై గుడికి వెళ్లి ప్రమాణం చేస్తావా అని సవాలు విసిరారు. గజినీ మహ్మద్‌లాగా ఐదుసార్లు పోటీ చేశాక అడ్లూరి లక్ష్మణ్ గెలిచి.. చివరకు మంత్రి అయ్యారని అన్నారు. నియోజకవర్గంలో అడ్లూరి లక్ష్మణ్‌ను సొల్లు లక్ష్మణ్ అని అంటారని.. నువ్వు చెప్పే సొల్లు మేం వినాలా అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సోదరులకు గన్‌మెన్లను ఎందుకు ఇస్తారని ఆమె అడిగారని తెలిపారు. డెక్కన్ సిమెంట్ కమీషన్ల కోసమే గొడవంతా జరిగిందని.. దీనిపై సీఎం పిలిచి సెటిల్‌మెంట్ చేయలేదా అని నిలదీశారు. రోహిన్ రెడ్డి, కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్ ఇద్దరూ కలిసి తుపాకీ పెట్టి బెదిరించారని కొండా సురేఖ కుమార్తె చెప్పారని.. ఇంతకు ఆ తుపాకీ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. ఇంత చేస్తున్న మీది దండుపాళ్యం బ్యాచ్ కాకపోతే ఇంకేటని నిలదీశారు. చామల కిరణ్ కుమార్ రెడ్డి జడ్పీటీసీగా పోటీ చేస్తే వంకాయ గుర్తుపై 100 ఓట్లు వచ్చాయని గ్యాదరి కిశోర్ కుమార్ తెలిపారు. చామల ఒక చీటర్ అని.. రాహుల్ సంతకాన్ని ఫోర్జరీ చేస్తే.. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. వీళ్లంతా ఓటీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు అని.. ఒక్కసారి మాత్రమే గెలిచారని.. మళ్లీ గెలవరని పేర్కొన్నారు. ఇదంతా చూస్తుంటే ఆలీబాబా 40 మంది దొంగలు కాదు.. సీఎం .. ఆ నలుగురు దొంగల్లా అనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇకపై హరీశ్‌రావు మీద మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడండి అని హెచ్చరించారు. మీరు ఒక్కటంటే మేం వంద అంటామని అన్నారు.

# పత్రికా కార్యాలయాలపై దాడులు దారుణం : అల్లం నారాయణ



హైదరాబాద్, అక్టోబర్22 (జనంసాక్షి) : రాష్ట్రంలో ఎప్పుడూ లేనంతగా వార్తా పత్రికల కార్యాలయాలపై భౌతిక దాడులకు ప్రయత్నించడం, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతిసాగర్ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా నమస్తే తెలంగాణ ఎడిషన్ కార్యాలయంపైకి అధికార పార్టీకి చెందిన వందలాది కార్యకర్తలు వెళ్లి దాడికి ప్రయత్నించారని, అడ్డుకున్న సిబ్బందిని దుర్భాషలాడారని, తాము దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వార్తల విషయంలో బేధాభిప్రాయాలు ఉన్నప్పుడు న్యాయపరంగా, చట్టపరంగా ముందుకు వెళ్లాలి తప్ప ఈ రకమైన భౌతిక దాడులకు ప్రయత్నించడం ఎంత మాత్రం సమంజసం కాదని, బావ ప్రకటన స్వేచ్ఛకు ఇది గొడ్డలిపెట్టని వారు ఆవేదన వ్యక్తంచేశారు. రాజ్యాంగం కల్పించిన మీడియా స్వేచ్ఛ హక్కును హరించే విధంగా రాజకీయ పార్టీలు వ్యవహరించదాన్ని వారు తప్పుపట్టారు. దాడికి పరోక్షంగా కారకులైన వారితోపాటు ప్రత్యక్షంగా పాల్గొన్న వారు ఎంతటి వారైనా వాళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ రకమైన దాడులకు పూనుకుంటే జర్నలిస్టు సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. జర్నలిస్టు సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రజలకు వాస్తవాలను వివరిస్తాయని చెప్పారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370